# ప్రేమ హృదయం

## (వింధియా కధలు)



అనువాదం: ఏండీ సుందరేశన్

**PREMA HRUDAYAM (Vindhiya Kathalu)**
*(Anthology of Vindhiya's Short Stories in Telugu)*
***Volume1***
తెనుగు అనువాదం© Kurinji Publications, California, USA

సంపుటం - 1

First Edition, 2018

© KNS Family/Surviving Members

***Cover Design:***
Erin Heck

**Front Cover:**

*Photo Credits:*

G.K. Vale & Co., Madras, India

**Back Cover:**

*Photo Credits:*

Rajam Krishnan's photo: Courtesy: *The Hindu*
Used with permission.

## Printed at:

The Copy World
2001 3rd Street,
San Francisco, CA 94107
Phone: 800.930.COPY

# ప్రేమ హృదయం

## (వింధియా కథలు)

## మూలం: తమిళం

## అనువాదం: ఏండీ సుందరేశన్

**Published By**

**Kurinji Publications**
**10944 San Pablo Avenue # 610**
**El Cerrito, CA 94530, USA**
**Email:**
**rangan.sundaresan@gmail.com**

# విషయ సూచిక

**ముందు మాట**

పేజీ

1. ప్రేమ హృదయం
2. చుక్కల ముగ్గు
3 అనుమానించే అబల
4. మతిమరుపు
5. కీర్తి
6. ఊహాలోకం
7. మంచి మనసు
8. కొంచెం సమయంలో
9. తామర తటాకం
10. జాలి గుండె
11. కాలక్షేపం

# ముందుమాట

మా అక్కయ్య ఇందియాదేవి 1947-60 మధ్య తమిళ జనరంజక పత్రికలలో 'వింధియా' అనే కలంపేరుతో కథలు రాసి రచయిత్రిగా ఖ్యాతి పొందారు. "మా అమ్మాయి నూరు కథలు రాసి, ఆ తరువాత తటాలున ఆపేసింది!" అని మా అమ్మ ఇరుగుపొరుగులవారికి చెప్పినట్టు నాకు గుర్తు. కాని ఆఖరికి 80 కథలూ, మూడు వ్యాసాలూ, ఒక నాటకమే దక్కాయి. ఆవిడ రాసిన ఒకటే నవల **రాజేశ్వరి** అనే పేరుతో ఇటీవల ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ అనువదించడమైంది.

ఇందియా దేవి తెలుగులో కథ రాసారన్న సంగతి నాకు ఫిబ్రవరి, 2017 లోనే తెలిసింది. మా తల్లిదండ్రులు తిరుచ్చిలో నివాశం చేసిన గ్రామంకి నేను వెళ్ళినప్పుడు 'ఇందు' అనే కలంపేరుతో ఆమె రాసిన 'కాలక్షేపం' కథ నాకు దొరికింది. అది ఈ సంపుటంలో చేర్చబడింది.

ఇవన్నీ సుమారు 60 సంవత్సరాలముందు ప్రచురమైన కథలు. వాటిని అప్పుడప్పుడు పోగుచేసి, అనుక్రమణించి, రక్షించే బాధ్యత - ముందు మా నాన్నగారు, ఆ తరువాత మా పెద్దన్నయ్య నారణన్ - వహించారు.

1999 లో ఇందియా దేవి కన్ను మూసింది; బావగారు 2001లో గతించారు.

2007లో నేను వింధియా కథలు పది ఇంగ్లీషులో అనువదించి, సుందరేశన్ కుటుంబ సభ్యుల ప్రోద్బలంతో Cupid's Alarms అనే కథల సంపుటం ప్రచురించాను; ఆ తరువాత రెండు కథలు తెనుగులో అనువదించి, website లో పోస్ట్ చేసాను. మిత్రులు కే.వి. శేషారావుగారు (విజయనగరం) నాలుగు కథలు అనువదించారు. అవీ మీరు www,kurinjipubs.com లో చూడగలరు. 'బరంపురం అమ్మవారి సంబరాలు' అనే వ్యాసమూ అందులో ఉంది.

వింధియా రచనలన్నీ తెలుగులో అనువదించి ప్రచురించాలని నా అభిలాష. ఆ ప్రణాళికలో ఇది మొదటి మెట్టు. ఈ ప్రచురణకి కారకులు నన్ను ప్రోత్సాహించిన అన్నదమ్ములు, నారణన్, శ్రీను, అక్కయ్య, శెల్వి.

ముఖ్యంగా నేను అనువదించిన కథలని చదివి, దిద్ది, పాఠ్య వివరణని నిమ్మళించి, మంచి సలహాలు ఇచ్చిన అక్కయ్య శెల్వీ విశ్వనాథన్ కి నా కృతజ్ఞతలు.

ఈ కథలు చదవి పాఠకులు ఆనందిస్తారని నా ఆశ.

El Cerrito,
11-15-2018

ఏండీ సుందరేశన్

# ప్రేమ హృదయం

నేను మా శ్రీవారు ఆఫీసునుంచి తిరిగిరావడం ఆతురగా ఎదురుచూస్తున్నాను. గత రెండురోజులుగా అతను తన మిత్రుడితో ఇంటికి వస్తున్నారు; ఇవాళకూడా అతనితో వస్తారేమో అని నాకు మనస్సులో ఆరాటం. ఇలాగ రోజు తన స్నేహిడుతో రాకపోతే మరేం కొంప మునిగిపోతుందా?

నా మనస్సులోని భావాలని మావారితో చెప్పాలని నేను ఎంతో ప్రయత్నించినా బయట చెప్పడానికి వీలుకాదు. అతని మిత్రుడు శేషన్ పై నాకున్న ద్వేషాన్ని వివరించడానికి నాకు చేతకావడంలేదు. నా మనస్సు కలవరపడుతుంటే నేనేం చెయ్యను?

ముఖ్యంగా నాకు శేషన్ మీద ఈ వైరం అతని భార్య సీత కానుపుకి తన ఊరుకి వెళ్ళిన తరువాతనే ఆరంభించింది. ఆమె ఊరులో ఉన్నంతవరకూ శేషన్ దంపతులు మా సన్నిహిత స్నేహితులు. వాళ్ళు మాయింటికి వస్తుంటారు; మేమూ వాళ్ళయింటికి వెళ్ళేవాళ్ళం. శని, ఆదివారాల్లో మేం నలుగురం ఇక్కడనుంచి ఎనిమిద మైళ్ళ దూరంలోవుండే నగరానికి వెళ్ళి దాని సొగసు, ఆ మరీనా బీచు గాలి, ఆ పక్కనేవున్న రెస్టారంట్లో భోజనం అన్నీ అనుభవించేవాళ్ళం.

సీత మాతో ఉన్నంతవరకూ నాకు ఆ దంపతుల స్నేహం నచ్చేది. సీత ఊరుకి వెళ్ళి రెండు నెలలయ్యాయి. ఆ తరువాతనే శేషన్ మా ఇంటికి వచ్చే రోజులు ఎక్కువయ్యాయి. నేను, మనసార, అతని రాకలు తగ్గాలని ఆశ పడ్డాను.

అటువంటి ఆలోచన రాగానే దాన్ని గిల్లి పారేయాలనుకొని నేను నాలో చెప్పుకునేదాన్ని: 'పాపం, అతని భార్య ఊరులో లేదు. అందువలనే అతను మనింటికి వస్తున్నారు. న్యాయమేకదా? నాకెందుకు అతనిమీద ఉట్టి ద్వేషం?' నేను ఓదార్చడానికి ఎంత ప్రయత్నం చేసినా నా మనస్సు కలవరపడుతూనేవుంది.

నా మనస్సు ఇలా ఆయాసపడుతుంటే, మా శ్రీవారు మాత్రం ఏ చింతా లేకుండా ప్రతీ ఆదివారం శేషన్ని లంచుకి పిలవడంతోబాటు మాతో సాయంకాలం మా నగర పర్యటనలో కలుసుకోమనేవారు. శేషన్ కూడా ఏ మొహమాటం లేకుండా మావారి మాట ప్రకారం మా ఇంటిలో రోజూ హాజరవుతారు.

నాకు శేషన్ చొరబాటు చూసి ఒకటే ఏవగింపు. మా ఇద్దరి మధ్యలో ఇతనెందుకు?

నాకు తెలుసు: ఇతరుల నడత, స్వభావం నాకంటే నా భర్త బాగా అర్థం చేసుకోగలరు. ఐతే వీళ్ళ ఇద్దరికీ ఉన్న చాలాకాల పరిచయంవలన మావారు ఈ బంధాన్ని తెంచులేకపోతున్నారా? ఆమాటకి వస్తే నేనుకూడా శేషన్ తో అతన్ని రోజూ చూసినప్పుడెల్లా మాట్లాడకుండా ఉండలేను. ఎవరికి తెలుసు? శేషన్ కి మా ఇద్దరిమధ్యా రావడానికి ఇష్టం లేదేమో? వాళ్ళ స్నేహం వలన, అతని భార్య ఇంటిలో లేకపోవడం వలన, శేషన్ మావారు పిలుస్తే వెంటనే 'రాను' అని అనలేకపోతున్నారేమో?

ప్రతివారం శేషన్ మా ఇంటికి లంచుకి రావడం గురించి నేనేమీ చెయ్యలేకపోయినా అతను రోజూ మావారితో తిరగడం నేను భరింపలేను. ఇదెలాగ నా భర్తతో చెప్పడం?

... ఇదిగో వాళ్ళు వస్తున్నారు ... నాకు వాళ్ళ కాలడుగులూ, మాటలూ బాగా వినిపిస్తున్నాయి! నాభర్తకు నేనిలా వాపోవడం అర్థం కాదు! నేను చెప్పితీరాలా?

ఇలాగే కొన్ని రోజులు గడిచిపోయాయి. నేను మనస్సులో బాధపడుతున్నాకూడా, "ఇక వద్దు!" అని బయటకు చెప్పలేకపోవడంలో ఈ నా ప్రవర్తనకి ఏమైనా కారణం ఉంటుందా అనికూడా ఆలోచిస్తున్నాను. ఐతే, ప్రతీ రోజూ మేం బయట వెళ్తున్నప్పుడు జరిగే సంఘటనలూ, సంగతులూ చూస్తే నాకు శేషన్ మీద అనుమానం, ఏవగింపు ఇంకా భరించలేనట్లు పెరిగిపోతున్నాయి. ఇక నాకు మనశ్శాంతి ఎలా వస్తుంది? అస్తమానమూ నాకు ఒకటే బెంగ: శేషన్ ఒక

*Gentleman* అని నమ్మవచ్చా? నా అంతరాత్మ 'అతను యోగ్యుడు కాదు!' అని అంటోంది. ఆకాశంలోని ఉరుములు, సముద్ర కెరటాలు - వాటి శబ్దం ఎలాగ ఏర్పడిందని మనం కనుక్కోగలమా? దాన్ని ఆపగలమా? అలాగే మనుషుల మనస్సుకూడా. ఎటువంటి ఆత్మపరిశోధన చేసినా దాని కలతని మనం నివర్తించలేం.

ఆనాడు మేం ముగ్గురం బస్సులో ప్రయాణం చేస్తున్నాం. మాకు దొరకిన జాగా నాకు బాగా నచ్చింది. మావారు మధ్య, నేను అతని ఎడం పక్క, శేషన్ అతని కుడిపక్క కూర్చున్నాం. ఒక స్త్రీ బస్సులో ఎక్కింది. మావారు తన ఉదార స్వభావంతో లేచి ఆమెకు తన జాగా ఇచ్చారు. శేషన్ వెంటనే ఖాళీ ఐన సీటుకి జరగడంతో ఆమె శేషన్ జాగాలో కూర్చుంది! నాకు ఒకటే మంట! తను ఒక మూడోమనిషి కాబట్టి శేషన్ తనే లేచి ఆ స్త్రీకి తన జాగా ఇవ్వవద్దూ? అదేకదా మర్యాద? అతనేమో గొప్పగా ఇప్పుడు తన జాగా ఆమెకు ఇస్తున్నారు! అతనికి ఇద్దరు స్త్రీలమధ్య కూర్చోవాలని ఉందా?

నేను తటాలున లేచి మావారికి చెప్పాను: "మీరు కూర్చోండి. నేను నిలబడతాను."

"ఏం, ఎందుకు?" అని అతను అడిగారు.

"నాకు నిలబడాలని ఉంది," అన్నాను. అతని అమాయకత్వం చూసి నాకు కోపం వచ్చింది. కాని అతని ముఖంలో ఎటువంటి చలనమూ లేదు.

"నువ్వు కూర్చో . . . " అతను మళ్ళీ అన్నారు. ఇంతలో బస్సు ఆగింది; అది గమనించి మావారు, "మనం ఇక్కడే దిగాలి," అన్నారు.

"దేవుడా! మంచివేళ! ఇక బస్సునుంచి దిగాల్సిందే!"

"ఇక మీరెప్పుడూ మీ స్నేహితున్ని మనతోపాటు రమ్మని పిలవకూడదు!" అని కటువుగా మావారితో ఇల్లు చేరగానే చెప్పేయాలని నిశ్చయించుకున్నాను.

కాని ఇంటికి వెళ్ళగానే ఆ ఆలోచన బొరిలో దూరిన కుందేలులాగ మాయమైపోయింది; నేను నోరెత్తలేదు.

స్వభావంగా మావారు ఎవరినీ తప్పుబెట్టరు. ఇతరుల బలహీతనలుకూడా అనుమానించరు. తన కళ్ళముందు జరిగేదే అతనికి తెలియడంలేదు. ప్రకృతిలో మగవారికి సహజంగా ఏర్పడే అసూయ, జుకుప్స - వీటిగురించి ఇతనికి ఎటువంటి సంబంధమూ లేదనిపిస్తోంది. మరి ఎలాగ వీటిని ఇతనితో రేకెత్తించడం?

ఇక రాబోయే వారంలో ఒకరోజు మావారు సినిమాకి వెళ్దామన్నారు. శేషన్ కూడా వస్తారట. "నేను సినిమాకి రాను," అని అన్నవెంటనే మావారి ముఖంలో మార్పు వచ్చేసింది; నేను అలా చెప్పివుండకూడదు. నేను అభ్యంతరం చెప్పినా ఏ ప్రయోజనమూ ఉండదు. శేషన్ తప్పకుండా అతనితో సినిమాకి వెళ్తారు. ఇక నేను రానంటే మావారు బాధ పడతారు. మరి ఇప్పుడు అతనితో మాట్లాడితే ఏం లాభం?

"సరే, ఇక ఇవాళ రాత్రి నా కలత ఏమిటో తప్పకుండా అతనికి చెప్పేయాలి," అని నేను నిశ్చయించుకున్నాను. మేం ముగ్గురం సినిమాకి వెళ్ళాం.

ఆ చలనచిత్రంలోవచ్చే హీరోయిన్ అందాలకి పేరుపోయిన తార. చాలామంది - మావారుకూడా అందులోవున్నారు - నన్ను ఆ తారతో సరిపోల్చేవారు. కాని, ఆ రోజు, శేషన్ నన్ను అలాగ పొగడినప్పుడు నాకు తీరని కోపం వచ్చింది. ఏం, ఎందుకు? తక్కినవాళ్ళందరూ ముందు నాకు చెప్పిన మాటలేకదా శేషన్ ఇప్పుడు అంటున్నారు? నాకు అతనిపై ఉన్న ద్వేషంవలనే నేను అతన్ని తప్పుపెడుతున్నాను. మరి, ఇటువంటి పతిస్తితిలో నా భర్తకి శేషన్ గురించి ఎలా చెప్పడం? నా మనస్సు అల్లకల్లోలంలో పడింది.

నేను మళ్ళీ ఆలోచించాను. ఇటువంటి సంఘటనలుంచి తప్పించుకోడం ఎలాగ? ఇక వీళ్ళ ఇద్దరితో నేను ఎప్పుడూ బయటకి వెళ్ళనేకూడదు!

కాని ఆ నా తీర్పు కొన్నిరోజుల్లోనే నిష్ఫలమైంది. ఏదో నెపంతో వాళ్ళతో ఎక్కడికీ వెళ్ళకుండా ఒక వారం గడిపేసాను. ఆ తరువాత వారంలో మొదటిరోజు మావారికి జీతం వచ్చేరోజు. నేనే వెళ్ళి ఇంటికి కావలసినవన్నీ జాగ్రత్తగా కొనాలి. అందువలన నేనుకూడా వాళ్ళతో వెళ్ళవలసి వచ్చింది.

మేం వెళ్ళే దారిలో ఒక బుక్ స్టోర్కి వెళ్ళాం. మేం షాపులో దూరగానే మావారు నన్ను చూసి "నువ్వు ఏమైనా పుస్తకాలు కావాలంటే చూస్తుండు; నేను పక్కనేవున్న స్టోరుకి వెళ్ళి సోప్, టూత్ పేస్ట్ కొని తీసుకు వస్తాను," అన్నారు. నేను అదిరిపడుతూ గొణిగాను: "మీరేమంటున్నారు? నన్ను ఇక్కడ ఒంటరిగా ఉండమంటున్నారా?"

"నీకెందుకు భయం. శేషన్ ఇక్కడే ఉంటాడు. నేను వెంటనే వచ్చేస్తాను," అని అంటూ మావారు గభీమని మాయమైపోయారు.

బాగుంది! శేషన్ నాకు తోడుగా ఉన్నారట! ఇదేం నాటకం? మావారికి శేషన్ ఎటువంటి మనిషని తెలుసా, లేకపోతే దానిగురించి ఏం కలత లేదా? నాకేం బోధపడటంలేదు. వీళ్ళ ఇద్దరిలో ఎంత భేదం! ఎలాగ వీళ్ళమధ్య ఇంత అన్యోన్యమైన స్నేహం ఏర్పడింది?

నా కలవరం వలన నేను పుస్తకాలేవీ చూడకుండా ఈ మిత్రుల అంతరంగ స్నేహం గురించి ఆలోచిస్తుంటే నాకు శేషన్ కంఠధ్వని వినిపించింది: "భానూ, ఇక్కడ చూడు!" ఇష్టం లేకుండానే నేను తలయెత్తి చూసాను.

"చూడు, ఆ కళ్ళు చూడు! అసలు నీ కళ్ళలాగే ఉన్నాయి! అవును, నిజమే! అసలు నీ కళ్ళే!" అతను మాట్లాడుతుంటే నా చూపు అతని ముఖంనుంచి అతని చేతిలోవున్న ఒక సంచికమీద వాలింది. అది ఒక ఆంగ్ల మాస పత్రిక. అందులో 'అందాల కన్నులు,' అనే శీర్షికలో కొన్ని కన్నులు కనిపించాయి. శేషన్ నాకు అందులో ఒక జత ('మురిసే నల్ల కన్నులు') అనే ఒక వర్ణన కింద చూపించారు. నాకు ఈ శేషన్ని చూస్తే ఆ వెయ్యిపడగల ఆదిశేషుడు గుర్తుకి వచ్చాడు.

"ఏమో . . . ఉండవచ్చు," అని గొణుకుతూ నేను నా పుస్తకాల వేటలో మునిగాను.

ఒక పెళ్ళైన స్త్రీతో ఇలాగేనా ఒక మగవాడు మెలగడం? నలుగురున్నచోట్లో ఇదేం మర్యాద!

'వెంటనే వస్తాను,' అని చెప్పి వెళ్ళిన మావారు తిరిగి వచ్చినప్పుడు నాకు ఒక యుగమైనట్టు అనిపించింది. నేను కోపంతో "ఎందుకు ఇంత ఆలస్యం?" అని అడిగాను. అతను నిశ్చలంగా, 'ఇదేం ఆలస్యం? నేను వెళ్ళి పదకొండు నిమిషాలే అయ్యాయి. మరెలా షాప్పింగ్ చెయ్యడం?" అని అంటూ తన వాచీని నా మొహంముందు చాపారు. "అదేం పుస్తకం నీ చేతిలో? బాగుందా? మనం కొందామా?" అని దాన్ని పుచ్చుకొని శేషన్ తో మాట్లాడడం ఆరంభించారు; నన్ను పుస్తకాలు ఏరుకోవడంలో ప్రవీణురాలు అని పొగడారు.

నేను నిశ్చయం చేసుకున్నాను: ఇక శేషన్ గురించి నేను ఏం మొరపెట్టినా లాభం ఉండదు. ఐతే ముందు శేషన్ మంచిమనిషి కాదు అనే నా అనుమానాన్ని నేను నాకే నిరూపించుకోవాలి. అందుకు నాకొక ప్రమాణం కావాలి; అప్పుడే మావారు నామాట నమ్ముతారు. ఉత్తికే శేషన్ గురించి గొణికితే లాభం లేదు. ఐతే సీతకి తన భర్తగురించి తెలుసా - ప్రతీ ఆడదాన్ని చూడగానే అతనికి ఏర్పడే మోజు ఎలాంటిదో అని? ఇక సీత అభిప్రాయం నాకు తెలియగానే మావారిని ఒప్పించడం సాధ్యమవొచ్చు. అతను తప్పకుండా నా మాట వింటారు . . . శేషన్ తో తన స్నేహం వదలిపెడతారు . . .

సీతకి నేను ఒక ఉత్తరం వ్రాసాను; ఏమేమో కబుర్లు రాస్తూ చివరికి నా వల నా గురిమీద వాల్చాను.

"మనం, హిందూ స్త్రీలు, భర్తలను దేవుడిగా భావిస్తాం. మనం పక్కన ఉన్నప్పుడు వాళ్ళు మనల్ని బ్రహ్మాండంగా పొగడుతారు; మన సంపర్కం

లేకుండా  జీవించలేం అంటారు. మనం దగ్గర లేకపోతే ఇంకొక స్త్రీని అలాగే పొగడుతారు! ఈ మగవాళ్ళని మనం ఎన్నటికీ నమ్మలేం!"

నేను ఈ వాక్యాలని ఒక నేపధ్యంలో గుర్తించాను.

సీత, తన ఉత్తరంలో "అవును, నువ్వు చెప్పేది నిజమే," అని రాయవచ్చు; అప్పుడు నా అనుమానం ఖాయమవుతుంది.

నా ఉత్తరాన్ని మడిచి, ఒక కవరులో పెట్టి తపాల్లో చేర్చడానికిముందు నిద్రపోతున్న మావారి మొహం చూసాను. నా హృదయం ప్రేమపూరితమై ఆయనకి నా కృతజ్ఞత తెలిపింది: "ఈ నిందారోపణకీ, మీకూ ఎటువంటి సంబంధమూ లేదు. ఇది తక్కిన మగవాళ్ళకి - ముఖ్యంగా శేషన్ లాంటి వారికే!"

సీత ఉత్తరం కొన్ని రోజుల్లో వచ్చింది: "బహూశా ప్రపంచంలో అందరూ మగవాళ్ళని నమ్మకూడదనే అంటారు. కాని మనం   మగవాళ్ళందరినీ తప్పుపెట్టకూడదు; తప్పకుండా వారిలో యోగ్యులూ, గౌరవనీయులూ ఉన్నారు. నా భర్త ఒక ఆదర్శ పురుషుడనే గర్వం నాకు ఎప్పుడూ ఉంది. మరి నీకు అలా లేదా?"

పాపం, సీత ఆమె మనస్సులో అలా నమ్ముతోందా? తన భర్త ఆదర్శ పురుషడని ఎంత ఆమెకి నమ్మకం! మా ఇద్దరిలో మా భర్తలగురించి ఎటువంటి భిన్నమైన అభిప్రాయాలు! తన భర్తపై ఉన్న ప్రేమ, విశ్వాశం వలనే సీతకి శేషన్ నిజ స్వరూపం అర్ధంకావడంలేదా?

ఐతే, నేనూ ఒక భార్యేకదా? నేను నా భర్త తప్పులెన్నరాని, నిష్కళంకమైన, ఆదర్శ పురుషుడని నమ్ముతున్నాను; ఇదికూడా ఒక భ్రమ అనవచ్చా?

మావారిని అందరూ ఒక ఉత్తమమైన వ్యక్తి, యోగ్యుడు అని మెచ్చుకుంటున్నారనే నా నమ్మకం. ఏం, తక్కినవాళ్ళందరూ అతన్ని శ్రేష్టమైన మనిషి అని అనుకోడంలేదా? మరి సీత ఎందుకు నన్ను అడుగుతోంది - 'మీవారిగురించి నీకు గర్వం లేదా' అని?

సీత ఉత్తరం చదివినవెంటనే నాలో మనశ్శాంతి ఉన్నపాటున జారిపోయింది. ఆ తరువాత ప్రతీదినం అంతులేని ఆలోచనలోనూ, కలతలోనూ నేను చిక్కుకున్నాను.

'శేషన్ లాగ కాదు నా భర్త; ఆయన వేరే రకం మనిషి,' అనే నా ఆశని నేను వదిలిబెట్టలేదు.

ఇంతలో నాకు ఇంకొక ఆలోచన: నా ఆశ అంతా ఒత్తి కలయేమో? నేనుకూడా ఒక భార్యకి ఉండే భ్రమతో బాధపడుతున్నానేమో?

ఐతే 'మావారిని నమ్మకూడదు!' అనే చింత నాకు రావడంలేదు.

మన జీవితంలో ఏర్పడే సంఘటనలు చటుక్కున ఎంత చోద్యంగా మారగలవో చూసారా? నా భర్త నేను శేషన్ గురించి చెప్పిన అపవాదం విని నన్ను తప్పుబెట్టలేదు; కాని, ఇప్పుడు నేను నా భర్తనే అనుమానిస్తున్నాను! అదెలాగ సాధ్యమైంది? నాకు తెలుసు: మా దంపత్యంకి మూలాధారం విశ్వాశం, నమ్మకం. కాని ఇప్పుడు నాకు మా వివాహబంధంలో బిగువు తగ్గినట్లు అనిపిస్తోంది...

ఆ బంధంలో ఇంతవరకూ రవ్వంత బలహీనత ఉండేదా? మా పరస్పర ప్రేమలో అది దృఢంగా ఎదుగుతున్నట్లు ఊహించి నేను గర్వపడేదాన్ని. కాని ఇప్పుడో . . .?

ఒకసారి మా వారితో నేను ఒక మాటకి అన్నాను: "మీకొక మంచి స్నేహితుడు దొరికారు! మీరు ఎన్నటికీ అతని స్నేహం విడిచిపెట్టరు!"

మావారు ఏమంటారో అని అతని ముఖం చూసాను. అతను ఏమీ అనలేదు; ఎప్పటిలాగే ఒక చిరునవ్వు!

నేను అన్నాను: "ఏ భర్త తన భార్యమీద అస్తమానం ఒక కన్ను పెట్టుకొని ఆమె ప్రవర్తనని తన అదుపులో ఉంచుకుంటాడో, అతనే ఆమెను నిజంగా ప్రేమిస్తున్నాడు. అలాగ కాకుండా ఏ భర్త తన భార్య పరాయివాడితో మెలుగుతూంటే దాన్ని లెక్కచేయడో అతను ఆమెను నిజంగా ప్రేమించలేదని

అర్థం." ఈ మాటలు నా నోటినుంచి వచ్చేసాయికాని, ఆ సమయంలో అక్కడ నిలబడి మావారి మొహం చూడడానికి నాకు ధైర్యం రాలేదు. నా మనస్సు పడుతున్న బాధలన్నీ ఒక్కసారి బయటకు లాగి వెలడించడానికి కావలసిన కఠిన హృదయం నాకు లేదు కాబోలు; అంతేకాక, నాకు వచ్చిన కోపంలో అతన్ని నా కటువైన మాటలతో వాయించడానికి నాకు పాండిత్యం చాలదు. ఆఖరికి, ఏమేమో మాటలు నాలోనే చెప్పుకొని, నా నిరాశని బహిర్గతం చెయ్యడానికి వీలుగాక, మళ్ళీ నాలో నేనే చిక్కుకున్నాను.

ఈ దురవస్తనుంచి తప్పించుకోడం ఎలాగ? అందరి భర్తలలాగే - అన్నివిధాల లోపాలూ, లోటుబాట్లతో - మెలిగే మనిషేనా మావారుకూడా? నేను ఎప్పుడూ హర్షించిన పరిపూర్ణ వ్యక్తికాదా అతను? ఇక నాకు ఎక్కడ మనశ్శాంతి?

జాగా మారితే? నాలో ఇప్పుడున్న స్వల్పబుద్ధి, పిసినారితనం నాకే అసహ్యంగా కనిపిస్తున్నాయి. . . . ఊరు వదిలి వెళ్తే ఒకవేళ నా మనస్సులోని మబ్బు మెల్ల మెల్లగా మరుగనపడవచ్చు . . .

నేను మావారితో చెప్పాను: "నాకు మరొక ఊరుకి వెళ్ళాలని ఉంది." ఈ మాటలు తడబడతూనే అన్నాను.

"సరే, తప్పకుండా," అన్నారు అతను. "నేను మూడు వారాలు శెలవు తీసుకుంటాను. పదిరోజులు మీ తల్లిదండ్రులతో, పదిరోజులు నా తల్లిదండ్రులతో గడపవచ్చు. *Let's have some fun!*" అని ముగించారు.

అతను చెప్పిన తీరు చూసి నాకు ఒకటే పరవశం. మేమిద్దరం కలిసివుంటాం అనే వంకలో నాకు మనశ్శాంతి లేకపోయినా మావారి మీదున్న ప్రేమ, అభిమానంవలన నాకు అతని ఆలోచన బాగా నచ్చింది. అంతేకాక, కొన్ని రోజులు ఇతనికి శేషన్ సహవాసం ఉండదు అన్న కారణంవలన ఈ ప్రయాణం మంచిదే అని నాకు అనిపించింది.

** ** **

మా ప్రయాణంకి సిద్ధమైయ్యాం. నా మనస్సులో ఒక వైపు మకమకలాడే ఆవేదన, కాని నా ఊహలో రాబోయే శుభదినాలని నేను ఆనందిస్తున్నాను.

ముందు మా అత్తగారింటికి వెళ్ళాం.

ఇంతకుముందు నేను మా అత్తగారింటికి - నాలుగైదుసార్లు - ఏమైనా పండుగలకోసం వెళ్ళివుంటాను. ఆ పర్యటనల కాల పరిమితి కొన్నిరోజులు మాత్రమే. కాని ఇప్పుడు మేం అక్కడవుండబోయేది పదిరోజులు. నేను నా భర్త తల్లిదండ్రులను సన్నిహిత బంధువులుగా ఎరుగను. వాళ్ళని నా మిత్రులులాగే భావించేదాన్ని. ఇప్పుడు ఈ రాబోయే పరిచయం నాకు పరమ సంతోషంగావుంది. 'ఇది ఒక కొత్త అనుభవం; ఇందులో ఏం మజా ఉందో చూడవలసిందే,' అని నేను నాలో అనుకున్నాను.

కాని నాకున్న ఉత్సాహమంతా కొన్నిరోజుల్లో అణిగిపోయింది. దీనికి ముందు మేం ఈ ఇంటికి వచ్చనప్పుడు మావారు నాతోబాటు అన్నిచోట్లకూ వెళ్ళేవారు. కాని ఇప్పుడు అతని ప్రవర్తన చాలా విచిత్రంగా ఉంది. తనే, ఒంటరిగా, ఇష్టం వచ్చినప్పడెల్లా బయటకి వెళ్ళి సావకాశంగా ఇంటికి తిరిగివస్తున్నారు...

'ఏం చేస్తున్నారు ఇతను? ఎవరైనా పాత స్నేహితులని చూడడానికి వెళ్తున్నారా? మా పెళ్ళిముందు ఇతనికెవరైనా *girl friends* ఉండేవారా?' నా మనస్సులో అన్నివిధాల అనుమానాలూ తలకెత్తాయి.

ఎప్పటిలాగ కాకుండా ప్రస్తుతం ఎక్కువరోజులు ఉండడంవలన నాకు కొత్త సంగతులు కొన్ని దొరికాయి. సెంపాదిగా నా అత్తగారి మూలంగానే నేను మావారిగురించి - అతను కాలేజీలో, పడుచు తనంలో, ఎలా ఉండేవారని - తెలుసుకున్నాను.

మేం వచ్చిన కొన్నిరోజుల తరువాత ఒక యువతి మా ఇంటికి వచ్చింది; మావారు ఆమెతో చనువుగా మాట్లాడారు; ఆమె బిడ్డను అభిమానంతో తడిమారు; ముద్దుపెట్టుకున్నారు. ఆమె వెళ్ళిన తరువాత నా అత్తగారు నన్ను చూసి

అన్నారు: "ఒకప్పుడు ఆ అమ్మాయిని మా అబ్బాయికి చేసుకుందామని మేం నిజంగానే ఆలోచించాం. ఇప్పుడు ఆమె ఒక తల్లికూడా ఐపోయింది. నువ్వుకూడా త్వరలో ఒక పిల్లకి తల్లికావాలని నా కోరిక."

ఆ అమ్మాయితో మావారికి పెళ్ళిసంబంధం చూసారనే వార్త నా చెవిలో పడతూంటే నా దృష్టిలో ఇతను ఆ పాపను ముద్దుపెట్టడం అగపడింది. అర్థంలేని కోపంతో, మరేం ఆలోచించక నేను మాట్లాడేసాను: "ఆమెను పెళ్ళిచేసుకొనివుంటే ఇతనుకూడా ఒక తండ్రిగా అయివుంటారు!" నా మాటలు వాళ్ళకి అర్థమవలేదా? మావారు ఏమీ అనలేదు; అతని అమ్మగారుకూడా ఊరుకున్నారు.

ఒకనాడు మధ్యాన్న భోజనంలో మావారు అన్నారు: "ఇవాళ వంటలో అన్నీ పుల్లగా ఉన్నాయి; చింతపండు కొంచెం ఎక్కువగా వేసేసావు కాబోలు!"

"నిన్నేమో చారు పుల్లగావుందన్నారు. ఇవాళ వంట అంతా పుల్లమయం అంటున్నారు," అని నవ్వుతూ నేను మావారిని ఉడికించాను:" ఏమో, కొన్నిరోజుల్లో నా గురించికూడా అలా అంటారేమో?" అని అడుగుతూ మా అత్తగారి మొహం చూసాను. ఆవిడ ఏమీ అనలేదు.

'నువ్వేం బాధపడకు; వీడు అలాగేం చెయ్యడు,' అని మా అత్తగారు ఒక మాటచెప్పి నాకు ఓదార్పు చెప్పివుంటే? మరి ఎందుకు ఆవిడ అలాగ అడగలేదు?

నా అత్తమామల దగ్గర శెలవు పుచ్చుకోవడానికి సమయం కొన్నిరోజుల్లో వస్తోంది. నేను ఒకనాడు మూటలు కట్టుతుంటే మా అత్తగారు తన భర్తతో చెప్పేది నా చెవిలో పడింది.

"చూసేరా, పెళ్ళి తరువాత వాడు ఎంత మారిపోయాడో? పెళ్ళాం ఏం చెప్పినా సరే అంటున్నాడు!"

"అలాగేం అనకు. ఆ అమ్మాయి వింటే బాధపడుతుంది," అన్నారు ఆయన.

"విననీ! తప్పకుండా ఒకరోజు తెలియవలసిందేకదా?" అని ఆవిడ బదులు చెప్పారు.

ఓ! అదా సంగతి! నా అనుమానం సరే అన్నమాట! పెళ్ళికి ముందు మావారు వేరొక మనిషిగా ఉండేవారు, నేనతన్ని బాగా మార్చేసాను అని వీళ్ళు అంటున్నారు. నేను పడుచు పెళ్ళాం కదా? ఐతేమరి, మేం ఇలాగే ఉంటే అంతా సర్దైపోతుందా? ఇది స్థిరమేనా? ఇంకా ఎన్నిరోజులు ఈ దాంపత్యం? అనుకోకుండా గభీమని ఒక తూలినాళికమీద నిప్పు పడతే ఏమవుతుంది?

నేను నోరు మూసుకొని అక్కడనుంచి వెళ్ళిపోయాను.

మావారు ఏదో పుస్తకం చదవడం చూసాను. నాకు పట్టరాని కోపం వచ్చింది. అతన్ని చూసి, "మీరెందుకు హాయిగా నన్ను వదలి బయటికి వెళ్ళకూడదు? మీకెవరూ స్నేహితులు లేరా?" అని అరిచాను. అతను ఏమీ కానట్టు అలాగే కూర్చున్నారు! మళ్ళీ ఒక చిరునవ్వు - నన్ను లెక్కచేయనట్టు. ఇప్పుడంతా అతను నాతో బొత్తిగా మాట్లాడడంకూడా మానేసారు!

ఆరోజు, సాయంకాలం, మేం మా రెండవ మజిలీకి తయారయ్యాం. ప్రయాణంలో నాకు చాలా ఉత్సాహం, కాని మనస్సులో ఒకటే ఆరాటం. ఇకవచ్చే పదిరోజులూ నా తల్లిదండ్రులతో గడుపుతాం.

నా అమ్మ, నాన్న, పెద్ద అన్నయ్య, వదిన, నా చెల్లెలు, తమ్ముడు అందరూ మమ్మల్ని చూసి చాలా సంతోషించారు. ఇది నేను పుట్టిపెరిగిన ఇల్లు కదా? ఇక్కడ నాకు ఎంత స్వతంత్రం, ఎన్ని హక్కులు! నాకు పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళినతరువాత నేను కొన్నిసార్లు ఇక్కడికి ఒంటరిగా వచ్చాను; ఇప్పుడే మావారు నాతో వచ్చారు. నేను రావడమేమో ఒక బాధ్యతగల భార్యలాగ. కాని ఇంటికి వచ్చినవెంటనే నా కుర్రతనం నన్నుమీరి బయలుపడింది! మేం ఇంటికి వచ్చినతరువాత మావారు నన్నేమో అడిగారు; నేను నా చెల్లెల్ని మావారికి అప్పగించి పొరుగింట్లోవున్న నా స్నేహితురాలిని చూడడానికి వెళ్ళిపోయాను! ఈ సంఘటన మేం మా ఇంటికివచ్చిన కొన్ని నిమిషాలలో జరిగింది; పాపం మావారు!

ఐతే, కొన్నిరోజుల్లో నేను ఇంకొక సంగతి గమనించాను. నేను మావారికి ముందులాగ సేవ చెయ్యడంలేదని చిరాకు పడుతుంటే అతనుమాత్రం నాకోసం తాపత్రయం లేకుండా, తనకు కావలిసినదేదో నా చెల్లెలు, తమ్ముడు మూలం అడిగి పుచ్చుకున్నారు. నేను అతన్ని మరిచిపోయానా? లేదు, అతనే నేను ఈ ఇంట్లో ఉన్నానని మరిచిపోయినట్టున్నారు! 'నేను ఈ ఇంటి అల్లుడ్ని,' అనే హోదాలో అతను ఈ ఇంటిలో స్వతంత్రంగా తిరిగినాకూడా నన్నెప్పుడూ తన భార్య అనే హక్కుతో 'నాకు ఇది కావాలి, నాకు అది కావాలి' అని అడగడం మానేసారు.

ఒకరోజు నేను కోపంతో నా భర్తముందు కేకలుపెట్టి "నా ఫ్రెండుతో నేను ఇప్పుడు షాపింగ్ వెళ్తున్నాను," అని బయలుదేరాను. "సరే, తప్పకుండా వెళ్ళు," అన్నారు అతను, యధాలాపంగా నవ్వుతూ. నేనెలాపోతే ఇతనికేం? నా చెల్లెలతో చెస్ ఆడడానికి ఇతను కూర్చున్నారంటే ఏక చింతతో ఎన్ని గంటలైనా ఉండగలరు! దాహానికి ఒక గ్లాసు నీళ్ళు కావాలన్నా నన్ను అడగరు - నేను ఇంట్లో ఉన్నాకూడా! నా సొంత చేతులతో ఏదైనా పుచ్చుకోవాలని అతనికి ఎందుకు తోచడం లేదు? ఈ చాపల్యం ఎందువల్ల - ఇది నేను తెలుసుకోవద్దూ? నన్ను ఉపేక్షించి ఏమీ జరగనట్టు మావారు ప్రవర్తించడంచూసి నాకు పట్టరాని కోపం వచ్చింది. కావాలనే అతన్ని కటుపైన బాష, కొంటె మాటలతో ఈసడించడం ఆరంభించాను. అప్పుడప్పుడు నాకే అనిపించేది: 'నేను చేసేది న్యాయమేనా?' కాని నా నాలికని లోబరచుకోడం నాకు చేతకాదు. ముందెల్లా మావారి మనస్సు బాధపడకూడదని జాగ్రత్తగా ఉండేదాన్ని, కాని ఇప్పుడు నేను చేసేదంతా అందుకు విరుద్ధంగా ఉంది. అవును, నిజమే! ప్రస్తుతం నాకు మావారిమీద ఎటువంటి అపార్థం లేదనీ, ఇతను నిజంగా ఎటువంటి మనిషని నాకు తెలిసిపోయిందని మావారు తెలుసుకోనీ! ఇతనిపట్ల వాకేం భ్రమ లేదు; ఇతనిలోని లోపాలూ, లోటుపాట్లూ, నాకు బాగా తెలుసు! అది బయటపడితే ఇతని సిగ్గుతో తల వంగాలి! అదే నా ఆశయం!

ఇప్పుడుకూడా మావారు నన్ను హర్షించే భర్త కాదు అని నేను వక్కాణించి చెప్పలేను. కాని ఎప్పటిలాగే అతన్ని నేను పూజించడం ఎలాగ సాధ్యం? ఎవరికి తెలుసు? భవిష్యత్తులో నేనే ఇతన్ని నేను కూర్చోబెట్టిన ఆ సింహాసనంనుంచి కిందకు తోసేస్తానేమో?

మా శెలవు ముగించి మేం మా ఊరుకి తిరిగిరావడానికి ఇంకా కొన్నిరోజులేవున్నాయి. "మనం ఊరికి తిరిగివెళ్ళాలికదూ?" అని మావారు నన్నడిగారు.

"ఏం, మీకు ఊరికివెళ్ళి డ్యూటీలో జాయిన్ అవాలని లేదా?" అని నేను ఉత్తికే అతన్ని ఉడికించాలని అనుకున్నాను. కాని నోరు విప్పి ఏమీ అనలేదు.

"ఈ రెండు వారాలూ త్వరగా గడిచిపోయాయికదూ?" అన్నారు మావారు.

నా చెల్లెలు, తమ్ముడు గభీమని ఎందుకో గట్టిగా నవ్వారు. ఇందులో నవ్వడానికి ఏముంది? మావారు ఏం అన్నారని? నాకు కోపం వచ్చింది.

"ఐతే రెండు వారాలూ త్వరగా వెళ్ళిపోయాయా? మీరిక్కడ ఇంకా కొన్నిరోజులుండాలంటున్నారా?" అని అడిగాను.

"నాకు ఇక శెలవు దొరకదు. కావాలంటే నువ్వు కొన్నిరోజులు ఇక్కడవుండి ఊరుకి రావచ్చు. ఏమంటావ్?" అన్నారు అతను. అతని మొహంలో ఎటువంటి కంగారూ లేదు.

మా ఊరిలో ఇక్కడలాగ కాకుండా ఇతను నన్ను వదిలి ఉండవచ్చు; అదేనా ఇతని పథకం? నిస్సంతోషంగా, కోపంతో నేను చెప్పాను," సరే, నేనుంటాను!"

చివరికి మావారు ఊరుకి వెళ్ళడానికి తయారయ్యారు. నాకూ అతనితో వెళ్ళాలనే ఆశ. కాని నామనస్సులో నిజంగా ఏముందో అర్థం చేసుకోలేని మనిషితో నేనెందుకు బలవంతంగా వెళ్ళాలి? నాకు ఆత్మగౌరవం, అహంకారం లేవా? నేను ఊరకే బయట నిదానంగా కనిపిస్తూ మావారు ఊరు వెళ్ళేవరకూ అతనితో ఎటువంటి సంపర్కమూ పెట్టుకోలేదు; ఎక్కువగా మాట్లాడలేదు. ఏమైనా చనువు

చూపిస్తే నా కళ్ళు చెమ్మగిల్లుతాయో అని ఒక భయం! కాని, అదేం జరగదు! ప్రతిధ్వని లేనిచోట ఎందుకు అరుపు?

చివరికి నాతో చెప్పుకొని ఊరుకివెళ్ళే సమయం మావారిలో కొంచెం చనువు కనిపించింది. అతనేం నన్ను ఓదార్చడానికి ప్రయత్నిస్తున్నారా? అదేంకాదు! మా పేర్పాటు తప్పనిసరియా? అదికూడా నిజంకాదు; కావాలంటే అతను నన్ను సహజంగా 'నువ్వుకూడా నాతోరా' అని అడిగుండవచ్చు. నిజంగా అతని మనస్సులో శెలవుల తరునాత ఇటువంటి జాగాన్ని వదిలివెళ్ళడావికి ఇష్టం లేదు. నేను లేకుండా అతను మా ఊరిలో పదిరోజులు హాయిగా ఉండవచ్చుకదా? కొన్నిరోజుల్లో నేనుకూడా ఊరికి వచ్చేస్తాను: మరెందుకు నాకోసం ఈ నాటకం ఆడాలి?

నిజం చెప్పాలంటే మగవారికి ఆడవారి సహవాశం ఒక ఆహ్లాదకరమైన అనుభవం. అందుకు శేషన్ ఒక మంచి నిదర్శనం. మావారుకూడా నా చెల్లెలు, వదినతో ఉత్సాహంగా మెలుగుతారు. మన హిందూ కుటుంబాల్లో బహిరంగంగా ఆడవారు మగవారితో మెలగడం అరుదు. మగవారితో నిరాటకంగా కలిసి మెలిగే స్త్రీలు కొంతమందే కనిపిస్తారు. వాళ్ళని చూడగానే ఈ మగవారు పిచ్చేక్కినట్టు ఏమేమో చేష్టలు చేస్తూ వాళ్ళతో సల్లాపం చేస్తారు. ఆ కులుకులాడే స్త్రీలుకూడా వాళ్ళ ఆటల్లో కలుసుకుంటారు. కాని వాళ్ళు కొందరే. కాని మగవారందరూ అలాగే!

పాపం, సీతకి తన భర్త ఎలాంటివారని తెలియదు. నేను అదృష్టవంతురాలిని. ఆపద రావడానికి ముందే నాకు మెలకువ వచ్చేసింది!

మనస్సు బాధపడుతుంటే మనకి వచ్చే ఆలోచనలన్నీ తికమకలుగా కనిపిస్తాయి. ఐతే మనస్సుకి త్రాణ ఉండడలవలన మన వాటం క్రమంగా మారుతుంది. మావారు ఊరుకి వెళ్ళిన తరూవాత నాకుకూడా మా ఊరుకి వెళ్ళాలని ఆసక్తి కలిగింది. ఇంతలో, మావారి దగ్గరనుంచి ఒక ఉత్తరం వచ్చింది.

"సీత ఇప్పుడు ఊరికి తిరిగి వచ్చేసింది. నువ్వు ఇక్కడ లేకపోవడం ఆమెకు ఆశాభంగం. ఆమె ఆరునెలలకి ఊరుకివెళ్ళి ఇప్పుడే బిడ్డతో తిరిగివచ్చింది. నిన్ను ఇక్కడకి రమ్మని నేను తొందరపెట్టను. నాకోసంగానీ, సీతకోసంగానీ నువ్వు వెంటనే ఊరుకి తిరిగిరావాలని లేదు. నువ్వు సావకాశంగా మీవాళ్ళతో ఎన్నిరోజులు గడపాలో అన్నిరోజులు ఉండవచ్చు."

నాకు ఈ ఉత్తరం పూర్తిగా నచ్చలేదు. నాకొక భయం; మావారుకూడా శేషన్ లాగే ఆ దంపదులమధ్య చొరపడుతున్నారా? ఇతనుకూడా, శేషన్ లాగే, తన ఆత్మగౌరవం పోగొట్టుకుంటున్నారా?

నేను నాకు ఇష్టం వచ్చినప్పుడు ఊరుకి తిరిగిరావచ్చు అని మావారు అంటున్నారు; నా ఇష్టం ఏమిటని అతనికి తెలుసా? నా మనస్సులోని వాంఛని అర్థం చేసుకునే సహానుభూతి అతనికి లేదు; నాకేమో ఊరుకి వెళ్ళాలనివుంది…

ఐతే, ఇదెలాగ నా తలిలిదండ్రులకి చెప్పడం? మావారు ఊరుకివెళ్ళి ఒక వారమేగా అయింది?

"అక్కడ ఊరులో పరిస్తితి ఏమిటో అని నాకు విచారంగావుంది; నాకు వెళ్ళాలని ఉంది," అని అమ్మతో చెప్పాను.

"ఏం భానూ, నువ్వెందుకు బాధ పడుతున్నావు?" అని అమ్మ బెంగతో అడిగింది.

"మావారు ఊరిలో నన్ను అప్యాయంగా చూసేవారు. కాని మా మామగారింటికి వెళ్ళిన తరువాత ఇతని పైఖరి బాగా మారిపోయింది. పరాయివారి మధ్యలో ఇతను పూర్తిగా ఒక కొత్త మనిషిలాగ ప్రవర్తిస్తున్నారు; ఇది నేను అతనితో ఉన్నప్పుడు కూడా జరిగింది."

"మరి నీతో మీ ఇంట్లోనూ, వాళ్ళ ఇంట్లోనూ ఒకేలాగ ప్రవర్తిస్తే ఎలాగ? ఇంకా చెప్పాలంటే అందువలన కొన్ని చిక్కులుకూడా రావొచ్చు," అంది అమ్మ.

"మా అత్తగారూ, మామగారూ ఏమంటున్నారో తెలుసా? పెళ్ళికిముందు మావారు వేరేమనిషిగా ఉండేవారట; అతను తన దుడుకుతనం నేను అతని జీవితంలో అడుగుపెట్టినతరువాతనే విడిచిపెట్టారట! మరి ఇతన్ని నమ్మడం ఎలాగ?"

"భానూ, నువ్వు ఇంత అమాయకరాలుగా ఉంటే ఎలాగ? నువ్వుకూడా మీ అత్తమామలతో ఉండివుంటే ఇవన్నీ నీకు తెలిసుంటాయి. సాధారణంగా తల్లిదండ్రులు తమ అబ్బాయి గురించి ఇలాగే అంటారు; అందులో కొంచెం నిజముంది. పడుచుతనంలో అబ్బాయికి మొండితనం, సవాలు చెయ్యడం, ఇలాంటి అలవాట్లు సహజంగా ఉంటాయి; పెళ్ళవగానే ఆ సాహసం, ధైర్యం అన్నీ వదిలేస్తారు. ఇది ప్రపంచంలో ఎప్పుడూ జరిగేదే," అంది అమ్మ.

సరే, అమ్మకూడా తన అల్లుడిగారి మంత్రానికి వశమైనట్లుంది! దేవుడా, వీళ్ళందరికీ ఎప్పుడు నేను  చెప్పేది అర్థమవుతుందో?

* * *

నేను నా ప్రయాణంకి సిద్దమైయ్యాను. అమ్మ నాకు సలహా ఇచ్చింది: "భానూ, నీకు కొంచెం చిటచిటలాడే బుద్ధి; మీ అయన నిదానమైన మనస్సుతో, నిలకడగా ప్రవర్తించే మనిషి. ఈ భేదాలు దంపతుల మధ్య ఉంటే మంచిదే. కాని అవి కాలక్రమంలో పెరిగి పెద్ద సమస్యగా మారకూడదు. నేను చెప్పేదంతా నువ్వు మీవారితో కొంచెం సర్దుబాటు చేసుకోవాలనే."

బాగుంది! వీళ్ళేమంటున్నారు? ఎందుకు వీళ్ళందరకీ మావారిమీద ఇంత తాపత్రయం? నిన్న నా చెల్లెలు, అన్నయ్య, వదిన ఏవో పాతమాటలు మాట్లాడుకుంటూ ఇలాగ అన్నారు: "పాపం, బావగారు! భాను ఎప్పుడుచూసినా అతనితో తగువులాడుతూనే ఉంటోంది!" ఎందుకు వీళ్ళు బయట కనిపించే వేషాలు చూసి మోసపోతున్నారు?

'నేను కలకాలం మావారి మాటలు వినాలి; అతనికి విరుద్ధంగా ఏమీ చెయ్యకూడదు!' ఇదే అమ్మ నాకు చేసే బోధన. నేనూ ఎప్పుడూ మావారిని తప్పుపెడుతున్నానని ఆమె వాదం. నాకు మా ఆయనమీద గాఢమైన ప్రేమ ఉంది; ఐతే అతను ఎవరని నాకు పూర్తిగా తెలియనక్కరలేదా? ఒక స్త్రీకి తన భర్తగురించి నిండుగా తెలియవద్దూ?

నేను ఇల్లు చేరుకున్నాను. "ఏమిటి, ఇలా గభీమని రావడం?" అని మావారు ఆశ్చర్యంతో అడిగారు. నేను ఊరుకున్నాను; వచ్చినవెంటనే అతనితో దెబ్బలాడవద్దని నిశ్చయించుకున్నాను. నా రాక అతనికి ఆశ్చర్యమే అని నిరుపించడానికి నాకు ఎన్నో అవకాశాలు ఇక వచ్చేరోజుల్లో దొరుకుతాయని నాకు తెలుసు . . .

"భానూ, నువ్వులేకుండా నాకు ఏంత కష్టంగా ఉందో తెలుసా?" అని మావారు అన్నారు.

"మరి మీరేకదా నన్ను మా వాళ్ళతో ఉండమని చెప్పి వచ్చేసారు?" అని తిరిగి అడిగాను.

"మీ ఇంట్లో దూరినవెంటనే నీలో ఏర్పడిన ఉత్సాహం, ఉగ్రం, ఆవేశం, నువ్వు అందరితోనూ ఉల్లాసంగా మెలగడం చూసి నేను అదిరిపోయాను. నేను నీతోవుంటే నీ స్వతంత్రానికి అడ్డుగా ఉంటానేమో అనిపించింది. అందువలనే నువ్వు నా భార్య అని కూడా మరిచిపోయాను. ఇక్కడ నువ్వు ఎప్పుడూ నాకు సేవ చేస్తూ నాకోసం అన్నిపనులు చేస్తున్నావుగా! అక్కడ మీ ఇంట్లో ఆ బాధ్యత నీకు వొద్దు అని నా కోరిక. అందువలనే నువ్వు ఎలా ఉండదలచుకున్నావో అలాగే కానీ అని నేను ఉన్నాకూడా కొన్నిసమయాల్లో నీకు కోపం వచ్చి నన్ను తప్పుబెట్టావు. నేను లేకుండా నువ్వు కొన్నిరోజులు ఉంటే నీకు మంచిది అని నాకు తోచింది."

ఉత్సాహమూ, ఆశ్చర్యమూ ఒకేసారి నా హృదయాన్ని నింపాయి. ఇది నిజమేనా? ఆ తలపే నన్ను పరవశపరిచింది.

కాని అనుమానం పెనుభూతం కదా? నేను నాలో అనుకున్నాను: 'ఈ తీయని మాటలకి ఈయన ఎదురుచూడని నా రాక కారణమా?'

ఆ మరునాడు నేను సీతని చూడడానికి వెళ్ళాను. ఆమె ఇప్పుడు నేను ముందు చూసిన సీతకాదు; బాగా చిక్కిపోయింది; ఒడిలో శిసువు. అమె మొహంలో నిష్కళంగా - ఒకలాంటి అమాయకత్యం - కనబడుతోంది. అవును, ఆమె అమాయకురాలే!

మా సంభాషణలో ఒకచోట నవ్వుతూ నేనడిగాను: "నువ్వు ఊరులో లేనప్పుడు మీ ఆయన మా ఇంటికి వచ్చేవారు. ఇప్పుడు నేను లేనప్పుడు మావారు మీ ఇంటికి దండెత్తేవారా?"

"అలాగైతే బాగున్ను," అంది సీత. ఆమె కంఠధ్వనిలోని చీలిక నాకు వింతగా తోచింది. ఆ రోజుల్లో శేషన్ మా దాంపత్యంలో పొడుచుకొని రావడం నాకు నచ్చలేదు; కాని ఇప్పుడేమో మావారు తన దాంపత్యంలో చొరపడలేదని సీతకి బాధగా ఉందా?

" నువ్వేం అంటున్నావ్ . . . ? నాకు బోధపడటంలేదు."

"ఏమో, మావారి సహవాశం అతనికి నచ్చలేదేమో? మీ ఆయన మా ఇంటికి ఒకేమారు వచ్చారు - అది మా బిడ్డను చూడడానికి . . . అంతే . . ." ఆమె కళ్ళు తడిసిపోయాయి.

"ఎందుకు? సీతా, ఏమైంది?" ఆమె ఏడవడం చూసి నేను ఉలిక్కిపడ్డాను.

కాని సీత నాకేం చెప్పలేదు. వెక్కి వెక్కి ఏడుస్తూ తన ఉద్రేకాన్ని అణచుకోడానికి ప్రయత్నం చేస్తోంది. ఆ వెక్కులమధ్య నాకు బోధపడినదంతా ఇంతే: ఇప్పుడు శేషన్ ఇంకొక ప్రేమ వ్యవహారంలో తగులుకున్నారు!

"సీతా, మనం మళ్ళీ రేపు కలుసుకుందాం. నేను నీ ఏడ్పు భరించలేను!" అని చెప్పి ఇంటికి తిరిగి వచ్చేసాను.

నా మనస్సు అల్లకల్లోలంలో పడింది. ఇంటికి రాగానే మావారితో ఫిర్యాదు చేసాను: "మీరెందుకు నాకు శేషన్ గురించి చెప్పలేదు?"

"తక్కినవాళ్ళగురించి ఎందుకు చెడ్డకబుర్లు చెప్పాలి? ఒకరోజు అవి ఎలాగైనా బయటకు వచ్చేస్తాయి. ఇప్పుడు నీకుకూడా తెలిసిందికదా?"

"సీత తనే చెప్పింది; అందువలనే నాకూ తెలిసింది. శేషన్ ఎప్పుడూ ఇలాంటి మనిషేనా?"

అవునని అతను తల ఊపారు.

"దేవుడా, మరి అతని సహవాశం మీరెలా భరించకలిగేరు? అతను నిజంగానే ఒక మంచి స్నేహితుడని మా అభిప్రాయమా? పాపం సీత! .. ఆమె తన భర్తగురించి చాలా గర్వపడేది . . . అలాంటి మనిషితో మీకెలాగ స్నేహం ఏర్పడిందని నాకు అర్థంకావడంలేదు!" కోపంతో అన్ని ప్రశ్నలూ మావారిమీద విసిరాను.

అతను నిదానంగా నాకు బదులు చెప్పారు: "మనుషులని మనం అలాగే అంగీకరించాలి. ప్రసంగాలతో, ద్వేషంతో వాళ్ళని మార్చగలమా?"

అతని మాటల్లో ఒక తీక్షణమైన సందేశం వినిపించింది.

మరునాడు నేను సీతని మళ్ళీ కలుసుకున్నాను. నేను ఆమెను ఓదార్చి, నా మనస్సులో ఉన్నదేమో చెప్పాను: "సీతా, చూడు! నువ్వు నీ భర్తను ఒక ఆదర్శపురుషుడని మెచ్చుకున్నావు. కాని ఏమైందో చూడు; ఈ ప్రపంచంలో అన్నీ ఇలాగే కాబోలు! నేనుకూడా భవిష్యత్తులో నా కలలుకూడా ఇలాగే శూన్యంగా, అర్థంలేకుండా ఐపోతాయేమో అని భయపడుతున్నాను. ఈ మగవారిని మనం ఎన్నటికీ నమ్మలేం!"

"భానూ, అలా అనకు!" అని సీత నన్ను సరిదిద్దింది. "మీవారిని తక్కినవారితో పోల్చకు! ఏనాడైనా మావారు నీ భర్త సహవాశంవలన మారవచ్చు, కాని తప్పకుండా మీవారు చెడ్డదారిలో వెళ్ళే మనిషి కాదు!"

సీతకూడా ఒకప్పుడు శేషన్ ఒక ఉన్నతమైన మనిషి అని కొనియాడలేదూ? అది ఇప్పుడు భంగపడలేదూ?

"సీతా, నువ్వుకూడా ఒకానొకప్పుడు మీవారిగురించి గర్వపడ్డావు; అతను ఒక ఆదర్శ వ్యక్తి అని అనుకున్నావు; ఆఖరికి మోసపోయావు. నీ మనస్సులో నా భర్త ఆదర్శ పురుషుడేనా? నీకు మళ్ళీ ఆశాభంగం కలిగితే?" నా మనస్సులోని ఆరాటం అణచుకొని నేను ఈ మాటలు అన్నాను.

"నా ఆదర్శ భర్తగురించి నేను కన్న కలలు ఎన్ని రోజులు? నా పెళ్ళైన నాలుగుమాసాలతో సరి!" అని అంది సీత.

"నువ్వు మరిచిపోయావా? నువ్వు పురుడికి మీ ఊరు వెళ్ళినప్పుడు రాసిన ఉత్తరం ..." అని నేను ఆమెకు జ్ఞాపకం చేసాను.

"ఓ, ఆ ఉత్తరమా?" అని అడిగి సీత ఒక క్షణం ఆగి, నవ్వి, నాతో మాట్లాడింది: "మరి దీనిగురించి నేను నిజం చెప్తానని నువ్వు అనుకున్నావా? కాని ఇప్పుడు ఇది అందరికీ తెలిసిన తరువాత ఇందులో రహస్యమేముంది? నేను ఇప్పుడు చెప్పడానికి కారణం నీకు దీనిగురించి ముందే తెలుసనే."

సీత మాటలు నాకొక సత్యాన్ని వెలువరించాయి. నా అంతరాత్మలో సీత మాటలు ఒక మాయ ద్వారాన్ని తెరిచి ఒక రహస్య గుహని నాకు దర్శనమిచ్చినట్టు అనిపించింది.

ఆమెకు తన భర్త స్త్రీలోలుడు అని తెలిసినాకూడా, తన నిజ అనుభూతులు దాచుకొని ఆ ఉత్తరం నాకు రాసింది. ఎందుకు? తన భర్త గౌరవానికి హాని రాకూడదనే అభిలాషవల్ల. ఐతే, నేనో? మావారిని, ఒక ఆదర్శ భర్తని, నా సందేహాస్పదమైన బుద్ధితో చిత్రవధ చేసాను! మా శెలవు రోజుల్లో నా ప్రవర్తనగురించి మరెలా వర్ణించడం? అమ్మ సరిగ్గానే చెప్పింది; నేను అధ్యాత్మిక ఆజ్ఞానంతో మనశ్శాంతి సంపాదించక మావారిని అస్తమానం వెర్రి పరిక్షలతో తప్పుబెడుతూ కాలం గడిపాను; అదే నాకు లభించిన నిజ అజ్ఞానం!

ఇది ఎంత పెద్ద సత్యం! సీత మనస్సు నాకు ఇప్పుడే బాగా అర్థమైంది; ఆ అమాయకురాలికి తన భర్తమీద ఎటువంటి పరిశుద్ధ భక్తి, అభిమానం! మరి నేనో? నాకెంత స్వల్పబుద్ధి!

"సీతా, నీ ఉత్తరం మొట్టమొదట నా వ్యాకూలంకి కారణమైంది; కాని ఇప్పుడు నా భవిష్యత్తుకి అది ఒక మార్గదర్శి! నువ్వు నాకంటే - సంస్కృతిలో, శీలంలో, యోగ్యతలో - గొప్పదానివి అని నిరూపించడానికి అదే నిదర్శనం!

సీతను నామనస్సు ఒకవైపు పొగడుతూంటే నాకు ఇంకోవైపు మావారిపై ఆశ్చర్యంతోకూడిన భయమూ, ఆరాటమూ కలుగుతున్నాయి. నేను నా భర్తకు తగిన భార్యేనా? నాకు ఆ అర్హత ఉందా?

మావారి ఆదరణ, అభయంకోసం నా హృదయం తపించిపోతోంది!

**********

**మూలం ప్రచురణ: కల్కి, 1951**

# చుక్కల ముగ్గు

ఇంట్లో కాపురం ఉండేది దక్షిణదేశపువాసులని తెలియజేయడానికి గడపముందరి వసారలో గీసిన ముగ్గు ఒక ఆనవాలు. ముగ్గులు వెయ్యడం మరచిపోకూడదని ఇంటిలోకూడా నేను వేసేదాన్ని. ఒకరోజు మధ్యాహ్నం నా చిన్నవాడు తన చిట్టివేళ్ళతో ముగ్గుని చెఱపాలని ప్రయత్నం చేస్తున్నాడు; వాడిని మెచ్చదగిన పనిలో మళ్ళించాలని, పక్కకి లాక్కొని, సుద్దతో  చిన్న చిన్న ముగ్గులు గీయడం ఆరంభించాను.

“లోపలకి రావొచ్చునా?” అని ఎవరో అడగ్గానే తలయెత్తి చూసాను; ఒక వితంతువు నిలబడియుంది. ఎవరని తీవ్రంగా చూసాను.

“వసారలో ముగ్గు చూడగానే మనదేశం మనుషులని తెలుసుకున్నానమ్మా! రెండురోజులుగా రావాలని ఆలోచన,” అని అంటూ ఆవిడ లోపలికి వచ్చారు.

“రావొచ్చు,” అని ఆహ్వానిస్తూ ఆవిడని కూర్చోమనికూడా చెప్పేసాను.

“టెలిగ్రాఫ్ ఆఫీసు గోపాలసామి ఇంట్లో వంటమనిషిగా పని చేస్తున్నాను; నీకు వాళ్ళు తెలుసునా?”

“పరిచయం లేదు. అసలు మేం ఈ ఊరికి వచ్చి ఆరుమాసాలే అయ్యాయి. ఈ మధ్య మా ఊరుకి వెళ్ళివచ్చాం. వాళ్ళ అమ్మాయికి వైభవంగా పెళ్ళిచేసారని విన్నాం.”

వచ్చిన స్త్రీకి గుసగుసలాడడానికి అవకాశం దొరికింది. “ఏం పెళ్ళి? ఎటువంటి వైభవమూ, ఘనమూ లేదమ్మా! వియ్యంకులెవరూ రాలేదు. పెళ్ళికొడుకు మాత్రమే వాళ్ళ పక్షం; అతని స్నేహితులు నలుగైదుగురు వచ్చారు, అంతే! పెళ్ళికూతురు పార్టీ, ఊరి మనుషులు - వీళ్ళ సందడి తప్పిస్తే మరేం చెప్పుకోడానికి లేదు!”

“ఇవన్నీ మీకెలా తెలుసు?” అని నవ్వుతూనే అడిగాను.

“నేనే అడిగి తెలుసుకున్నాను. గోపాలసామి భార్యే అన్నీ చెప్పింది. ఇదే పెళ్ళి మన ఊరులో చేస్తే ‘వియ్యంకులవాళ్ళెవరూ లేకుండా ఇదేం పెళ్ళిరా?’ అని అందరూ ముక్కులో వేలు పెట్టుకుంటారని ఇక్కడే చేసేసారట. ఈ లాంఛనాలు - ఇత్తడి బిందె, వెండి దీపం - చూసే ఈ జనులు విస్తుపోయారట! ఇవన్నీ ఎవరికి? నూతన దంపతులకేకదా? . . . అన్నీ అమరికగానే చెసినట్టున్నారు, కాని పెళ్ళికొడుకు వయసులో కొంచెం పెద్దగా కనిపిస్తున్నాడు . . . సరే, అన్నీ కలిసిరావాలంటే సంబంధం కుదరడం కష్టమే కదా? మరేం ఆటంకం లేకుండా రోజులు గడపవచ్చు అనే కారణంవలన ఈ సంబంధంకి ఒప్పుకున్నారనిపిస్తోంది.”

‘పిచ్చాపాటీకోసం ఈవిడ మా యింటికి వచ్చానన్నారు; మరి ఇతరులగురించి ఎందుకీ పనిలేని ముచ్చటలు?’ అని నేను మనసులో వాపోయాను.

“అబ్బాయికి వయస్సు ముప్ఫైనాలుగు అంటున్నారు. అమ్మాయికి ఇరవై రెండు నిండాయామో?” అని అంటూ ఆవిడ నన్ను చూసారు.

“ఏమో, నాకు తెలీదు,” అని చిక్కగా జవాబు చెప్పి ఊరుకున్నాను.

“అవును. ఇరవైరెండే నిండాయనిపిస్తోంది. అబ్బాయికి తగినట్టుగా అమ్మాయి వయస్సుకూడా కలిపి చెప్తే వాళ్ళకి తృప్తిగా ఉందేమో?” అని ఆవిడ కొంటెతనంతో నవ్వారు.

నేను నోరెత్తలేదు.

“పెళ్ళిఫోటో చూసాను. పెళ్ళికొడుకుని ఎక్కడో చూసినట్టు అనిపించింది. నీలోకూడా నా మేనకోడలు ఆడపొడుచు పోలిక కనిపిస్తోంది. ఎత్తు, నోరు, కళ్ళూ, అన్నీ దానిలాగే; కాని ఛాయలో అది తక్కువ.”

నాకే తెలియకుండా నేను నవ్వేసాను. నా ఛాయలోనున్న పిల్లవాడిని ఒకసారి దీర్ఘంగా చూసాను.

“నీ అబ్బాయికీ నీ పోలికే. ఛాయలో మీ ఆయనలాగ కాబోలు!”

నా సొంత కబుర్ల విచారణతో ఆవిడ గోపాలసామి కుటుంబం గురించి మరిచిపోయారు. మా ఊరు, బంధువులు, ఉద్యోగం, అన్నీ అడిగారు; నేనూ సుముఖంగా జవాబు చెప్పాను.

శెలవు పుచ్చుకున్నప్పుడు ఆవిడకి చాలా సంతోషం. "నాకు నీ సహాయం కావాలి. ఊరుకి ఉత్తరం రాయాలంటే నాకు రాసిపెట్టేవారెవరూ లేరు. నాకు బంధువులెవరూ లేరు, కాని మేనకోడలు, మేనల్లుడు అని ఇద్దరున్నారు. ఎప్పుడో ఒక్కసారి వాళ్ళకి ఒక కార్డు రాస్తే నాకు తృప్తి. రాయడానికి నీకేం అభ్యంతరం లేదుకదా?" అని అడగ్గానే నేను ఇక మా సంభాషణ పొడిగించకూడదని "దానికేంలెండి?" అని ఒప్పుకున్నాను.

"ఆ ఇంట్లోవున్న అమ్మాయి పద్మని అడుగుదామంటే ఎంతసేపూ ఆ పిల్లకి తన మొగుడికి ఉత్తరాలు రాయడంలోనే సమయం సరిపోతున్నట్టుంది. నీకేం భయం వద్దు! నేను నీకేం ఎక్కువ శ్రమ ఇవ్వనులే," అని చెప్పి రంగమ్మాళ్ మళ్ళీ నవ్వారు.

"నాకెందుకు భయం? రోజు రెండు ఉత్తరాలు రాయడం నాను మామూలే. ఉత్తరాలు రాయడానికి నేనప్పుడూ జంకను!" అని చెప్పి ఆవిడని సాగనంపాను. భర్తకి ఉత్తరాలు రాసిపోస్తున్న ఆ అమ్మాయిగురించి ఆవిడ చేసిన విమర్శకి నేనిచ్చిన తీక్షణమైన ప్రత్యుత్తరం అది!

కాని రంగమ్మాళ్ నా మనస్సుని బాగా ఆకట్టుకున్నారు. ఆ వితంతువు ముఖంలో ఒక కాంతశక్తి ఉంది. ఆ దక్షిణదేశం పరిసరాలనుండి దూరంగా మసలుతున్న నాతో తమిళంలో మాటాడారుకదా? ఆ బాషలో ఉన్న అద్వితీయత నేను మళ్ళీ గుర్తుచేసుకున్నాను. ఆవిడ నన్ను బాగా ఆకర్షించారు.

ఆవిడగురించి నేను మా ఆయనతో చెప్పినప్పుడు అతనొక తాత్విక ప్రశ్నకి అర్థం చెప్తున్నట్టు మాటాడారు.

"రంగమ్మాళ్ వంటి స్త్రీలకుండేదంతా వాళ్ళ మాటతీరూ, దేహ బలం. మంచీ-చెడూ తెలుసుకొని మాటాడం, కష్టపడి పని చెయ్యడం - ఇవే తమ జీవనోపాయంకి ఆధారం అని గుర్తించి ఊరూ, దేశం వదలి ప్రయాణం చెయ్యడానికి వాళ్లు పూనుకున్నారు. సహజంగా వాళ్ళలో చురుకుదనం కనిపిస్తుంది. దానితోబాటు లౌకిక జ్ఞానమూ చేరుకుంది."

అలాగే ఉండవచ్చు. కాని ఇల్లూ, బంధువులూ లేకుండా తన్నే నమ్ముకుంటూ జీవించాలంటే ఒక స్త్రీకి ఎంత గుండె ధైర్యం కావాలి?

మానవ జీవితంలో ఎన్ని దెబ్బలతరువాత ఆ దృఢబలం చోటు చేసుకుంటుందో ఎవరికి తెలుసు?

** ** **

ఆ రోజుకి విరుద్ధంగా రంగమ్మాళ్ గబ గబమని ఇంట్లో ప్రవేశించారు. ఇది ఆవిడ రావడం రెండవసారి. "ఏమ్మా, నువ్వు పనిలో ఉన్నావా? ఉంటే చెప్పు, నేను చేస్తాను. నాకిప్పుడు నువ్వు వెంటనే ఒక ఉత్తరం రాసిపెట్టాలి," అని అంటూ తన చీరకొంగునుంచి మూడు కార్డులు బయటకి తీసారు.

"ఈ మూడు కార్డులు ఉంచుకో. నాకొక కవరు ఇయ్యి. రాయడానికి చాలా ముఖ్యమైన సంగతి ఉంది. రాయడానికి ఏదీ గొప్పగా లేదని నేనెప్పుడూ కవరు కొనిపెట్టలేదు. కాని ఇప్పుడొక అత్యవసర పరిస్థితి వచ్చేసింది," అని ఆతురతో ఆవిడ నన్ను చూసారు.

"మా ఇంట్లో తపాలా ఖర్చులంటే లెక్క చెయ్యం," అని ఆవిడ ఇచ్చిన కార్డులు నిరాకరించి, చెయిలో కలం తీసుకొని ఉత్తరం రాయడానికి సిద్ధమైయ్యాను.

"ముందు, అసలు సంగతి ఏమిటో విను. తరువాత తేటగా ఎలా రాయాలో అలా అన్ని వివరాలు రాసేయ్. అవాళ పద్మ భర్తని ఎక్కడో చూసినట్టుంది అని అన్నానుకదూ? అతను మా ఊరి అబ్బాయే; పేరు మూర్తి. మూర్తి, మూర్తి అని నేనంటే ఎవరికీ గుర్తు వస్తేనా? పూర్తి పేరు అడిగాను. నరసిహ్మా మూర్తి అని చెప్పారు. అతను మా ఊరులో నాకు దూరపు బంధువు. నా స్నేహితురాలు నామగిరి పెంచి, పోషించిన అబ్బాయికి అదే పేరు. అబ్బాయికి ఆరేళ్ళు నిండినప్పుడు నామగిరి అతన్ని పెంచడం ఆరంభించింది. ఆరు సంవత్సరాలుగా అతనిగురించి ఎవరికీ ఏమీ తెలియదని ఏడుస్తోంది. మిలిటరీ ఉద్యోగంకి వెళ్లాడట. రెండు సంవత్సరాలతరువాత వచ్చి చూసాడట. ఆ తరువాత రావడం పూర్తిగా ఆపేసాడు. వాడు ఎక్కడైనా బతికి ఉన్నాడా అనికూడా తెలియక నామగిరి అంగలార్చుకుంటోంది. నేను మా ఊరికి వెళ్ళి రెండు సంవత్సరాలయ్యాయి. నా మనసులో ఈ మూర్తే నామగిరి అబ్బాయి అని ఒక ఊహ. మిలిటరీలో అతనికి మంచి ఉద్యోగమని అంటున్నారు. ఒక ఉత్తరం రాసి నామగిరికి ఉపకారం చెయ్యాలని నేను ఆలోచించాను. నామగిరిని వెంటనే రమ్మని రాయాలి. దీపావళికి

ఇంకా పదిరోజులుకూడా లేవు. వాడు సెలవు తీసుకని వస్తున్నాడు. తన అబ్బాయి కాదని తెలుస్తే నామగిరి ఊరికి తిరిగి వెళ్ళిపోతుంది. తన అబ్బాయే అంటే వదలిపెట్టదు!"

ఇంతసేపూ ఆశ్చర్యంతో ఆవిడ చెప్పే కధ వింటున్న నేను ఊరూ, పేరూ, తేదీ కూడా రాయలేకుండా ఉలికిపడ్డాను.

ఈ ఉత్తరం ఎటువంటి విపరీత పరిస్థితులకి దారి తీస్తుందో? ఈ ఉత్తరం నేనే రాసిపెట్టాలా? ఏదో పత్రంలో సంతకం చేస్తున్నట్టు నా చెయి వొణికింది. ఎక్కడో, ఒక గ్రామంలో, ఒక మూల ఒంటరిగా ఏడుస్తున్న ఒక ముసలావిడకి ఈ ఉత్తరం ఆదరణ ఇవ్వవచ్చు అనే ఒక భ్రాంతి; ఐతే అతను తన అబ్బాయి కాదని తెలుస్తే ఆవిడకి నిరాశ కలుగుతుంది; వాడే వీడని ఋజువైతే, ఒక ప్రేమ హృదయం దెబ్బతో కూలిపోతుంది, అంతా వ్యర్ధం అనిపిస్తుంది. అవును మరి, పద్మ తన భర్తగురించి ఎంత బాధ పడుతుంది! ఐనా ఏమీ తోచక, తనకుతానే ఉత్తరం రాయడమైంది; నామగిరిని వెంటనే రమ్మని పిలవడమైంది. రంగమ్మాళ్ నేను రాసిన ఉత్తరం తీసుకొని సంతోషంతో నాకు వీడ్కోలు చెప్పారు.

మా ఆయనకి దీనిగురించి చెప్పాను. అతను "నాకు ఆవిడ ఊహ సరే అనిపిస్తోంది; లేకపోతే డబ్బు ఖర్చుపెట్టుకొని త్వరగా రమ్మని ఎందుకు చెప్తారు?" అని అడిగారు.

ఉత్తరం రాసిన నాకు మనశ్శాంతి లేదు. "ఇతరుల వ్యవహారాల్లో నేను జోక్యం చేసుకోను!" అని ఆవిడతో గట్టిగా చెప్పివుండవచ్చు; కాని ఆవిడ గాభరా చూసి నాకు మరేం తోచలేదు.

పద్మని నేను రెండుమూడుసార్లు చూసి ఉన్నాను; శాంతియుతమైన ముఖం; కన్నులలోనూ యౌవన ఉద్రేకం కనిపిస్తుంది. దేవుడి దయవల్ల ఆమెకు మనశ్శాంతి లభించాలని మనసులో ప్రార్ధించుకున్నాను.

ఒక వారం తరువాత రంగమ్మాళ్ 'ఉత్తరం వచ్చిందా?' అని అడగడానికి వచ్చారు.

మా చిరునామాతో ఆవిడకి వచ్చిన ఉత్తరం అందించాను.

"మంచి వేళ. నామగిరి ఆలస్యం చెయ్యకుండా వస్తోంది. నేనే వెళ్ళి రైలుస్టేషన్ లో కలుసుకుంటాను. ఇక దాని కష్టాలు తొలగనీ! ఆ అబ్బాయి నిన్న అత్తగారింటికి వచ్చేసాడు. పాపం, నామగిరి కష్టపడి వాడికన్నీ చేసింది. రేపు వచ్చేస్తుంది. అబ్బాయికి మంచి పరీక్ష కాచుకొని ఉంది!"

నాకు నాలిక ఎండిపోయింది. "మామీ[1], నామగిరిని ఇక్కడకి తీసుకురావొద్దు!" అన్నాను.

మామీకి నాకంటే చురుకుతం ఎక్కువే. "బాగుంది. నువ్వు నాకు చెప్పాలా? మీరందరూ ఒకే ఊరులో కలిసిమెలిసి ఉన్నారు; నాకేమో ఈ ఊరూ, గోపాలసామి ఇంటిలో ఉద్యోగమూ స్థిరం లేదు. నాకు చెడ్డపేరు వస్తే నేను లెక్కచెయ్యను, కాని మీరెవరైనా ముఖం ముడుచుకున్నట్టు నేను ఏమైనా చేస్తానా? నీకేం భయం వద్దు! 'నా చుట్టం వస్తోంది, ఒకే రోజు తిరిగి వెళ్ళిపోతుంది,' అని చెప్పి నామగిరిని నాతో ఉంచుకుంటాను. వియ్యంకులవారి బంధువు అని తెలిసినతరువాత దాన్ని ఎవరూ వెళ్ళగొట్టరు. నీకు నేనిచ్చిన శ్రమ చాలదా? ఇదిగో, ఈ కవరు తీసుకో, ఇంతసేపూ జ్ఞాపకం రాలేదు. నీకు డబ్బు ముఖ్యం కాకపోవచ్చు, కాని నాకలా కాదు; నేను హఠంచేసి తీరుతాను!" అని నవ్వుతూనే కవరుని మేజామీద పెట్టారు.

ఎదురుచూడని బహుమతి దొరికినట్టు నా మనసు ఉప్పొంగింది. మామీ ఇచ్చిన కవరుకోసం కాదు; నాకెటువంటి ఇబ్బంది రాకుండా ఆవిడ కాపాడినందుకు. కదంబ కార్యక్రమంలో నా వంతు ఇంకా పూర్తవనట్టూ, ప్రేక్షకులలాగే నేనుకూడా మిగిలినవన్నీ విని ఆనందిస్తానని నాకు బోధపడింది.

"మీరు పింటివంటలు చెయ్యాలికదూ?" అని ఆవిడకి జ్ఞాపకం చేసాను. "మీరిక్కడ రావడం వాళ్ళకి తెలుసునా?"

"తెలీదు. అవన్నీ రెండు గంటలతరువాతే చేస్తాను. పన్నెండునుండి రెండువరకు నాకు డ్యూటీ లేదు!" అని చెప్పి ఆవిడ నవ్వారు,

"నీకొక కొత్త వంటకం నేర్పుతాను. నేనది పూనాలో నేర్చుకున్నాను. వేరేవేరే ప్రాంతాల్లోని ప్రజల భక్షణాలు మనం తెలుసుకుంటే మంచిదేకదా? దీపావళికి నీవేం చేస్తావో అవన్నీ చేసేయ్; ఆ సందడి తరువాత నేను వచ్చి నేర్పుతాను. ఆ

---

[1] తమిళులు, స్త్రీలని, తమకంటే పెద్దవారిని మర్యాదతో పిలవడానికి వాడిన పదం

పిండివంట చేసినప్పుడల్లా నీకు నా జ్ఞపకం రానీ. నేను మరేం చెయ్యగలను చెప్పు?" అని ఆవేశంతో ఆవిడ చెప్పిన మాటలు నా హృదయాన్ని గూఢంగా కదిలించాయి.

బహుమానం అన్నది ఏ స్వరూపంలో రావాలని శాస్త్రమేమైనా ఉందా ఏమిటి?

** ** **

ఈ సారి రంగమ్మాళ్ ఎప్పుడు వస్తారని నేను కాచుకొని ఉన్నాను. దీపావళికి గంగా స్నానం, కొత్తబట్టలు ధరించడం, విందు భోజనం అన్నీ క్రమంగా సాగాయి. కాని నా మనసంతా గోపాలసామి ఇంటిలో ఆ పండుగ ఎలా జరిగిందని తెలుసుకోవాలని ఆతురతో అల్లాడుతూవుంది.

ఆ మరునాడు నా స్నేహితురాలు స్థానిక హాస్పిటల్లో ప్రసవించింది. నేను దాన్ని చూడడానికి వెళ్ళినప్పుడు దూరంలో రంగమ్మాళ్ ఒక మందు బుడ్డితో కనిపించారు. ఏం జరిగిందో అని తెలియక భయంతో "మామీ, మీకేమైంది?" అని అడిగాను.

"నిన్ను చూడడానికి రావాలని అనుకున్నానమ్మా, కాని వీలవలేదు. నాకు ఒళ్ళంతా నొప్పి. నామగిరికూడా రైలు ప్రయాణంవలన బాగా అలిసిపోయింది. ఆ అబ్బాయి తనవాడే అని తెలిసినతరువాత ఆమె బాధ ఇంకా ఎక్కువైపోయింది. 'నన్ను బాగా మరిచిపోయాడే!" అని ఏడుస్తోంది. అబ్బాయి తలవంచుకొని కూర్చున్నాడు. 'నువ్వెందుకు వచ్చావ్? ఎలా వచ్చావ్?' అని మాటవరుసకి దాన్ని అడిగాడా, లేదు! వాడి గుట్టు అందరికీ తెలిసిపోయింది, ఇంతకన్న పెద్ద అవమానం ఉందా? ఇంట్లో అందరి ముఖాలూ చిరచిరలాడుతున్నాయి. పెళ్ళాన్ని తరువాత తీసుకువెళ్తానని అంటున్నాడు. నామగిరి ఇప్పుడే తనతో రావాలట. పెళ్ళాం వచ్చిన తరువాత అమ్మని దాని ఊరుకి పంపించేయాలని వాడి ఉద్దేశం కాబోలు, ఎవరికి తెలుసు? ఐతే నామగిరి కొడుకుని ఒక నిమిషంకూడా ఇక విడిచిపెట్టదు!" అని ఎడతెగకుండా ఆవిడ మాటాడారు.

"అతనికి తను చేసేదంతా మోసమని ముందే తెలుసు. పాపం, తక్కినవాళ్ళకి ఇదొక పెద్ద దెబ్బ!" అని అన్నాను నేను.

"ఎందుకు పాపం? పెళ్ళంటే కులగోత్రాలూ, ఊరూ, పేరూ, బంధువులూ - ఇవన్నీ చూడనక్కరలేదా? 'మంచి అల్లుడు దొరికాడు, అతనికి మరెవరూ లేరు!' అని మెచ్చుకున్నందుకు ఇది ఒక శిక్ష!"

నేనెందుకు హాస్పిటల్ కి వచ్చానని ఆవిడకి చెప్పి సెలవు తీసుకున్నాను. మామీ సాధించినది ఘనకార్యం, కాని ఆవిడ దానిగురించి నమ్రతతోనే మాటాడారు. నేను మా వారితో ఇవన్నీ చెప్పాలనుకున్నాను, కాని అతను ఊరులో లేరు; ఉద్యోగనిమిత్తం ప్రయాణం చేస్తున్నారు.

రెండురోజులు గడిచాయి.

రంగమ్మాళ్ నామగిరి అవ్వతో వచ్చారు.

ఉత్తరం రాసిపెట్టిన నాగురించి నామగిరికి చెప్పి ఆవిడతో రంగమ్మాళ్ మా ఇంటికి వచ్చారు; నాకు ఆవిడని పరిచయం చేసారు. వాళ్ళిద్దరూ కలుసుకున్న ఆ దృశ్యం నాకు వర్ణించారు; నరసిహ్మమూర్తిని మనసార తిట్టిపోసారు; నామగిరికి దొరికిన వకీలులాగ ఒక ప్రసంగమే చేసారు.

నామగిరి అవ్వని ఓదార్చాలనే ఉద్దేశంతో నేను ఆవిడతో "ఇదేదో మీకు ఆకస్మికంగా ఏర్పడిన దెబ్బ అనిపిస్తోంది; ఇక మీ అబ్బాయి అలాగుండరు. మీరెప్పుడు మీ ఊరుకి తిరిగి వెళ్తున్నారు?" అని అడిగాను,

"ఓ, నీకు చెప్పడం మరిచిపోయాను! నామగిరి అబ్బాయితో ఊరికి వెళ్ళడం, విందుచేయడం, అంతా ఐపోయింది!" అని రంగమ్మాళ్ నవ్వారు.

చుక్కలముగ్గు గీస్తుంటే ఒక చుక్క తప్పినట్టు నేను కలవరపడ్డాను. ఇంతలో నామగిరి అవ్వ చెప్పిన మాటలు విని నా గుండె ఝల్లుమంది.

"'ఊరుకి వెళ్దాం' అని మూర్తి చెప్పాడు, నేనూ సరే అన్నాను. ఒక స్టేషన్ లో బండి మారాం. రెండు, మూడు స్టేషన్ ల తరువాత వాడు ఎక్కడో దిగాడు. తిరిగి వస్తాడని నాలుగు స్టేషన్ ల వరకూ చూసాను. సరే, వాడి ఉద్దేశమేమిటో నాకు తెలిసిపోయింది. మా ఊరుకే తిరిగి వెళ్ళడమా అని ఆలోచించాను. కాని నాకిప్పుడు రంగమ్మాళ్ ని తప్పిస్తే మరెవరూ బంధువులు లేరు. ఆఖరికి ఇక్కడే వచ్చిచేరాను. అబ్బాయిని చూసినతరువాతకూడా నా బతుకిలా ఐపోయింది. ఇదే నా కర్మ!"

నా మనసు దిగజారిపోయింది. తన్ను పెంచిపోషించిన తల్లిమీద ఇంత ఏవగింపా? 'ఇదేం కొడుకు?' అని వాపోయాను.

రంగమ్మాళ్ కి మంచి గుండెధైర్యం ఉందికదా? ఆవిడ అన్నారు: "నామగిరి ఇప్పుడు సత్రంలోవుంది. నాకూ గోపాలసామి ఇంటిలో ఉండడానికి ఇష్టం లేదు. ఇద్దరూ కలిసి రైలులో ప్రయాణం చెయ్యాలని నిశ్చయించాం. నీకు నా జ్ఞాపకార్థంగా ఆ వంటకం నేర్పుతాను. నువ్వు సామగ్రి కొనిపెట్టు. రేపు కలుసుకుందాం," అని చెప్పి వెళ్ళారు.

ఆఫీసు పనులు ముగించుకొని ప్రొద్దుటే రావలసిన మావారు రాలేదు. దానికితోడు నా ఉత్తరం మూలాన పద్మ జీవితంలో ఒక గాలివాన చెలరేగిందని నేను బాధపడ్డాను.

ఆ మరుదినం, మధ్యాహ్నం, రంగమ్మాళ్ నాకు వంటకం నేర్పించాలని వచ్చారు.

"ఆఖరికి, మీరనుకున్నది జరగలేదు!" అని నేను అన్నాను.

"అవును, నామగిరి గాయాన్ని మరికొంత చెఱచినట్టైంది," అని ఆవిడకూడా దుఃఖించారు.

"పాపం, పద్మకీ అలాగే ఉంటుంది," అని గుర్తు చేసాను.

"అవును. ఆ పిల్ల ఏడుస్తోంది. 'కన్నతల్లి కాకపోయినా, పెంచిన తల్లిని అతనెలా ఎలా మరచిపోయారో?'" అని నన్ను అడిగింది. 'నన్ను అతను ప్రేమతో ఏలుకుంటారా?' అని యుక్తిగా ఒక ప్రశ్న వేసింది. అవును, ఎవరికి తెలుసు? ఒక భార్యతో బాగా జీవించడమైంది. ఇక రెండో భార్యతో ఎలా రోజులు గడుపుతాడో?"

ఆవిడ మాటలు నాకు అర్థంకాలేదు. "మనిషంటే ఒకతను అడుగడునా తప్పు చెయ్యాలా ఏమిటి? పెంచిన తల్లిమీద కృతజ్ఞత లేకపోవచ్చు. తన్ను నమ్మివచ్చిన పిల్లమీద అతనికి అక్కఱ ఉండదా? ఆమె అతను కట్టుకున్న భార్య కదా?"

"అవును, ఆమె అతను కట్టుకున్న భార్యే; తల్లికూడా అతన్ని నమ్ముకొని అందుబాటులో వచ్చిందే? కాని ఆ అబ్బాయిలో దయ అన్నది ఏ మాత్రమూ ఉందా? వాడి జాతకం అలాంటిది. కన్నతల్లి పోయింది; పెంచిన తల్లిని

తోసిపారేసాడు; నలుగురు కలిసి ఏర్చితీర్చిన పెళ్ళాం కథ కొన్నిరోజుల్లో ఐపోయింది. తనే ఎంచుకున్న భార్యకి ఇక ఎన్ని రోజులో ఎవరికి తెలుసు?"

శపించే ధ్వనితో ఆవిడ మాటలు విని నిరాశతో నేను ఆవిడ ముఖం చూసాను.

"మీరు కొత్త కొత్తగా ఏమేమో చెప్తున్నారే? మొదటి పెళ్ళాం . . ."

"అది చాలా పాత కబురని తెలుసుగా?" అని ఆవిడ నన్ను అడ్డగించారు. నాకు ఒకటే కోపం.

"మొదటి భార్య ఉందా?"

"అవును. ఉంది. ఏదో ఘర్షణ వచ్చింది. దాన్ని విడిచిపెట్టాడు. దానితరువాత ఇంకొక పెళ్ళికి ఏర్పాట్లు జరిగాయి. అప్పుడే మిలిటరీ ఉద్యోగంకి వెళ్ళాడు. ఆ తరువాత ఏం జరిగిందో నీకు తెలుసుగా?"

"అలాగా?" అని నేను విసుగ్గున్నాను. "చూసారా ఆఖరికి అతని బుద్ధి ఎలా మారిందని? భార్యని వదలిపెట్టాలనే దుర్బోధనే అన్ని ఉపద్రవాలకి కారణం. పెంచిపోషించిన తల్లినికూడా త్యాగం చేసేసాడు!"

రంగమ్మాళ్ కి మంచి లోకపరిచయం ఉందికదా? ఆవిడకి నిస్పృహ అంటే ఏమీ తెలియదు. "దానికీ, దీనికీ ఏం సంబంధం? నామగిరి అబ్బాయికి మనఃపూర్వకంగా ఉపకారం చెయ్యాలని ఆశించింది . . . వాడిగురించి నిత్యమూ . . . ఏదీ, నిదానంగా ఆ పిండిని ఇలా నా పక్కన వాల్చు, అప్పుడే నేను దాన్ని పిసికి, ముద్దగా చేసి కావలసిన దినుసులు కలుపుతాను . . . చూడమ్మా, ఆ పిండి మెత్తగా ఉండాలి, లేకపోతే గట్టిపడిపోతుంది . . . ఈ వంటకంకి ఇద్దరుంటే మంచిది . . . నువ్వు ఈ భక్షణం చేసినప్పుడు మీ ఆయన్ని సాయంకి పిలు. ఇప్పుడే అన్నీ బాగా గుర్తు చేసుకో . . . నేను రేపు ఈ ఊరు వదిలి వెళ్లిపోతాను . . . "

ఇలా నవ్వుతూ మాటాడే పూజ్యురాలుతో నేనెలా వాదించడం? అందరికీ ఉపకారం చెయ్యాలనే అభిలాష రంగమ్మాళ్ ని ఆకట్టుకుంది. కాని ఈ వృధ్యాప్యంలో ఆవిడకున్న వాత్సల్యమంతా నామగిరివైపు మళ్ళింది; నరసింహమూర్తి భార్య పడే బాధగుంరించి ఆవిడలో ఏ సానుభూతి కనిపించదే!

మాటలవరుసకి వస్తే నేనే ఎప్పుడూ ముందడుగు వేసేదాన్ని. కాని ఈ సారి మా ఆయన నన్ను మించేసారు.

“రావడం లేట్టైపోయింది, ఏమైందో తెలుసా? నా పంచెకట్టు, వాలకం చూసి ఒకావిడ నన్ను బాగా పట్టుకుంది; ఆఖరికి నా ప్రోగ్రాం తారుమారైంది. అబద్ధం చెప్పినా అందులో ఒక తీరుండాలి. ఎవడో ఒక అబ్బాయట; తల్లికి డబ్బేం పంపకుండా, తిండికీ, బట్టలకికూడా చేదోడు చెయ్యని, దయచూపని కొడుకట. తల్లిని రైల్లో వదిలేసి చల్లగా జారుకున్నాడట. ఎవరైనా నమ్ముతారా? ‘నేను రైలుకింద పడిపోయాను, ఎలాగో బతికాను!’ అని చెప్పినా నమ్మవచ్చు! ‘మద్రాసు వెళ్ళే బండిలో నన్ను ఎక్కించండి,’ అని అంటూ నన్ను ఆవిడ తరుముతూ వచ్చింది, బొబ్బలు పెట్టింది. సరే అని ఎక్కించాను. అన్నీ అబద్ధాలు! ఎవరు నమ్ముతారు ఆ కథలు? ” అని రాగానే అతను కేకలు పెట్టారు.

“కథ కాదండి, నిజం!” అని అతనికి అన్నీ వివరించాను.

మా ఇంటి వసారాలోని ముగ్గు ఒక ఆనవాలుగా రంగమ్మాళ్ ని మా ఇంటికి తీసుకువచ్చింది. ఆవిడ ఆరంభించిన సేవని మా ఆయన పంచె మరొక ఆనవాలుగా పూర్తిచేసింది.

నా హృదయంలో రంగమ్మాళ్ జ్ఞాపకం చెక్కుచెదరని చిత్రంగా ఉంది. మా పిల్లవాడు తెలియక చెఱిపినది పొడితో గీసిన ముగ్గు; నాలో ఉండేది ఏనాడూ తీరని చుక్కల ముగ్గు.

********

**మూలం ప్రచురణ: కలైమగళ్, 1953**

# అనుమానించే అబల

నుదుట మీద విబూతి పూసుకొని బయటకి వచ్చాను. విచ్చు, గణపతి స్వాములవారి అభిషేకంకోసం తీర్థం బిందెల్లో నింపుతున్నారు. కొత్తగా ఏవో మాటలు విని తిరిగి చూసాను; భార్యాభర్తలుగా ఇద్దరు కనిపించారు.

“చూసారా, ఈ చొట్టబిందెల్లో స్వాములవారికి అభిషేకం చేస్తున్నారు!”

“అన్ని వైభవాలూ విష్ణుపుకే. అసలు పెరుమాళ్ అంటే అతి గొప్పవాడు అని అర్థం!”

“పాపం, అలాగే కాబోలు! నిన్న తిరుపతిలో చూసిన జన సముద్రం, హడావిడీ, వైభవం చూస్తే ఇవన్నీ ఏ మూల? . . . ఇంతకీ రెండు దేవాలయాలు పక్కపక్కనే ఉన్నాయ్ . . . రెండింటికీ ఎంత తేడా!” అని ఆవిడకి నా దేవుడుమీద జాలి కలిగింది.

“అతను వడ్డీ, మొదలు గుంజుకొనే స్వాములవారు! నువ్వుకూడా ఎంతసేపూ ‘తిరుపతి’, ‘తిరుపతి’ అనే పాట పాడావు గాని కాళహస్తి గురించి ఏమీ అనలేదే? అన్నీ మీ నాన్నగారి ఉత్తరం చదివిన తరువాతేకదా?”

“ఇంత చేరువలో అది ఉందని ఎవరికి తెలుసు? మీకూ తెలియలేదే? . . . అదో అక్కడ చూసేరా . . . బ్రహ్మాండంగా ఏదో కనిపిస్తోంది . . . రండి, చూద్దాం!” అని ఆమె ఆ దిశలో గబగబమని నడిచింది.

“ముందు స్వాములవారి దర్శనం కానీ; మనం తిరిగి వచ్చేసరికి గుంపులు గుంపులుగా జనులు కూడిపోతారు. అందుకేగా మనం మరేం పని లేదని పొద్దుటే దర్శనంకి వచ్చాం?” అని అతను విసుగ్గున్నారు.

“మరేం పని లేదని ఎవరన్నారు? పొద్దుటే కోవిలకి వస్తే మనసుకి ఎంత సంతోషంగా ఉంది! దర్శనంకి ఇంకా అర్ధగంట ఆలస్యం అపుతందని అన్నారుకదా? అందుకే . . .” అని అంటూ ఆమె తిరిగి వచ్చేసింది.

ఇద్దరూ ఇప్పుడు నా పక్క తిరిగి చూసారు. ఇంతసేపూ అంగవస్త్రం నడుములో ముడుచుకొని వాళ్ళ సంభాషణ వింటున్న నేను ఇప్పుడు ఏమీ తెలియనట్టు నటించాను.

“ఏమండీ, ఇప్పుడు దర్శనం వీలవుతందా?” అని అతను అణకువతో నన్ను అడిగారు.

వాళ్ళని లోపలికి వెళ్ళమని చెప్పి రెండు నిమిషాల తరువాత నేనూ వెళ్ళాను.

“శ్రీకాళహస్తి . . . శ్రీ అంటే సాలెపురుగు, కాళమంటే పాము, హస్తి అంటే ఏనుగు. ఈ మూడూ ముక్తి పొందిన స్థలమిది,” అని వాళ్ళకి వివరించాను.

“కణ్ణప్పకి శివుడు ముక్తి ప్రసాదించిన స్థలమని అని ఎవరో చెప్పారు,” అని అంది ఆ యువతి మీనాక్షి.

“అవును. అదీ ఇక్కడే. ఇదిగో, ఇది కణ్ణప్ప నాయనార్ విగ్రహం!” అని ఆవిడకి చూపించాను.

“ఓ, అలాగా?” అంటూ వెంటనే దగ్గరగా వచ్చి దాన్ని చూస్తూ నిలబడింది.

“చూడు, ఇక్కడ స్వాములవారికి అభిషేకం జరుగుతోంది,” అని అతను అన్నారు. మళ్ళీ చేతులు జోడించి మీనాక్షి వెళ్ళి అతని పక్కన నిలబడింది.

విచ్చు, గణపతి అభిషేకం చేస్తున్నారు.

“ఈ శివలింగం ఎవ్వరూ ముట్టుకోరు. దీనికి శంఖాభిషేకం అని పేరు. ఇది స్వయంభువు[1] లింగం.”

“ఓ, అందుకే కాబోలు తీర్థం శంఖుతో ఎడతెగకుండా పోస్తున్నారు . . . అదేదో తెల్లగా కనిపిస్తుందే? . . ” ఇదీ ఆమె అడుగుతున్న ప్రశ్నే!

“అది స్వాములవారి వెండి కవచం; అభిషేకం పూర్తవగానే తొడుగుతాం,” అని చెప్పి లింగం దగ్గఱకి వెళ్ళాను. “ఈ స్వయంభువు లింగంమీదవుండే పాము

[1] తనకు తాసే వెలసే దైవం

అందరికీ కనిపిస్తుంది. ఆ కవచం తొడిగినతరువాత పాము పడగమాత్రం కనిపిస్తుంది. అసలు లింగంలో భక్తులకి కనిపించేది తక్కువే," అని చూపించాను.

"మంచిది. మనం పొద్దునే రావడం మంచిదైంది. అతనూ అన్నీ వివరంగా మనకి చెప్తున్నారు," అని ఆమె భర్తకి చెప్పడం నేను విన్నాను.

నాకూ సంతోషమే. ఆతురతతో ఎవరు ఎదడిగా వాళ్ళకి వివరంగా అన్నీ చెప్పాలని నాకూ ఆశ. దేవుడికి సుగంధమైన పువ్వులతో మనం పూజ చేసినట్టే మీనాక్షి తన ఆతురతతో తన భక్తిని స్వాములవారికి తెలియజెయ్యడం నేను గుర్తుచేసుకున్నాను.

గర్భగృహంలో తళతళమెరిసే దీపాలని వాళ్ళకి చూపాను.

"ఈ కాళహస్తి శివలింగం పంచలింగాల్లో వాయులింగంగా ప్రశిద్ధి చెందినది. చూడండి. లింగానికెదురుగావున్న దీపం లింగంనుంచి వచ్చే గాలికి రెపరెపలాడుతోంది. అదే గాలికి సాక్షి. తక్కిన దీపాలన్నీ అటూ ఇటూ కదలకుండా, నిశ్చలంగా ఉన్నాయి."

"అవును, నిజం!" అని మీనాక్షి ఆశ్చర్యపడింది. "అవును!" అని అతనూ అన్నారు. 'సాక్షి అంటే ఇదే' అని మనసులో సంతోషపడుతూ మీనాక్షి కొన్ని క్షణాలు దీపాలని మళ్ళీ మళ్ళీ చూసింది. నాకు వాళ్ళకి గొప్పగా ఏదో అద్భుత రహస్యం చెప్పినట్టు గర్వం కలిగింది.

కాని తృప్తి అనగానే అతృప్తికూడా ప్రకృతిలో ఉందనే నియమం ఉందికదా?

"మీరు స్వాములవారికి పక్కనేవున్న దీపంలో పెద్ద వొత్తి వాడారు; తక్కిన దీపాలన్నీ చాలా చిన్నవిగా మెరుస్తున్నాయి. అందుకే ఈ దీపం మాత్రం నిలకడ లేనట్టు కనిపిస్తోంది."

ఆమె మాటలు విని నేనెలాగో ఐపోయాను. శాస్త్రోక్తంగా పరిశీలన చేస్తే ప్రజలకి ఎందులోనూ నమ్మకం రాదు. "ఇది వాయుస్థలం," అని మళ్ళీ అన్నాను.

"ఈ దీపంకూడా చిన్నదిగా వెలిగిస్తే స్థిరంగా ఉంటుందని అనిపిస్తుందికదూ?" అని ఆమె మళ్ళీ భర్తతో చెప్పింది.

అతనికి మంచి వివేకం, దూరదృష్టి ఉన్నాయి.

"ఇప్పుడెందుకు దానిగురించి వాదం?" అని అతను మందలించారు. "మరేంలేదు, ఏదో అడగాలని అనిపించింది," అని ఆమె చెప్పి ఊరుకుంది.

"ఇలాగే దీపాల్లో చిన్నదీ, పెద్దదీ అని సవరించుకొని ఇది వాయుస్థలం అని వర్ణించడంలో ఒక అర్థమూ ఉంది," అని ఆమె తనలో గొణుక్కుంది.

గణపతి అర్చన ఆరంభించాడు. "పేరు?" అని అడిగాడు. నేనూ వింటున్నాను.

"గార్గీ గోత్రం, అనురాధా నక్షత్రం, నారాయణన్," అని అతను అన్నారు.

మూడూ మంచి పేరులే!

అతన్ని దీర్ఘంగా చూసిన తరువాత భార్యపక్క తిరిగాను; ఆమె మాటలు విని ఉలికిపడ్డాను.

"నా చెయిలో దక్షిణకోసం రెండణాలు ఇవ్వండి," అని భర్తకి దగ్గరగా వచ్చి నొక్కి చెప్పింది. ఒక నిమిషంలో ఆ మొహంలో ఎంత మార్పు! "ఒక అర్చనలోనైనా నా పేరు చెప్పారా?" అని మర్యాదగా, కాని దృఢంగా అతన్ని అడిగి మెల్లగా జారుకుంది. నేను అతని మొహం చిరచిరలాడడం గమనించాను. కాని, అదీ ఒక క్షణంలో మాయమైంది.

నాకు ఒకటే ఆశ్చర్యం!

ఈ దంపతులు కోవిలకి వచ్చారు; దేవుడు సన్నిధిలో ఉన్నత భావాలు ఉదయించాలి. ఈ స్త్రీకి ఎందుకీ అల్ప బుద్ధి? 'అర్చనలో నా పేరు ఎందుకు చెప్పలేదు?' అని భర్తని అడుగుతోంది! అదీ, ఎవరికి? స్వాములవారికి! ఇంతకీ వారిద్దరూ భార్యాభర్తలు! ఒకరికి ఖ్యాతి వస్తే, ఇంకొకరికి గొప్ప; ఒకరికి తలవంపు కలిగితే ఇంకొకరికి అవమానం. అటువంటి దాంపత్యంలో ఎందుకీ చిన్నదనం?

'సరే, నేనెందుకు ఈ పిల్లని తప్పుబెట్టాలి, ఏదో పడుచుతనంగా మాటాడుతోంది!' అని వెంటనే నా మనసుని నచ్చజెప్పుకున్నాను.

నాలాంటివారు ఆమెను పిల్ల అనవచ్చు; కాని పిల్లలకి ఆవిడ యథార్థంగా ఒక తల్లే!

కోవిలకి గుంపుగుంపుగా భక్తులు వచ్చే సమయమవుతే నేనెందుకు ఈ దంపతులని ఇంత వాడిగా చూస్తాను? పొద్దుటే, కోవిలకి మొట్టమొదట, ఈ

దంపతులు వచ్చారు. అందుకే నా దృష్టి వాళ్ళమీద పడింది. ఆ తరువాత ఆమె చురుకుతనం చూసి అది నా మనసులో నాటుకుపోయింది!

ఇద్దరినీ అమ్మవారి సన్నిధికి తీసుకొని వెళ్ళాను. అతను అర్చన చీటీ నాకు అందించారు.

“పేరు నారాయణన్ కదూ? నక్షత్రం?” అని అతన్ని అడిగాను; అది గభీమని మరిచిపోయాను!

“పేరు మీనాక్షి. మఘ నక్షత్రం. అర్చన ఆరంభించండి,” అన్నారు అతను.

మీనాక్షి ఇంతలో చిరునవ్వుతో ఏదో గొణకడం గమనించాను. నేను అతని అనురాధా నక్షత్రం గుర్తుచేసుకున్నాను.

“గార్గి గోత్రం కదూ?” అని అడిగాను.

“ఇప్పుడు మేం సగోత్రులం!” అని చెప్పి మీనాక్షి నవ్వింది.

నేను అర్చన చేసాను. “అనుష నక్షత్రంలో జన్మించిన నారాయణన్, మఘ నక్షత్రంలో జన్మించిన మీనాక్షి - దంపతులుగా ఇప్పుడు నీ సన్నిధికి వచ్చారు. దేవీ, వాళ్ళకి ఆయురోగ్య, సుఖసౌఖ్యాలు, భాగ్యం, అన్నీ ప్రసాదించు!” అని అంబికని అర్థించి, దంపతులకి కుంకం అందించాను.

ఇద్దరూ కోవిల చుట్టూ తిరిగి విషయాలు, ప్రత్యేకతలు తెలుసుకోవాలని బయలుదేరారు. మీనాక్షి భర్తని ముందుకొని కొన్ని జాగాలు చూసింది. “రండి, ఇది చూడండి!” అని అరిచింది. కొన్నిచోట్ల వెనకబడి, ఆగి, “ఇవన్నీ చూడకుండా ఎక్కడకి వెళ్తున్నారు?” అని భర్తని నిలిపింది. ముఖ్యంగా ఆమెను ఆకర్షించినవి వరుస వరుసగా కనిపించిన మన్ను విగ్రహాలు; చాలాసేపు వాటిని చూస్తూ అక్కడే నిలబడింది. ఆమెను చూసితీరాలని నాకేం ఉద్దేశం లేదు; కాని అలాగే అయింది. రెండురోజులు నా సొంత కార్యంకోసం నేను వేరే ఊరికి ప్రయాణం చెయ్యబోతున్నాను. అందువలన కోవిల ఉద్యోగులతో సంప్రదింపులకోసం ఇక్కడా, అక్కడా తిరిగాను. అందువలనే ఆ దంపతులు నాకు పలుమాఱు కనిపించారు.

విశాలమైన మండపం దాటి బయటకి వచ్చే మార్గంలో నారాయణన్ “ ’కణ్ణప్ప తిప్ప’ అనే పేరు విన్నాం, అదెక్కడుంది?” అని అడిగారు. నేనతనికి కోవిల

ప్రాకారంని ఆనుకొనివున్న కొండలవరుస చూపి "అదే కణ్ణప్ప తిప్ప!" అని చెప్పాను.

కోవిల బయటికి వచ్చాం." అబ్బా, ఇక్కడ ఎండ ఏమాత్రమూ కనిపించదే!" అని అంటూ మీనాక్షి - చెట్లమధ్య మఱుగైయున్న ఒక పారమీద - ఆనించుకుంది.

"కూర్చుంటే లాభం లేదు! పన్నెండుకి మనం తిరుపతి చేరుకోవాలి; అక్కడనుంచి మూడుగంటలకి బయలుదేరాలి!" అన్నారు నారాయణన్.

"ఈ గుట్టుమీద ఎక్కడం వీలపుతుందా?" అని అంటూ మీనాక్షి ఒక సారి తన చూపు మీదకి విసిరింది.

"కాలిబాట లేదు. కొండ చిన్నదే, కాని అంతా రాళ్ళమయం!" అని చెప్పి పక్కనే ఎండిన చువ్వలు ఏంచుతున్న ఒక పిల్లవాడిని పిలిచి వాళ్ళకి దారిచూపమనిచెప్పి, నేను వెంటనే బయలుదేరాను. నాకూ తొందరే; మరి అక్కడ నిలబడలేదు.

ఐనా, కొంచెం దూరం నడవగానే నాలో ఒక వట్టి ఆలోచన తట్టుకుంది. "కణ్ణప్ప తిప్పనుంచి చూస్తే మీకు ఊరంతా బాగా కనిపిస్తుంది; ఇక్కడ ప్రవహించే నదికి స్వర్ణముఖి అని పేరు!" అని మాటవరుసకి ఆవిడకి చెప్తివుంటే బాగున్ను అని అనిపించింది!

కాని వెంటనే "చూసారా, ఊరంతా ఎంత బ్రహ్మాండంగా కనిపిస్తూందో?" అని ఆవిడ ఉల్లాసంగా చప్పట్లు కొట్టుతున్నట్టు నాకు భ్రమ కలిగింది. అవును, నేను చెప్తేనే వాళ్ళకి ఊరు కనిపించాలా ఏమిటి? "నది పేరు వినడానికి బాగుంది, కాని చూడడానికి ఏం గొప్పగా లేదే!. బస్సులో మేం వస్తున్నప్పుడు చూసాను; వేసవికాలంకదా, అందువలనే యెండిపోయిందేమో?" అని ఆవిడ నన్ను అడగితే? ఆ ఆలోచన రాగానే నాకు ఆవిడకి చెప్పాలన్న తపన మాయమైపోయింది!

** ** **

ఈ రోజు కృత్తిక నక్షత్రం, సుబ్రమణ్యస్వాములవారికి విశేషం. తిరుత్తణి అతను కొలువైన దివ్యక్షేత్రం. పోయే దారిలో అతన్ని దర్శనం చెయ్యకుండా వెళ్ళడానికి నా మనసు ఒప్పలేదు.

"అమ్మయ్యో!" అని కూత వినిపించింది. అవును, మీనాక్షి కంఠధ్వని!

"ఇవాళ మనకి స్వాములవారి దర్శనం దొరకదు!" అని నారాయణన్ అంగలార్చుకున్నారు.

కొన్ని నిమిషాలు ఇద్దరూ రెప్పవాల్చకుండా ఆ జనసమూహం చూస్తూ నిలబడిపోయారు.

"రేపు పొద్దుటే వస్తే ఎంత బాగున్ను! ఆ కణ్ణప్ప తిప్ప ఎక్కి రావడంతో నా ఒళ్ళంతా అలసిపోయింది. ఇప్పుడు ఈ కొండ ఎక్కిరావడంతో నా ప్రాణం పోయినట్టుంది!"

"వచ్చేసాం, ఉత్తికే ఎందుకు వాదం?"

"అవును, వచ్చేసాం. నేను ముందే చెప్పానుగా? రోజువారీ ఒక క్షేత్రం చూస్తే అన్నీ బాగా చూడగలం. ఇలాగ ఇబ్బంది పడకుండా . . . "

"మళ్ళీ మళ్ళీ అదే మాటలు!" అని అతను విసుగ్గున్నారు.

"ఇది చాలా చిన్న కొండ; చూడడానికి ముద్దుగావుంది. స్నానం చేసి దర్శనం చెయ్యవలసిన స్థలం!"

ఇప్పుడు నారాయణన్ నోరెత్తలేదు.

అదిరిపడి, నిల్చున్న జాగాలో ఇలా తర్కించే దంపతులని నేనెప్పుడూ చూడలేదు. నేనేం దాక్కోలేదు; కాని వాళ్ళకి నేను గుర్తు రాలేదు.

"జనం తగ్గనీ!" అని ఇద్దరూ వెనక్కి తిరిగారు. "తిరుపతిలో లాగ టోకెను, క్యూ ఉంటేనే మనకి దర్శనం సాధ్యమౌతుంది; ఇక్కడ నాకలా అనిపించడంలేదు!" అని అన్నారు నారాయణన్.

మీనాక్షి ఆతురతో "రండి, తిరిగిపోదాం. పొద్దుటే తిరిగివద్దాం!" అని అంది.

"మళ్ళీ పొద్దుటే రావడం జరగదు! ఎన్నిసార్లు తిరగడం? రేపు మద్రాసులోనే మన లంచ్!" అని నిలకడగా నారాయణన్ చెప్పేసారు.

"బాగుంది. కోవిలకి వచ్చి దర్శనం చెయ్యకుండా వెళ్ళడమా?" అని మీనాక్షి శంకించడంచూసి అతను "అది వీలవుతందా? సరే, కొంచెంసేపు కాచుకొని మళ్ళీ వద్దాం" అని వాచీ చూస్తూ, గుమ్మం దాటి బయటకి వెళ్ళారు. గుంపుని చూస్తూనే మీనాక్షి అతని వెనక నడిచింది. "నాకేమో భయంగా ఉంది!" అని ఆమె సణుక్కోడం నా చెవిలో వినిపించింది.

'ఈ పిల్లకి అసలు భయమంటే తెలుసునా?' అని నాలో నేను నవ్వుకున్నాను.

అవును, మరి. మఘ నక్షత్రంలో పుట్టిన పిల్ల జగమేలుతుందని అంటారు; మీనాక్షి మాటకొస్తే అది చాలా నిజం. నలుగురు పిల్లలకి తల్లికావలసిన వయస్సు. ఇరవైఐదు సంవత్సరాలకి తక్కువగా కనిపించదు. కాని 'నాపేరు ఎందుకు దేవుడికి చెప్పలేదు?' అని అడిగే పసితనం; ఎవరి పేరు చెప్తే ఏం? 'ఇంతకీ అర్చకుడు చెప్తేనే దేవుడికి నా పేరు తెలియాలా?' అని అడిగే దుడుకుతనం మీనాక్షికి ఉంది. కాని అందుకు ఎదురుగానే ఆ ప్రశ్న అడిగింది. భయపడిందా, జంకిందా, లేదు!

పావుగంట తరువాత ఇద్దరూ మళ్ళీ తిరిగివచ్చారు.

"సరే, వెళ్లి నిలబడదాం," అని అంటూ నారాయణన్ గుంపులో కలుసుకోవాలని ముందుకు నడిచారు. మీనాక్షి పక్కనేవున్న ద్వారపాలకుని శిలమీద ఆనుకొని నిలబడింది; మొహం బాగా వాడిపోయినట్టు కనిపించింది. కొంతమంది చంటిపిల్లల్ని భుజంలో మోసుకొని గుంపులో చొరబెట్టాలని ప్రయత్నించారు. జనులు ముందుకు జరగడం, వెనక్కి త్రోయబడడం, మళ్ళీ ముందుకు సాగడం - ఇవన్నీ పొత్తుగా ఇక్కడ జరిగేవే! మీనాక్షి మొహం చిరచిలలాడడం చూసి నారాయణన్ ఆమె పక్క వచ్చి నిలబడ్డారు.

"చంటిపిల్లలతో వచ్చి అందరూ ఎలా చొచ్చుకొని పోతున్నారో చూసారా? ఎంత సాహసం!" అని మీనాక్షి అదిరిపడింది.

"సాహసం ఏమిటి? మోటుతనం!" అన్నారు అతను.

పొద్దున తోచని అనుమానం నాకిప్పుడే కలిగింది; ఈ దంపతులకి సంతానం లేదేమో?

ఇంతకుముందు ఇలాగే ఒక దంపతులు దేవుడు దర్శనంకి వచ్చారు. సంతానం కోరి యాత్రకి వచ్చారేమో అనే భావనతో "పిల్లలు లేరా?" అడిగేసాను.

"ఏం, మాకు ఆరుగురున్నారు!" అని ఆవిడ తత్తరపాటుతో నాకు చెప్పింది.

నేను నాలిక కఱచుకున్నాను; నా ప్రశ్న విని ఆ కన్నతల్లికి బాధ కలిగిందేమో? బ్రాహ్మణుడు నోటికి వాక్శుద్ధివుందని ఆవిడ భయపడిందా?

'ఆవిడ కడుపు ఎప్పుడూ చల్లగావుండాలని అనుగ్రహించు!' అని నేను కాళహస్తీస్వరుడ్ని మనసార ప్రార్థించాను.

అది అవాళ నేను నేర్చుకున్న పాఠం; అందువలనే ఈ దంపతులని చూసినప్పుడు నాకా సంశయం రాలేదు. 'పిల్లల గడబిడ, కుటుంబ భారం కొంచెం మరచిపోయి దంపతులు ఏకాంతంగా ప్రయాణం చెయ్యడం ఇప్పుడు సహజమైపోయింది. కొందరు ఊటీ, మహాబలిపురం వెళ్తున్నారు, మరికొందరు తీర్థయాత్రలు చేస్తున్నారు,' అని నేను గుర్తుచేసుకున్నాను.

"పిల్లల్ని ఈడ్చుకొని వీళ్ళందరూ ఎందుకిలా వస్తున్నారు!" అనే మీనాక్షికి ఆశ్చర్యం కాబోలు!

** ** **

చాలాసేపు నిలబడడంవలన కాళ్ళకి నొప్పి కాబోలు, మీనాక్షి ఇటూ అటూ తిరిగిచూసింది. నేనున్న దిశను చూస్తూ "రండి, అక్కడ కూర్చుందాం," అని భర్తకి చెప్పింది. "సరే, మనం వెళ్ళవలసిందే!" అని అతనన్నారు. "అంటే . . ?" అని మీనాక్షి కలవరపడుతూ అడిగింది. ఇద్దరూ నాదగ్గఱకి వచ్చేసారు, కాని నన్ను అనవాలు పట్టుకోలేదు.

"అర్ధగంటలో జనం తఱిగిపోతారు; మీరిక్కడే కూర్చోండి. నాకు పరిచయమున్న అర్చకుడిక్కడ ఉన్నాడు," అని నేను అన్నాను.

"ఇదేమో బాగా కిక్కిఱిసిన జనంలాగ కనిపిస్తోంది. తిరుపతిలోకూడా ఇంత శ్రమ పడలేదు!" అని నారాయణన్ కూడా కూర్చున్నారు.

"కాళహస్తిలో ఎంత సులభంగా దర్శనం దొరికింది! ఇది దానికి దృష్టిపరిహారం," అని అంటూ మీనాక్షికూడా కూర్చుంది.

ఇప్పుడు నారాయణన్ నన్ను బాగా చూడగానే, "మిమ్మల్ని ఇంతకుముందు ఎక్కడో చూసానే . . . " అని లాగారు.

"కాళహస్తిలోనే . . ." అని చెప్పి నవ్వాను; అతనికి బోధపడింది. జనసమూహం చూస్తున్న మీనాక్షి ఇప్పుడు తిరిగి, నన్ను చూసి "ఇతన్ని మనం . . ." అని భర్తని అడగ్గానే అతను అవునని తలూపారు.

"అక్కడ ఇతను అన్నీ మనకి వివరంగా చెప్పారు. మంచివేళ, ఇక్కడా మన సహాయంకి దొరికారు!" అని మీనాక్షి సంతోషించింది.

నేను నా మాట నిరవేర్చాను. ముగ్గురూ సుబ్రహ్మణ్యస్వాములవారి దివ్య దర్శనం చేసుకొని ఆనందించాం. ఒక గవర్నమెంటు సేవకుడు మాకు దారి చూపి సన్నిధికి తీసుకొని వెళ్ళాడు. "ఇలాంటి సహాయం లేకుంటే ఇవాళ మనకేం దర్శనం దొరుకుతుంది?" అని మీనాక్షి అపరిమితంగా నాకు తన కృతజ్ఞత తెలియజేసింది. "ఇతనే కనిపించకపోతే మనం దర్శనం లేకుండానే ఊరికి తిరిగిపోయుంటాం," అని నారాయణన్ కూడా అన్నారు.

సుబ్రహ్మణ్యస్వాములవారి నెమలి వాహనం వాళ్ళకి చూపించాను; కొంచెంసేపు చూస్తూ నిలబడ్డాం. అలసట కాటోలు, మీనాక్షిలో ఆతురత తగ్గినట్టు నాకనిపించింది. ఉత్సవమూర్తిగా కుమారస్వామి వచ్చారు, నెమలిని అధిరోహించారు. మేం మొక్కు చెల్లించి బయలుదేరాం. నాకూ రేపు ఉదయం రైలు ప్రయాణం. వాళ్ళు రైల్వే స్టేషన్ లో సామానులు అప్పగించి కోవిలకి వచ్చారు; ఈ రాత్రి అక్కడే నిద్రపోతారు. నేను ఈ రాత్రి ఈ తిప్పలోనే గడపాలనే ఉద్దేశం మార్చుకొని వాళ్ళతో వెళ్ళాలని నిశ్చయించాను. తోడుకి తోడూ, ఒకరికొకరు సాయం, మంచిదేకదా?

మీనాక్షి గబగబమని మెట్లు దిగడం ఆరంభించింది; కొన్నిసార్లు మాకోసం ఆగింది, మళ్ళీ తొందరగా ముందుకు నడిచింది. "వచ్చేటప్పుడు ఎవరూ చెయ్యెత్తి ఏమీ అడగలేదే, ఇంతమంది బిచ్చగాళ్ళు గభీమని ఎలా వచ్చారో?" అని ఆశ్చర్యపడింది. అలసిపోయినా మెట్లమీద ఆగడం సహించక పరుగెత్తింది.

మేం పర్వతపాదం చేరుకున్నాం. నారాయణన్ కొన్న అంటిపళ్ళు ముగ్గురూ తిన్నాం. "బాగా దాహమేస్తుంది, కాని నాకు కోవిల మడుగులో తాగాలని లేదు!" అని మీనాక్షి అంది.

"సోడా తాగమ్మా!" అని అన్నాను; ఆమె ఏం అనక ఊరుకుంది. స్టేషన్ కి వెళ్ళే తోవలో ఎన్నో దుకాణాలు కనిపించాయి. "కాఫీ తాగుతారా?" అని అడిగాను.

"బాగుంది! ఇప్పుడా కాఫీ?" అని మీనాక్షి త్వరగా నడిచింది. సోడా అమ్ముతున్న కొట్లు చూసి పేవు మళ్ళీ అడిగాను.

"వద్దు! వద్దు!" అని మీనాక్షి గట్టిగా చెప్పేసింది.

“సోడా తాగినప్పుడు బాగానే ఉంటుంది, కాని దాహం మరింక తీవ్రంగా పెరుగుతుంది,” అన్నారు నారాయణన్.

“నేనేం కావాలని అడిగానా?” అని అడిగి మీనాక్షి మళ్ళీ జోరుజోరుగా నడిచింది.

“ఇలా నడుస్తే దాహం ఇంకా ఎక్కువవుతుంది!” అని నారాయణన్ గొణిగారు; నాకూ అలాగే అనిపించింది.

ఒక సోడా దుకాణంముందు నిలబడి, “ఇలా రామ్మా!” అని పిలిచాను; మీనాక్షి మెల్లగా వచ్చింది. సోడాలో సగం అలాగే కుమ్మరించింది; డబ్బిచ్చినప్పుడు బాధపడింది. “నాకు తెలుసు ఇదేం బాగుండదని! ఈ మామా[2] చెప్తున్నారని సరేనన్నాను. అంతా వృధా!” అని ఎత్తి పొడిచి మాటాడింది. వాళ్ళతోబాటు సోడా తాగిన నాకూ ఎలాగో అనిపించింది. సోడా తాగాలనే నా అపేక్షవలనే మీనాక్షిని నేను బలవంతం చేసానని అనుకుందేమో? నన్ను ముందుకొని నారాయణన్ డబ్బిచ్చేసారు.

ప్లేట్ ఫారంలో, ఏదో ఒకలాగ సుభ్రంగావున్న ఒక జాగా వెదకిచూసి, తడబడుతూ అక్కడ నిద్రపోవాలని ఆలోచించాం. ఇంతలో రైలు కూలీలు వాడే ఒక శకటం కనిపించగానే మీనాక్షి అందులో ఎక్కి పడుకుంది.

“జాగ్రత్త, ఎవడైనా కూలీవాడు వచ్చి నిన్ను తోసుకొని పోతాడు!” అని నారాయణన్ నవ్వుతూ అన్నారు.

ఇప్పుడుకూడా మీనాక్షికి నవ్వు రాలేదు. “నేను పోతే మీకేం బాధ? ‘సరేలే, భారం తగ్గింది!’ అని హాయిగా ఇంకొక పెళ్ళి చేసుకోవచ్చు!” అని ఎగతాళి చేసింది.

“చాలు, చాలు, నోరు ముయ్!” అని అంటూ నారాయణన్ ముంజేయిని కళ్ళమీత ఒత్తుకొని నిద్రపోవడానికి సిద్ధమైయ్యారు.

ఈ మీనాక్షిని ఎలా వర్ణించడం? వదరబోతనా లేక జగడగొండియనా?

** ** **

---

[2] స్త్రీలు వయసు చెల్లిన మగవారికి గౌరవం తెలిపే పదం

తెల్లవారింది. కిక్కిరిసిన కంపార్టుమెంటులో ఎలాగో ఎక్కి కూర్చున్నాం. నా గమ్యం తిరువెళ్ళూరు; వాళ్ళది మద్రాసు; నాలుగు గంటలు కలసి ప్రయాణం చెయ్యబోతున్నాం. ఆ తరువాత వేరేవేరే మార్గాల్లో వెళ్తాం. మళ్ళీ కలుసుకుంటామా?

మీనాక్షిలో మార్పు వచ్చింది; ఐనా ఆమె మొహంలో ఆహ్లాదం కనిపించలేదు. అది నాకు బోధపడింది. మరి ఆమె భర్తకి తెలియదా? అతనూ అందుకు తగినట్టుగానే తన వైఖరి మార్చుకున్నారు. ఏమైనా సరే, నోరెత్తక వొదిగి ఉండాలనే ఉద్దేశం లేకపోవడం వలన మేమిద్దరం అప్పుడప్పుడూ ఏవో కబుర్లు పంచుకున్నాం. పరిసరాల్లోని ప్రజలూ, కళ్ళకి కనిపించి త్వరలోనే మాయమయే పంటలూ, పొలాలూ చూసాం. నేను వాళ్ళతోబాటు రావడం మీనాక్షికి ఇష్టం లేదా? ఒకరి సహాయంకి కృతజ్ఞత చెప్పినవెంటనే ఆ కృతజ్ఞతకి సంబంధించిన జాడలు మాయమవ్వడం ఎలా సాధ్యం? సుబ్రహ్మణ్యస్వామిని దర్శనం చేసుకున్న తరువాత, కొంచెం సేపటిలో, మీనాక్షి ఇలా మారిపోయింది! 'ఈ మామా చెప్తున్నారని సరేనన్నాను. అంతా వృధా!" అని సోడా గురించి ఎత్తి పొడిచి మాటాడలేదూ?"

కటువైన ఆలోచనలు వద్దని ఇక తిరువెళ్ళూరులో నాకోసం కాచుకొనివున్న నా అబ్బాయిని గుర్తుచేసుకున్నాను. నా రెండవ మనవడికి రేపు జన్మదినం; అందుకే నేను తాత వెళ్తున్నాను. కొంచెం సమయం తరువాత నా దృష్టి మళ్ళీ ఈ దంపతులమీద పడింది. పిల్లలు కనిపెట్టుకొని ఉంటారనో, వాళ్ళగురించి వీళ్ళకి ఎటువంటి ఆలోచనా ఉన్నట్టు ఏ జాడా కనిపించలేదనే కారణంతో ఈ దంపతులకి సంతానం లేదని నేను అర్థం చేసుకున్నాను.

నా సంశయం సరే అని తోచినవెంటనే "మీ పిల్లలెవరూ రాలేదే? వాళ్ళకి స్కూలు ఇంకా సెలవులకి మూయలేదా?" అని అడిగాను.

"మా కాలేజీ సెలవులకి మూసేసారు; వెంటనే బయలుదేరాం. పిల్లలు లేరు," అన్నారు నారాయణన్.

కాలేజీలో ప్రొఫెసరుగా అతనికి ఉద్యోగం అని తెలిసింది.

"మాకు ఇంకా రెండు మాసాలకి సెలవులున్నాయి. కాంచీపురంలో కాంచీ వరదస్వాములవారికి గరుడసేవ ప్రశిద్ధమని అలమేలుమంగాపురంలో మాకు ఒకతను చెప్పారు," అని మీనాక్షి నాకు వ్యసనపడుతూ చెప్పింది.

"ఏం, మీరూ వెళ్ళవచ్చుగా?" అన్నాను నేను.

"ఒకే యాత్రలో ఎన్ని క్షేత్రాలు చూడగలం? ఇదొక ఆవేశంలా మా ఆవిడని వచ్చి పట్టుకుంది!" అన్నారు నారాయణన్.

"పిల్లలు లేరన్నారే, అసలు పుట్టనేలేదా? . . . ." అని లాగాను. గొడ్రాలు అనే పదం వాడి ఎందుకు ఆమె మనసు నొప్పించాలి!

"ఆ దుర్భాగ్యం రాలేదు," అని మీనాక్షి నవ్వింది.

అంటే . . . పిల్లలు కనే దుర్భాగ్యం తనకి లేదని అంటోందా . . . లేక పిల్లలు కని పోగొట్టుకున్న దుర్భాగ్యవతి అని అంటోందా? నా ప్రశ్న బాగా అర్థం చేసుకొని ఆమె బదులు చెప్పిందంటే, ఆ రెండవ వివరణ సరే అనాలి.

మరేం అడగాలో తోచక నోరు నేను మూసుకొని కూర్చున్నాను.

'మీ ఆవిడకి వచ్చిన ఆవేశం సహజంగా ఏ స్త్రీకైనా రావొచ్చు!' అని నేను చెప్తే మీనాక్షి సంతోషిస్తుందా? ఏమో, నాకు నమ్మకం లేదు!

"సరే, ఇంకా ఒక గంటతోసరి నా ప్రయాణం!" అని వాళ్ళకి గుర్తుచేసాను. "మీకు కాళహస్తి నచ్చిందా?" అని అడిగాను.

"దానికేం, బ్రహ్మాండమైన కోవిల! ఐతే, ప్రార్ధనకి తగిన స్థలం కాదేమో? అక్కడ ఎంత ప్రశాంతంగా మనం అనుభవించాం! కోవిల అంటే అలాగేవుండాలి!" అన్నారు నారాయణన్.

"గుంపుల ధూందాం, సందడి తిరుపతిలో చూసిన తరువాత ఇవన్నీ శిధిలమైన మందిరాలని నాకనిపిస్తోంది . . . ." అని అంటూ మీనాక్షి మాతో జోక్యం చేసుకుంది. కాని మరు క్షణమే తనేదో పొరబాటు చేసినట్టు వేళ్ళని చంపలమీద తేలికగా తట్టుకుంది.

కొంచెసేపు తన దృష్టిని ఇక్కడా అక్కడా పోనిచ్చి ఆఖరికి మీనాక్షి నావైపే తిరిగింది. "ఎన్ని కోవిళ్ళు తిరిగాం మేం! మొట్టమొదట తిరుపతిలో గోవిందరాజ పెరుమాళ్ కోవిలకి వెళ్ళాం. అక్కడ ఖర్చుగురించి ఆలోచించనేలేదు; ఒకటి

తరువాత ఒకటి - అన్ని సన్నిధులూ దర్శించాం, అర్చనలు చేసాం. కాని ఒక్క చోటనైనా నా పేరుకి అర్చన చెయ్యలేదు! కాళహస్తిలో మాత్రం నేనెవరని అమ్మవారికి అర్చకులు పరిచయం చేసారు!" అని వివరిస్తూ మధ్య ఒక చోట మీనాక్షి నవ్వింది.

నేనుకూడా ఉత్తికే నవ్వాను. మళ్ళీ ఆ మొర వినగానే నాకు ఆశ్చర్యం కలిగింది. ఇంకొక జ్ఞాపకమూ వచ్చింది!

తిరుత్తణిలో కుమారస్వామికి అర్చన చేసినప్పుడు నారాయణన్ తన పేరూ, నక్షత్రమే గురువులుకి చెప్పారు. అదేకదా నియమం? అందువలనేనా మీనాక్షి మారిపోయింది! దేవుడా, ఇదేం న్యాయం!

"ఏమండీ, మిమ్మల్ని ఒక సంగతి అడగాలి," అని మీనాక్షి ఆరంభించింది. "అతని పేరు, నక్షరంతో అర్చన చేసినప్పుడు నన్ను చేర్చలేదు. కాని జ్ఞానప్రసూనాంబా సన్నిధిలో నాపేరులో అర్చన చేసినప్పుడు మీరు అతని పేరు చేర్చుకున్నారు. ఎందుకు?"

'ఏంత చిన్నతనం!' అని అనుకుంటూ, కోప్పడకుండా, నేను నవ్వేసాను. "అతని పేరులో అర్చన చేసినప్పుడు, 'దంపతి సమేతంగా' అని కలిసి చెప్పివుంటారు!" అని అన్నాను. నాకు తెలుసుగా సంప్రదాయం?

"ఐతే, భార్యపేరులో అర్చన చేసినప్పుడూ అలాగే చెయ్యవచ్చుకదా?"

"అవును, చెయ్యవచ్చు. భర్తకి మన హిందూ ఆచారాల్లో విశేషమైన గౌరవం ఇచ్చేసారు. భర్త అనుభవించే కష్టసుఖాలు భార్యకూడా భరించాలిగా? భగవంతుడు భర్తకి ఆయురారోగ్య సంపదలు ఇస్తే, అవి భార్యకీ చేరుతాయి," అని నేను అన్నాను.

"అలాగే కానీ. సుఖసౌఖ్యాలు ఒక పక్క ఉండనీ. కాని భార్యకి కలిగే కష్టసుఖాలు భర్తకి చేరాలనే నియమం ఎక్కడా లేదే!" అని మీనాక్షి వేదాంత ధోరణిలో మాటలు విసిరింది. ఆ తరువాత కొంచెం ఆగి "భర్తకి పుట్టిన పాప అతని భార్యకి చెందినట్టేనా? అని వేరే ధ్వనిలో, ఏగతాళిగా నన్ను అడిగింది.

'మీనాక్షి ఇతనికి రెండో భార్య కాబోలు!' అనే అనుమానం నాకిప్పుడే లేచింది.

"ఎవరైనా వింటే నవ్విపోతారు!" అని నారాయణన్ చిరచిరలాడారు.

'భార్యకి పుట్టిన పాప భర్తకి సొంతమా?' అని అడిగితే దానికి అర్థముంది. మీనాక్షి ఏమంటుందో నాకు బోధపడలేదు.

"నేనేం బొబ్బలు పెట్టలేదే?" అని భర్తకి అతని మొహం చూడకుండానే మీనాక్షి బదులు చెప్పి తన మొహం ముడుచుకుంది.

నన్ను చూసి ఇప్పుడు మాటాడింది. "ఈ తిరుపతి ప్రయాణంకి నేనే ముఖ్యకారణం. నాకోసమే ఈ యాత్రా, ఖర్చులూ అన్నీ!" అని ఆమె అంటూంటే నేను నా మనసులో 'ఎందుకమ్మా నీకీ తగని మాటలు!' అని నొచ్చుకున్నాను.

నేను మరేం అన్నానో నాకు గుర్తు లేదు; అంతలో మీనాక్షి "అతనికి పాప పుట్టాలంటే ఇంకొక భార్య రావొచ్చుకదా?" అని అడిగి ఒక వట్టి నవ్వు నవ్వింది!

చిదంబరం దేవాలయంలో ఈశ్వరుని దర్శనంకోసం స్వయంగా నంది పక్కకి తప్పుకున్నట్టు, మీనాక్షి మనసులో అల్లాడుతున్న వ్యాకులత ఆమె మాటల్లో నేనిప్పుడు గ్రహించాను!

అవును! మీనాక్షి మనసులో ఎంత భయం చోటుచేసుకుంది! మనకి ఆమెలో నిత్యమూ కనిపించేవేమో - దుడుకుతనం, మొండితనం, స్వార్థం . . .

'అర్చనలు తన పేరులోనే సాగాలి; తన దోషాలు తొలగాలి, పాప తనకే పుట్టాలి. సంతానం కోసం భర్త మరొక పెళ్ళి చేసుకోవాలని ఆశించకూడదు . . .'

ఇదే ఆమె చెప్పే సందేశం; తప్పని ఎవరు వాదాడగలరు? మీనాక్షి సంతానం లేకపోవడానికి తనే కారణం అంటోంది; అందుకైనా మనం ఆమెను మెచ్చుకోవాలి!

దేవభాష అని కొనియాడే సంస్కృతంలో నేను వల్లించే మంత్ర శ్లోకాలు నా ఆత్మతృప్తికి సరిపోవు. నా తీయని మాతృభాష తమిళంలో ఉన్న తేవారం, తిరువాచగం నాకు తప్పక కావాలి. అలాగే మీనాక్షికి భర్త తనపై చూపే ప్రేమానురాగాలు చాలవు. తన మాతృక భావనలు తెలియజేయడానికి ఒక చంటిపాపతో రక్తసంబంధం తప్పనిసరి అని ఆమె నమ్మింది.

తమిళ సాహిత్యంలోవున్న నాకున్న మితమైన అనుభవంకి సాటిగా నామనసులో ఒక కల్పిత దృశ్యం రేగింది: భవిష్యత్తులో నేను ఆ మీనాక్షి పాపకి చెప్తున్నాను. "నువ్వు కావాలని నీ తల్లి ఎంత ఆశించిందో నీకు తెలుసా? చాలా భయపడింది కూడా!"

“వచ్చే సంవత్సరం పాపతో రండి!” అని నా నోటినుంచి ఆశీర్వచనం వెలుబడింది.

గభీమని మీనాక్షి,నారాయణన్ ఒకరినొకరు చూసుకున్నారు.

“అప్పుడు అన్ని అర్చనలూ పాపపేరులోనే చెయ్యొచ్చు. ఎటువంటి రచ్చా, చిక్కూ ఉండదు!” అని నవ్వుతూ అన్నాను. మాటల్లోనూ, నవ్వులోనూ నా మనసు కరిగినట్టనిపించింది, నేనెందుకు భయపడాలి?

**********

**మూలం ప్రచురణ: సుదేశమిత్రన్,1955**

# మతిమరుపు

"ఏయ్ కృష్ణా!" అని ఆ కుర్రవాడిని మందలించాను; వాడికి తొమ్మిదే నిండాయి. కొన్నిమాసాలముందు కన్నతల్లిని కోల్పోయిన అబ్బాయిని నేనింతవరకూ ఇలా ఎప్పుడూ కసురుకోలేదు. కాని ఇప్పుడు నా మానసిక స్థితి మారింది; నా మనసులో ఓపికకి చోటు లేదు.

"ఏంటి మామా?[1] అని ఉన్నచోటునుంచి కదలకుండా కృష్ణా అడిగాడు. వాడిని చుట్టుముట్టి వస్తున్న ఆ కొత్త కుక్కపిల్లని వదిలి రావడానికి వాడికి మనసొప్పలేదు. దానితోపాటు నా దగ్గర రావడానికీ ధైర్యమూ లేదు. నా కంఠధ్వని వాడికొక హెచ్చరికగా అనిపించివుండాలి; అది నేనూ గుర్తించాను.

"ఇక్కడకి రా!" అని పిలిచాను; చెప్పదలచుకున్నమాటలు ఉచ్చరించడానికి నేను జంకాను. తల్లిలేని పిల్లవాడిని చివాట్లు పెట్టే కుటిలుడని అందరూ నన్ను నిందించుతే? నేను పలుమార్లు ఈ అబ్బాయిని పొగడిన సంగతులు ఎవరూ లెక్క చెయ్యరు; ఘాటుగా ఒక మాట చెప్తే చాలు, దాన్ని అపార్థం చేసుకుంటారు. అందుకే వాడిని దగ్గరకి రమ్మన్నాను.

"ఎందుకు? ఏంటి కావాలి, మామా?" అని మళ్ళీ అడిగాడు; అప్పుడూ వాడు నా పక్క కదలనేలేదు. కాని "ఏంటి కావాలి" వాడడిగిన ప్రశ్న విని నా మనసు కరిగింది. నాకు అన్ని విధాలుగా సహాయం చెయ్యాలని వాడి మనసు. పోస్టాఫీసుకి వెళ్ళిరావాలన్నా, వార్తాపత్రిక కొని తీసుకువాలన్నా - నేను వాడినే పిలుస్తాను.

"ఇక్కడికి రా, చెప్తాను!" అన్నాను; నా గొంతుకలో ఇప్పుడు కోపం లేదు.

"ఇదిగో, వస్తున్నాను . . . అయ్యయ్యో . . . మామా, కొంచెం ఆగండి! . . . ఏయ్ జిక్కి . . . ఇలాగ రా . . . ఎక్కడికి పరగెడుతున్నావ్!"

వాడు నా దగ్గరకి రానేలేదు. వాడిని చుట్టుముట్టే ఆ కొత్త కుక్కపిల్ల ఇప్పుడు పశువుల కొట్టంలోకి వెళ్ళిపోయింది, వాడూ దాని వెనుక పరుగెత్తాడు; పది అడుగుల్లో దాన్ని పట్టుకున్నాడు.

---

[1] పిల్లలు పెద్దలు - మగవారి దగ్గర - వాడే పదం

"మామా, కొంచెం ఆగండి . . . ఒక తాడు తీసుకువచ్చి దీన్ని . . ." అని అంటూ వాళ్ళ ఇంటిలోపల మాయమైపోయాడు.

నాకు నిరాశే మిగిలింది. ఐనా "పోనీలే, పాపం కుర్రవాడు!" అని మరేం అనక నా వ్యవహారాల్లో లీనమైపోయాను.

అప్పుడే గబగబమని నా ముగ్గురు పిల్లలు పరుగెత్తుకొని వచ్చారు.

"జిక్కి చాలా బాగుంది కదూ?"

"అవును . . . మనకీ ఒక కుక్కపిల్ల కావాలి . . . "

"ఒక్కొక్కరికీ ఒక కుక్కపిల్ల కావాలి . . . కృష్ణాని అడుగుదాం . . . వాడు తప్పకుండా ఇస్తాడు."

కేకలు పెట్టుకుంటూ పిల్లలు పెరడులోకి దూరారు. నేనున్నజాగాలో నిలబడి కృష్ణాని పిలిచారు. ఏమాటలూ రాని ఆఖరి పాపకూడా వాళ్ళవెనుక వెళ్ళి 'ఊ', 'ఊ' అని కృష్ణాని పిలిచింది.

కాని కృష్ణా మా ఇంటికి రానేలేదు; వాడికి నేనంటే భయం కాబోలు!

"మనమే వెళ్దాంరా," అని అంటూ నా పిల్లలు వెదురు దడిని దాటి ఆ ఇంటి పెరడులోకి దూరారు. ఆఖరి పిల్లవాడికి కూడా అన్నయ్య సాయంతో అది సాధ్యమైంది. కుక్కపిల్లతోకలిసి అందరూ కేకలు పెడుతూ ఆనందంగా ఆడుకుంటున్నారు.

అవును. మేమున్నది ఇరుగుపొరుగుల్లో. అందువలనే జిక్కి రాక నాకు బాధగా అనిపించింది. ఒకే ఇంటిలో, రెండు విభాగాల్లో మేం కాపురం ఉంటున్నాం. ముందటి రోజు - సాయకాలమూ, రాత్రీ ఆ కుక్కపిల్ల అరుపు, మొరుగు - ఆ నరకయాతన - నెనెలా భరించానని దేవుడికే తెలుసు.

'మనవడిని ఏమీ అనవద్దు!' అని కృష్ణా తాత, నాన్నమ్మ ఊరుకున్నారేమో? ఐతే, నేనూ ఊరుకోవాలా ఏమిటి? పొరుగింటి మనిషి అనే నాకున్న అర్హత వలన ఈ కుక్కపిల్ల పోతే వాళ్ళకీ మంచిదేకదా? ఆ కారణం వలనే కృష్ణాకి నా ఆక్షేపణ ఖరారుగా చెప్పేయాలని అనుకున్నాను.

కాని ఆ తలంపే చివాలున మాయమైపోయింది.

'ఈ కుక్కపిల్ల జాతి మంచిదే కాబోలు; చెవులు రెండూ కిందకి బాగా జారివున్నాయే?' అని నాలో చెప్పుకొని తృప్తి పడ్డాను.

కాని ఆ రోజు సాయంకాలం ఆఫీసునుంచి ఇంటికి వచ్చినప్పుడు నా అల్ప బుద్ధి - కాదు, నా కోపం - నన్ను మళ్ళీ ఆగట్టుకుంది.

నా ఆఖరి ఇద్దరు పిల్లలు ఒక కుక్కపిల్లతో ఆడుకుంటున్నారు.

"రామా, మన ఇంటిలోనూ కుక్కపిల్ల వచ్చేసిందన్న మాట!" అని నాకు వేదన కలిగింది.

"ప్రేమా, ఎవరే మీకు కుక్కపిల్ల పెంచమని చెప్పారు? వెళ్ళండి, దీన్ని ఎక్కడైనా వదిలేసి రండి!"

"వొద్దు నాన్నగారూ . . . ఇది ఇక్కడే ఉండనీ."

"ఛీ, ఛీ! మన ఇంటిలో కుక్కపిల్లని పెంచడమంటే ఏమనుకున్నావ్? . . . పెద్ద రోత!"

అమ్మాయి ముఖంలో కనిపించిన గడబిడ వెంటనే మాయమైంది.

"ఇది మన కుక్కపిల్ల కాదు; కృష్ణా దీన్ని పెంచుతున్నాడు."

"వాడెక్కడ? దీన్ని వదిలేసి ఎక్కడకి వెళ్ళాడు?"

"కృష్ణా, దురై అన్నయ్యా స్కూలునుంచి ఇంకా రాలేదు; 'ఇవాళ రావడానికి ఆలస్యమౌతుంది' అని చెప్పివెళ్ళారు. నేనూ, తమ్ముడూ దీన్ని చూసుకుంటున్నాం. కృష్ణా రాగానే ఇచ్చేస్తాం."

"సరే, ఇక్కడే ఉండనీ. పాపం, ఈ కుక్కపిల్లని చూస్తే జాలిగావుంది. నోరు లేని జంతువు; ఇది పుట్టి ఒక నెలకూడా నిండలేదేమో?"

ప్రేమాకి ఉత్సాహం వచ్చేసింది. "అవును, నాన్నగారు! దీనిలాగే మూడు, నాలుగు కుక్కపిల్లలు ఆ పోస్టాఫీసు కాంపౌండులో మేం చూసాం . . . మేమూ తలా ఒక కుక్కపిల్ల తీసుకొని వస్తే ఎంత బాగున్ను! ఇవి చూడ్డానికి ఎంత అందంగా ఉన్నాయి! పాపం, ఇది ఎల్లప్పుడూ 'కుయింగ్', 'కుయింగ్' అని మూలుగుతునేవుంది. ఒరేయ్ అంబి, నువ్వు దీన్ని ఇలాగే పట్టుకొని కూర్చో! నాన్నగారూ, నేను వెళ్ళి జిక్కికి ఒక బిస్కట్టు తీసుకొస్తాను . . ."

ఇంతవరకూ ఏమీ అనక ఊరుకున్న నా భార్య ఇప్పుడు జోక్యం చేసుకొని మాటాడింది.

"ఏమే, దీనికేం నీ బిస్కట్లు వొద్దు! ఎక్కువగా తినిపిస్తే అది చస్తుంది! చూడండి, ఈ రోజంతా ఈ కుక్కపిల్ల వీళ్ళతోనేవుంది. ఇప్పటికే నాలుగైదు బిస్కట్లు చెడగొట్టారు. ఈ కుక్క పిల్ల చాలా చిన్నది, దానికి తల్లి పాలు కావాలి. ఇన్ని బిస్కట్లు తింటే దాని గతి ఏమౌతుంది? చాలు, మధ్యాహ్నమంతా ఈ పిల్లలతో ఇదే గొడవ!" అని నాకు పూర్తి వివరాలు వర్ణించింది.

అంతా విని నాకు ఈ కుక్కపిల్లమీద, కృష్ణామీద పట్టరాని కోపం వచ్చింది.

"ప్రేమా, నా మాట విను. దీన్ని కృష్ణాకి ఇవ్వొద్దు. ఆ పోస్టాఫీసు కాంపౌండులోనే దీన్ని వదిలేయ్ . . . జిక్కీకి తల్లి పాలు లేకుండా చెయ్యడం మహా పాపం, తెలుసా? నువ్వు వెళ్ళిచూసినప్పుడు ఆ తక్కిన కుక్కపిల్లలతో ఆ తల్లి కుక్కని చూసావా?"

"మరొక కుక్కని చూసాం. అది మమ్మల్ని చూడగానే మొరిగింది."

ప్రేమా నన్నుచూసింది. ఈ కుక్కపిల్లని వదిలేయడానికి దానికి ఇష్టం లేదు. జిక్కి పుష్టిగా, ముద్దు పాపలాగ, దేహమంతా నల్ల ఛాయతో, నొసలు, పాదాలు మాత్రం తెల్లని మచ్చలతో చూడడానికి చాలా ముచ్చటగానే ఉంది. కాని దానితో మనం పడవలసిన కష్టాలు? నిన్న రాత్రంతా తన హీనస్వరం పైకెత్తి, అది చేసిన హంగం? అసలు ఇదెప్పుడూ కృష్ణాతోనే ఉంటుందా ఏమిటి? ఎక్కువగా నా పిల్లలే దాన్ని చూసుకోవాలి!

అందుకే ప్రేమా ముఖం చూసి నా మనసు కరగలేదు.

"మంచి పిల్ల, వెళ్తావా?" అని దాన్ని అడిగాను. "సరే, నాన్నగారూ," అంటూ మకమకలాడుతూ ప్రేమా లేచింది; తమ్ముడుతో కలిసి పోస్టాఫీసుకి బయలుదేరింది.

నేను నా చూపు మళ్ళించి భార్యను చూసాను.

"కుక్కపిల్ల చూడడానికి చాలా ముద్దుగావుంది. పాపం, కృష్ణా . . . వాడికి కోపం రావచ్చు, బాధ పడతాడుకూడా . . . కాని ఈ కుక్కపిల్ల ఇక్కడ ఉంటే మన పిల్లలే అస్తమానం దానితో మల్లాడుకోవాలి . . . అందుకే నేనంటున్నాను. చూడు, వాళ్ళ

అమ్మ కన్ను మూసి రెండు, మూడు మాసాలే అయ్యాయి . . . కృష్ణా ఊరునుంచి వచ్చినతరువాత ఎనిమిది రోజులు ఎలా ఏడ్చాడు! ఇప్పుడేమో ఈ కుక్కపిల్లని తన తల్లిదగ్గరనుంచి దూరం చేస్తున్నాం అని వాడికి అనిపించదేం?

"మతిమరుపంటే అదే! ప్రపంచంలో అది సహజమే కదా?" అని తటాలున నా భార్య నాకు చెప్పింది.

నేనన్నదీ ఆ అర్థంతోనే. కాని నా బార్య బాహటంగా పలికిన మాటలు విని నేను ఉలిక్కిపడ్డాను. స్వాభావికంగా ఆమె నోటిలోనుంచి వచ్చిన బోధన అది. కొంచెం తటపటాయించుకొని, "అవునులే" అని అన్నాను.

'నేనూ మతిమరుపుతో ఇతరులకి ఉపదేశం చేస్తున్నానా?' అని ఆలోచించిన తరువాతే అవునన్నాను.

'మనందరం రోజు చాలాసార్లు మతిమరపుతో మాటాడుతాం. నిజం. కాని కృష్ణాకి నేను చెప్పిన బోధన అలాక్కాదు!' అని నేను నాలో రూఢీచేసుకున్నాను. 'ఇక కృష్ణా ఎప్పుడు వస్తాడా?' అని కాచుకొని వున్నాను.

'వాడు కుక్కపిల్లకోసం ఇక్కడ తప్పకుండా వస్తాడు. వాడిని పక్కన కూర్చోబెట్టుకొని మాటాడాలి. వాడి తల్లి గురించి ఏమీ అనవద్దు. ప్రేమాకి నేను ఏం బోధన చేసానో అదే కృష్ణాకీ చెప్పాలి.' ఆలా నిశ్చయించుకొని, నా ఉద్యోగ దుస్తులు మార్చుకున్నాను.

అప్పుడే దుర్గై, కృష్ణా వచ్చారు; మొట్టమొదటి ప్రశ్న కుక్కపిల్ల గురించే.

అప్పుడు నేనొక మతగురువుగా మారిపోయాను. కృష్ణాకి నా బోధన విపులంగా వర్ణించాను. కుక్కపిల్లని దాని తల్లితో చేర్చమని ప్రేమాకి నేనిచ్చిన వివేకపూర్ణమైన ఆజ్ఞ గురించి మాటాడాను.

"అయ్యయ్యో . . . మామా . . . " అని కృష్ణా ఆవేశపడ్డాడు; కళ్ళు తడిబెట్టుకున్నాడు.

"కృష్ణా, మరేం భయం వద్దు. అది తల్లిదగ్గర క్షేమంగా ఉంటుంది," అని వాడిని ఓదార్చాను.

"అవును, నిజం. కాని దాని తల్లి లేదే? అక్కడ ఉండదే?"

ఆ నిమిషం వాడొక అనాధలాగ నాకు కనిపించాడు. రెండో నిమిషం "ఉండండి, నేను వెంటనే చూడాలి; ఇప్పుడే వస్తాను!" అని అంటూ వీధిలోకి పరుగెత్తుకొని వెళ్ళిపోయాడు.

నాకేం తోచలేదు. ఇంతలో ప్రేమా వచ్చేసింది. దాని చెయిలో కుక్కపిల్ల లేదు.

"కుక్కపిల్లని వదిలేసావా . . . దాని తల్లి దగ్గర?" అని అడిగాను.

"లేదు, నాన్నగారూ! అది కృష్ణాతోనేవుంది. పోస్టాఫీసు కాంపౌండులో కుక్కపిల్ల తల్లి కనిపించలేదు. ఏంచెయ్యాలో తోచక తిరిగివస్తుంటే, దారిలో కృష్ణా దాన్ని తీసుకున్నాడు; వాడికిచ్చేసాను!"

"వాడు ఇంటికి వచ్చేసాడా?"

"వచ్చేసాడు. 'కుక్కపిల్లని ఇవ్వరా, ఆడుకుంటాను!' అని నేనడిగితే ఇవ్వనన్నాడు."

ప్రేమా మాటలకి రుజువుగా పొరుగింటినుంచి కుక్కపిల్ల అరుపూ, కృష్ణా వల్లించే ముద్దులాటలూ నాకు వినిపించాయి.

'తల్లి కనిపించలేదని ప్రేమా తిరిగి వచ్చేసిందే?' అని నేను ప్రేమాగురించి గర్వపడ్డాను.

'తల్లిని లేవగొట్టి, ఒక కుక్కపిల్లని మాత్రం తీసుకొచ్చేసాడే ఈ తల్లిలేని కుర్రవాడు?' అని నాకు కృష్ణామీద జుగుప్స కలిగింది.

'సరి, పోనీలే, వాడిని తిట్టవద్దు!' అని నాలో నిశ్చయించుకున్నాను, కాని నాకు తెలిసిన నిజం - తల్లిలేని ఈ పిల్లవాడు ఆ కుక్కపిల్లని తన తల్లినుంచి దూరం చేసాడన్న సంగతి - గుర్తుచేసుకున్నాను. అదే నా మనసుని తీవ్రంగా బాధించింది. దానితోబాటు చాలా వేదాంత ప్రశ్నలూ, మానసిక సమస్యలూ, నన్ను తరుముతూ వచ్చాయి. 'సరే, ఇవాళ రాత్రి మన నిద్ర ఏమౌతుందో?' అనే భయమూ కలిగింది. అందువలనే కృష్ణాగురించి నాకు సానుభూతి తోచలేదు. బాహటంగా తల్లిలేని కుర్రవాడిని నేను బెదిరించలేదనే కారణంవలన నాకు వాడిమీదున్న ప్రేమానుభావాలు నా మనసులో ఎక్కడో ఒక మూల దాక్కున్నాయి.

నేను భయపడినట్లే ఆ రాత్రి నేను నిద్రపోయే సమయం ఆ కుక్కపిల్ల అరుపు నిలకడలేకుండా, ఇటూనటూ ఊగులాడింది. కృష్ణా తాతగారు వసారాలో నిద్రపోతున్నారని తెలిసి కుక్కపిల్ల ఎందుకిలా గొడవ చేస్తోందని అతన్ని అడిగాను. చూస్తే చిన్న జంతువు, దానికి ఇంత మొండితనం, పట్టుదల ఎలా వచ్చిందని నాకు ఒకటే ఆశ్చర్యం!

కుక్కపిల్లకి ఒక గదిలో పాలూ, పడక ఉంచి, గదికి తాళం వేసి, ఆ తరువాతే కృష్ణా వేరే గదిలో నిద్రపోతున్నాడట. కాని కుక్కపిల్ల పాలు తాగక, బయటకి వచ్చి ఇల్లంతా తిరగాలని మొండిగా ఉందట! అందుకే వాడు మాటిమాటికి దాని గదికి లేచి వెళ్ళి దాన్ని చూసుకుంటున్నాడు, తన గదికి తిరిగివచ్చి నిద్రపోతున్నాడు. ఈ కృష్ణాకి ఈ కుక్కపిల్లంటే ఎప్పుడూ విసుగు పుట్టదు!

నేను మరేం చెయ్యను? వాడికి ఆ కుక్కపిల్లమీద అంత అనుచిత అభిమానం ఉంది - అదే వాడి మతిమరుపుకి దారి తీసింది. నేను చెప్తే వాడు బాధ పడతాడు; కాని నాకు చెప్పడానికి ఇష్టం లేదు.

'సరే, ఇక నిద్రపోదాం, ఈ రాత్రంతా జాగరం!' అని విసుగ్గుంటూ నిద్రకి సిద్ధమైయ్యాను. కాని నేను లేచినప్పుడు సూర్యోదయం బాగా దాటిపోయింది; సూర్యకిరణాలకి బంగారు రంగు వచ్చేసింది.

పిల్లలందరూ చురుకుగా కనిపించారు; ప్రేమా మాత్రం నన్ను చూడగానే "నాన్నగారూ, కుక్కపిల్ల కనిపించలేదు. కృష్ణా ఏడుస్తున్నాడు," అని చెప్పింది.

ఆమె చెప్పిన మాటల్లో మొదటి సంగతి విని నేను సంతోషించాను; ఆ తరవాతది విని నా మనసు కరిగింది. పాపం, రెండు రోజులుగా కృష్ణా ఆ కుక్కపిల్లకోసం పడిన యాతన ఎలా వర్ణించడం? ఐనాకూడా వాడు మతిమరుపుగా, పిచ్చిగా, ఏదో చేస్తున్నట్టు నాకనిపించింది.

కళ్ళు తుడుచుకుంటూ కృష్ణా మా ఇంటికి వచ్చాడు.

"మామా, అన్ని చోట్లా చూసాను. జిక్కి కనిపించలేదు."

"అలాగా? బాగా చూడు . . . అది ఇక్కడ లేదు" అన్నాను. నాకు బాగా తెలుసు. ఇంతసేపూ గొడవ చెయ్యకుండా ఉంటుందా ఆ కుక్కపిల్ల?

కొంచెం సమయం తరువాత కృష్ణా "అదిగో!" అని అరిచాడు. నేనూ చూసాను. కుక్కపిల్ల కనిపించింది. కాని దాని బొందిలో ప్రాణం లేదు. మా ఇంటిపక్కన వున్న వెదిరు దడిలో రెండు కర్రలమధ్య ఆ పిల్లి తల దూర్చివుండాలి, బాగా తగులుకుంది, ప్రాణం పోయింది. అదే నా ఊహ.

"అయ్యో, మామా . . . " అంటూ కృష్ణా దాని దగ్గరకి పరుగెత్తుకొని వెళ్ళాలని ప్రయతినించాడు; నేను వాడిని ఆపాను.

"మామా, మీకు కుక్కపిల్లంటే అసహ్యం అని జిక్కికి తెలీదు. లేకపోతే మీ ఇంటిపక్క  పక్క వచ్చివుండదు!" అని గుడ్డివేటుగా నాకు చెప్పి కుక్కపిల్లని చూసాడు.

నాకేం బదులు చెప్పాలో అర్థం కాలేదు. కాని సమయోచితంగా వాడికి చెప్పాను.

"కృష్ణా, విను. నేను దానికి మంచిది చెయ్యాలనుకున్నానని జిక్కికి తెలుసు. దాన్ని తల్లిదగ్గర వదిలేయాసని నేను చెప్పలేదూ? ప్రేమా దాన్ని తీసుకువెళ్ళనప్పుడు 'పక్కింటి మామా మంచివారు!' అని తెలిసే అది మా ఇంటికి వచ్చింది. పాపం, దాన్ని తల్లిదగ్గరనుంచి దూరం చేసినది పెద్ద పొరబాటు. ఏయ్ కృష్ణా, నువ్వెందుకు ఆ పొరబాటు చేసావ్?" అని నేను వాడిని అడిగేసాను.

"నేనెక్కడ దాన్ని తల్లికి దూరంగా చేసాను? ఆ రోజు ఆ పోస్టాపీసు 'అంకుల్' తల్లినీ, పిల్లలల్నీకాంపౌవుండునుంచి లేవగొట్టారు. నేను వెళ్ళి చూసినప్పుడు ఈ కుక్కపిల్ల మెల్లగా నడుస్తోంది. 'అంకుల్, దాన్ని కొట్టవద్దు.  దాని తల్లి వెళ్ళిపోయింది. ఇక ఈ కుక్కపిల్లని నేను పెంచుతాను,' అని చెప్పి తీసుకొచ్చాను. మా అమ్మ పోయినతరువాత మా తాతగారుకదా నన్ను పెంచుతున్నారు? తల్లి లేదంటే కుక్కపిల్లని మనుషులేకదా పెంచాలి? పాపం, అది ఇప్పుడు చచ్చిపోయింది!"

కృష్ణా ఉక్కిరిబిక్కిరి ఐపోయాడు; నా నోటిలోనుంచి ఏ మాటా రాలేదు.

నేనెంత పెద్ద పొరబాటు చేసాను! పాపం కృష్ణా! వాడేమో పరిస్థితిని బాగా అర్థం చేసుకొని, తన బాధ్యత నిరవేర్చాలనే కుక్కపిల్లని ఇంటికి తీసుకొచ్చాడు.

వాడు కన్నీరు కార్చుతూనే వున్నాడు.

“కృష్ణా, పోనీలే, మరేం విచారం వద్దు!  మనకేమో కుక్కపిల్ల పెంచడమంటే అదేం పెద్దపని కాదనిపిస్తుంది . . . కాని, చూసావా, ఇప్పుడేమైందో? . . . మనందరికీ అది చేతకాదు, అదొక పీకులాట! మనమే కావాలని తెచ్చుకున్న గొడవ! . . . మనకెందుకీ పనికిమాలిన ముచ్చటలు?”

నేనేమో వాడిని సామాన్యంగా, వ్యక్తిగతంగా ఓదార్చడానికి చెప్పిన మాటలవి. కాని నేనూ మతిమరుపుతోనే మాటాడుతున్నానని గ్రహించి నాలో, నేనే లజ్జకు గురియయ్యాను!

********

**మూలం ప్రచురణ: సుదేశమిత్రన్, 1949**

# కీర్తి

కీర్తికెక్కిన నవలా రచయిత్రి 'రంగనాయకి' నిజం పేరు ఏమిటని ఆవిడ పాఠకులో చాలామందికి ఆతురత. అలవాటుగా రంగనాయకి అనే పేరు వినగానే ఒక స్త్రీనేకదా మనం గుర్తుచేసుకుంటాం? మరెందుకు ఆ పేరుని ఉద్ధరణ చిహ్నాలతో రాయాలి? అంటే రంగనాయకి అనేది కలం పేరని, ఆవిడకి వేరే సొంతపేరు వుందనికదా మనం అర్థం చేసుకోవాలి? ఆ పేరు ఏమిటి? 'రంగనాయకి' సొగసైన పేరుగా కనిపించదే? దీన్ని ఎందుకు ఆవిడ కలం పేరుగా వరించుకున్నారు?

'రంగనాయకి' నవతరాలవర్గంకి చెందిన రచయిత్రి కాదు; వయసు చెల్లిన అనుభవసాలిగానే ఆవిడ కనిపిస్తున్నారు; పది సంవత్సరాలుగా గ్రంధకర్తలమధ్య ఒక తారగా మెలుగుతున్నారు. ఆ రోజుల్లోనే  నళిని, మాలిని అనే ఆధునికమైన పేరులూ, కలంపేరులూ వాడుకలోకి వచ్చేసాయిగా?

ఇవన్నీ కూడా పాఠకులు చింతించారు.

'ఆవిడది అసలు - వేంబు, కుప్పు - అని మోటైన, వాడుకలో లేని పేరేమో, ఎవరికి తెలుసు? అలాగైతే రంగనాయకి ఒక నాగరికమైన పేరని మనం ఒప్పుకోవలసిందే!' అని మరి కొందరు మనస్తత్వవేత్తల దృష్టిలో వాదించారు.

ఐతేనేం, 'రంగనాయకి' కధలని మెచ్చుకున్నవారు, విపులంగా ఆవిడ రచనలు చదివి అనందించినవారు చాలామంది ఉన్నారనే కారణంవలనే ఆ పేరుగురించి అందరూ ఇన్ని కబుర్లు చెప్పుకున్నారు. మరి కీర్తి అని వస్తే  ఇటువంటి కాలక్షేపపు మాటలు సహజమేకదా?

'రంగనాయకి' అనే కలంపేరు ఎవరితో మాటాడినా, ఆ పేరుకింద ప్రచురమైనది పాఠకుని మనస్సుని బాగా వశం చేసుకుంటుంది. కొందరు పాఠకులకి అందులో వున్న కళాత్మక అందాలు, సూక్ష్మ జాడలు అర్థం కాకపోయినా 'ఇందులో ఏదో విశేషముంది!' అని వారు తమలో తమే ఊహించుకున్నారు. అంటే ఆవిడ ఖ్యాతి పలుదిశలా ఎంతవరకూ వ్యాపించిందని మనకి బోధపడుతుంది.

'రంగనాయకి' నివసించే ఊరులో వున్న కొంతమందికి ఆమె కలంపేరు వెనుకనున్న వాస్తవిక పేరు తెలుసు. కాని చాలా రోజులవరకూ వాళ్ళకికూడా 'రంగనాయకి' అనే అనాగరిక పేరుకి మూలమేమిటో తెలియదు. రంగనాయకికి ఒక కొడుకు ఉన్నాడు. అతను పెరిగి, పెద్దవాడై, ఇతరులు తన్నడిగిన ప్రశ్నలకి సమాధానం ఏమిటని తల్లిని అడిగాడు; అప్పుడే ఆ తల్లి అతనికి చెప్పింది.

ఆమె భర్త పేరు రంగ సాయి; అతని నాయకి ఈ రంగనాయకి.

ఇదెలాగ ఇతరులు ఊహించగలరు? భర్త రంగసాయి కమలవల్లి యౌవనంలోనే కన్ను మూసేసారుకదా?

భర్త ప్రియురాలుగా సంసారంలో పాల్గొని శిఖరాన్ని అందుకున్న కమలవల్లి ఇల్లాలుగా బాధ్యత వహించిన కొన్ని సంవత్సరాల్లోనే వితంతువుగా మారవలసిన దురదృష్టంకి గురి అయింది. కమలవల్లి అనే పేరు పోగొట్టుకొని, గతించిన భర్త ప్రియురాలుగా, రంగనాయకి అనే పేరుతో సాహితీరంగంలో ఆవిడ కాలుపెట్టారు. దూరంలో ఉన్నవారికి ఇవన్నీ తెలియదే!

రంగనాయకి ఒకే సుపుత్రుడు వాసుదేవన్ కి తల్లిమీద అపార ప్రేమ. ఆవిడకున్న సాహితీ ప్రతిభ, సమాజంలో ఆమెకున్న ప్రజాదరణ - వాటిలో అతనికి రవంతేవున్నా, అతనికి తల్లిపట్ల మంచి గౌరవముంది.

"నువ్వు రచయిత్రి రంగనాయకి గారి అబ్బాయివి. మరి కీర్తీ, ప్రతిష్టకి నీకేం తక్కువ?" అని కాలేజీలో మిత్రులు పొగడినప్పుడు తన వంశావళిని గుర్తించుకొని వాసు సంతోషించాడు.

కాలక్రమంలో అతని జీవితంలోనూ ఒక కొత్త అధ్యాయం ప్రారంభమైంది.

అతనికి పెళ్ళయింది. భార్య మంజుళా వచ్చినతరువాతకూడా అతను తల్లికి కొడుకుగానే ఉన్నాడు. అంటే భార్యపట్ల ప్రేమా, చనువూ తక్కువగా చూపాడని అర్థం కాదు. దానికి ఆ తల్లే ఇష్టపడదే! మనుషుల్లో ఎన్ని లక్షణావలక్షణాలు, మనోభావాలు, గుణవిశేషాలు! ఇవన్నీ తన కథలలో, నవలలో, విమర్శించే ఆ తల్లికి తన కొడుకూ, కోడలు మనస్సు తెలియదా? పేరుకి మాత్రం వాసు తల్లికి కొడుకుగా ఉన్నాడు, భార్యని బాగా చూసుకున్నాడు. రచయిత్రి రంగనాయకి దంపతుల మధ్య కుశలత కోసం అన్ని విధాలా ప్రయత్నం చేసింది. ఐనా ఇతరులు

- అధిక పక్షంవారు - తన కొడుకుని 'రంగనాయకి అబ్బాయి' అని వర్ణించడం, అది విని వాసు దాన్ని అప్రియమైన చేష్ట అని బాధపడడం ఆవిడకి తెలియదు. తెలిసినా ఆమె చేసేదేముంది?

అవును. వాసు మనసులో అదొక లోపంగా నిలిచిపోయింది.

దీపావళి పండుగకి వాసు అత్తగారింటికి వెళ్ళాడు. "రండి, రంగనాయకి సుపుత్రుడు రండి!" అని మామగారు అతనికి స్వాగతం చెప్పారు; అతనికీ సాహిత్యంలో మంచి అభిరుచి ఉంది.

ఆ స్వాగతం పలుకు విని వాసుకి ఎలాగో అనిపించింది; ఉత్తికే నవ్వేసి తనపని తను చూసుకున్నాడు. కాని అవాళ మధ్యాహ్నం సంభాషణలో మామగారు వాసుతో "మీ అమ్మగారికోసమే నేను ఈ సంబంధం చేసుకున్నాను" అని చెప్పారు.

అతను చెప్పినది నిజమే కావచ్చు. మనోభావాలు ఆరసించిన ఒక స్త్రీ తన కూతురుకి అత్తగారుగా రావడం మంచిదని అతని ఉద్దేశం కాబోలు. తన వియ్యంకురాలిని పొగడాలని అతనలా అన్నారేమో?

కాని, ఆ రోజు, వాసు ఉన్న మానసిక స్థితిలో అది అతనికి అతృప్తి కలిగించింది.

వాసు తన కూతురికి తగిన వరుడనే ఆసక్తితో మామగారు ఈ సంబంధం కోరలేదా?

ఆ ప్రశ్నే అతని మనస్సులో విశ్వరూపంగా ఎదిగి వాసుని పీడించింది. పెళ్ళైన తరువాత తనొక బాధ్యతలు నిర్వహించే మగవాడు అని అతను గర్వపడుతుంటే ఈ సంకేతం విని అతను అదిరిపోవడంలో ఆశ్చర్యమేముంది?

మనస్సు చాలా విచిత్రమైనది. ఇప్పుడు ఏర్పడిన తడబాటు ఆగినట్టు కనిపించినా, అస్సాములో ఏర్పడిన భూకంపం అస్సాము భూమండలాన్ని మార్చినట్టు, వాసు మనసుకూడా కొంచెం మారిపోయింది.

అయినప్పటికీ వాసుకి తల్లిపట్ల ప్రేమ తగ్గలేదు, కోపం రాలేదు. ఆవిడమీదున్న గౌరవంకి హాని రాలేదు.

ఆ మరుసటి సంవత్సరం అతనికి ఆడపిల్ల పుట్టింది. ముద్దుగా కూతురికి తల్లి పేరే - కమలవల్లి - ఇవ్వాలని నిశ్చయం చేసుకున్నాడు.

కొంతమంది రంగనాయకి అనే పేరు సూచించారు. కాని వాసు వారితో ఏకీభవించలేదు. "మా అమ్మపేరు అన్ని పుస్తకాల్లోనూ, పత్రికలలోనూ స్థిరంగా ఉంది. మరి అమ్మాయికి స్థిరంగా ఒక పేరు వద్దా? అది రంగనాయకి కాదు, రంగనాయకి మనవరాలు!" అని వాదించాడు.

అతనికి తల్లిపట్ల రమ్యత, ప్రేమ తగ్గలేదు. కొడుకనే అంతస్తు దాటి, భర్త, తండ్రి అన్న స్థాయి చేరుకున్న తరువాతకూడా  ఇతరులు తన్ను 'రంగనాయకి కొడుకు' అని పిలవడం అతను వ్యాకులంతోనే అంగీకరించాడు. తనకని పేరు లేదా? ఉద్యోగం లేదా? వాసుదేవన్ అనే స్వరూపంలో ఎటువంటి ప్రతిభా లేదా?

సొంత ఊరులో బంధువులూ, స్నేహితులూ, అతన్ని 'వాసు', 'వాసుదేవన్' అనే పిలిచారు. కాని ఉద్యోగరీత్యా ప్రయాణం చేసిన నగరాల్లో అదిక పక్షంగా అతన్ని 'రంగనాయకి కొడుకు' అనే పరిచయం చేసారు. కొన్నిసార్లు అతని సొంత పేరు చెప్పి పరిచయం చెయ్యడమైంది, కాని వెంటనే, వాఖ్యానంకి, తల్లిపేరు చెప్పి వివరణ అందించమూ ఐంది. 'ఓ, అలాగా? అనే ప్రశ్నతోబాటు, కాఫీ, టిఫను ఇచ్చి గౌరవించడమూ జరిగింది!

వాసు తండ్రికి కీర్తివున్నా అతని భార్యలాగ అంత ఆడంబరంగా అతన్ని గౌరవించివుండరు. 'రంగనాయకి' ఒక స్త్రీ; సుప్రసిద్ధ గ్రంధకర్తగా ఆవిడ పేరు సంపాదించారు. సామాన్యంగా మగవారికి కీర్తి వస్తే అది మగవారిమధ్య మాత్రం అధికారం చెలాయించుతుంది. కాని స్త్రీలకి ఖ్యాతి వస్తే ఆడవారూ, మగవారూ కూడా ఆ కీర్తికెక్కిన స్త్రీలని మరిచిపోరు.

వాసుకి వ్యక్తిగతంగా, ఉద్యోగరీత్యా అంతస్తు, ఆదరణ ఉన్నాయి. ఐతే అతనికి పేరు, పదోన్నతి రంగనాయకి కుమారుడు అనే వ్యాఖ్యానంతో వచ్చాయి. ఈ పరిస్థితిలోనే తనకి స్వతహాగా ఏమీ లేదా అనే ప్రశ్నఅతనిలో లేచి మనసుని కలవరపరిచింది.

ఇప్పుడు అతనికి ఇంకొక ఆలోచన తట్టింది.

తల్లివలన తనకి పేరు వస్తే, మంచిదే. తల్లి ఖ్యాతి అలా ఉండనీ - ఆవిడకి అందుకు అర్హత ఉంది. ఇతే, తన పిల్లలవలన తనకి ఖ్యాతి రాకూడదా?

అవును, ఎందుకు రాకూడదు? కూతురు కమలగాని భవిష్యత్తులో భరతనాట్యంలో శోభించుతే, ఎంతమంది కొత్త తండ్రులు "ఈ అమ్మాయి తండ్రి పేరు ఏమిటి?" అని ఆతురతో అడుగుతారు!

ఆ ఆలోచనతో వాసు తన అమ్మాయికి భరతనాట్యంలో శిక్షణ మొదలుబెట్టాడు.

కాని కొన్ని రోజులతరువాత ఒక సంగతి విని వాసు అదరిపడ్డాడు. ఆ రోజుల్లో ఇద్దరు ముగ్గురు ఆడ పిల్లలే నాట్యకళలో రాణించివున్నారు. వాళ్ళ తండ్రులపేర్లు వాసుకి చాలారోజుల తరువాతే తెలిసాయి. 'అతనొక ICS ఆఫీసరు కాబోలు!', 'అతనొక ప్రొఫెసరు!' అనే రీతిలో అతనికి వార్తలు అందాయి.

వాసు కల్పనలో తోచిన ఆలోచన ఇదే: ఎవరూ కమలని 'వాసుదేవన్ కూతురు' అని పిలవరు. పేరు తెలియకపోయినా తన్ను 'కమల తండ్రి' అని చెప్పుకుంటారు. కాని అతను కమల నాట్య అభ్యాసం ఆపలేదు.

కూతురు కమలి బేబీ కమలినిగా మారుతూ వచ్చింది. 'ఇతరులు నన్ను 'బేబీ కమలిని తండ్రి' అని గర్తించినా అది చాలు!' అని వాసు తన్ను ఓదార్చుకున్నాడు.

ఈలోగా అతని తల్లి కన్నుమూసింది.

"అమ్మా, నీ సొంతపేరుకి నిలకడగా కమలిని ఉంది; అదీ నీలాగే పేరూ, ప్రతిష్టా అందుకోవడానికి అన్ని విధాలా కృషి చెయ్యడం నా బాధ్యత!" అని వాసు తల్లి ఆత్మకి వాగ్దానం చేసాడు. కూతురు నాట్యాభ్యాసంలో నిండుగా శ్రద్ధ చూపాడు.

కాలక్రమంలో బేబీ కమలిని తొలి నాట్య ప్రదర్శనకి అర్హత సంపాదించుకుంది. వాసుదేవన్ స్నేహితులు, ఇరుగుపొరుగులవారు "వాసు కొమార్తె కమలిని త్వరలో బేబీ కమలిని అవబోతుంది!" అని గొప్పగా చెప్పుకున్నారు. "రంగనాయకి మనవరాలు రంగస్థలం ఎక్కి ప్రదర్శించే వేళ వచ్చేసింది!" అని పొగడారు. ఇతరులు తన్ను, తన కూతురు పేరుతో జోడించడంచూసి వాసు సంతోషించాడు.

గతసంవత్సరం మరణించిన తన తల్లితో తన కూతురుని పోల్చి కొందరు చెప్పిన మాటలు వాసు భక్తితో విన్నాడు.

బేబీ కమలిని తొలి నాట్యప్రదర్శకి ముందురాత్రి వాసుదేవన్ మనసు కలవరపడింది. నిద్ర రాక పడకమీద దొర్లుతున్న వాసు తటాలున లేచి తన డైరీలో రాసుకున్నాడు:

"రేపు జరిగే ప్రదర్శన తరువాత నా కూతురు జీవితం  బేబీ కమలిని అనే పేరుతో నర్తకిగా పేరూ, ప్రతిష్టతో కొనసాగుతుంది. ఆ తరువాత నా తల్లి కీర్తి మాసిపోయే అవకాసముంది. మా అమ్మగురించి మాటాడేవారు ఆవిడని 'బేబీ కమలిని నాన్నమ్మ; ముందు కథలు, నవలలు రాసే గ్రంథకర్త' అని వర్ణిస్తారేమో?

ఐతే అందుకని?

రేపు నేను నా కూతురుపై నాకున్న బాధ్యత  నెరవేర్చాలి . . . కమలిని రంగస్థలంలో ప్రేక్షకులముందు తప్పకుండా పొగడాలి; వెనక్కి తగ్గకూడదు, అది పొరబాటు!" అని వాసు రాసుకున్నాడు.

పాతరోజుల వ్యాకులత, రాబోయే రోజుల సంఘటనలగురించి కల్పనలు వాసుని తత్తరపాటు చేసాయి. ఈ వివరణ డైరీలో రాసుకున్న తరువాతే అతనికి నిద్ర పట్టింది.

నాట్యప్రదర్శన బాగానే సాగింది. వాసుకి పక్కనే కూర్చొనివున్న ఒకతను ప్రదర్శన చూసి మెచ్చుకున్నారు.     "సార్, మీ ఇంట్లో సరస్వతి కాపురముందనిపిస్తోంది. మీరూ, మీ అమ్మగారూ . . . అందరూ ఎంత పెద్ద ఆర్టిస్టులు!" అని అతను శ్లాఘించారు.

"నా పేరెందుకు కలుపుతున్నారండీ? నాకేం ప్రతిభ ఉంది?" అని వాసు అడిగాడు.

"అలా చెప్తే ఎలాగ? మీకూ సరస్వతి కటాక్షం ఉంది. అందువలనే మీ అమ్మాయి ఇంత త్వరలో విద్య నేర్చుకుంది. మీరు శ్రద్ధతో, ఆమె త్రాణ గుర్తు చేసుకొని అభ్యాసంకి దారి చూపారు. లేకపోతే ఇదెలా సాధ్యం, చెప్పండి?" అని అతను పొగడారు.

తన మూలంగా తన కుటుంబానికి ఖ్యాతి వచ్చిందని విని వాసు సంతోషించాడు. 'అవును, నిజం!' అని తనలో తనే చెప్పుకున్నాడు.

ఆ రోజు వాసు మళ్ళీ డైరీలో రాసుకున్నాడు:

"నాట్య ప్రదర్శన శుభంగా నెరవేరింది. ఇక భవిష్యత్తులో బేబీ కమలిని పేరూ, ప్రతిష్టతో వర్ధిల్లడానికి దేవుడు అనుగ్రహించాలి!

గతించిన కాలంలో మా అమ్మకి ఖ్యాతి ఉండేది, నాకు లేదు. అందువలన మా కుటుంబంకి ఖ్యాతి లేదు. ఇప్పుడు కమలినికి వచ్చిన ఖ్యాతి మూలంగా మా వంశంకే సరస్వతి కటాక్షముందని చెప్పుకుంటున్నారు. ఈ రెండు తరాలను జోడించే నాకూ కీర్తి వచ్చేసింది!" అని వాసు హర్షించాడు.

ఆ తరువాతి రెండు రోజుల్లో వార్తాపత్రికలు కమలిని తాండవ భంగిమ ఫోటోతోబాటు  నాట్య ప్రదర్శన గురించి వివరాలు ప్రకటించాయి.

"కథానిక సాహిత్యంలో సరస్వతిగా ప్రకాశించిన కీర్తిశేషులు 'రంగనాయకి' మనవరాలు కమలిని నాట్యరంగంలో ఒక నూతన తారగా మొదలుబెట్టింది. సాహిత్యంలో కీర్తికెక్కిన స్త్రీలు అరుదైన కాలంలోనే 'రంగనాయకి' ఉదయించి పునరుజ్జీవన ఉద్యమంలో కీర్తి పొందారు. ఈ రోజుల్లో నాట్యకళా రంగంలో మనం చూసే యువతులు కొంతమందే. అటువంటి పరిస్థితిలో, అదే సరస్వతి కటాక్షంతో ఈ బాలిక ప్రత్యక్షమైందని మనం ఆశించుదాం! ఈ బాలికలో ఆ శ్రేష్ఠత ఎదురు చూద్దాం!"

ఈ ధోరణిలోనే చాలా పత్రికలూ రాసాయి; ఎవరూ వాసుదేవన్ పేరు ప్రస్తావించలేదు. ఆ రోజుతో, ఆ డైరీ గుర్తుతో తన కీర్తి అంతమైందని వాసు బాధపడ్డాడు.

ఇవన్నీ జరిగి చాలా సంవత్సరాలు ఐపోయాయి. నాన్నమ్మ, మనవరాల పేర్లు మాసిపోయాయి. కాని వాసు ముందులాగే ఉన్నాడు.

********

**మూలం ప్రచురణ: సుదేశమిత్రన్,1950**

# ఊహా లోకం

ఆమె క్రమేణ, నెమ్మదిగా, రచయిత్రిగా మారుతూ వచ్చింది. ఆమె కథలు పత్రికలలో ప్రచురమయ్యాయి. ఆ రోజు వరకూ తన రచనలు సంపాదకులు అంగీకరిస్తారా అనే అనుమానం, అధైర్యం చోటుచేసుకున్న ఆమె మనసుని ఇప్పుడు తృప్తి, ఉత్సాహం నింపాయి.

మొట్టమొదట తన కథ ప్రచురమవుతందని తెలియగానే తన హర్షం అదుపులో ఉంచుకోవాలనే రాజం ప్రయత్నించింది. 'ఇదేం గొప్ప? ఇవాళా, రేపూ, చాలామంది కథలు రాస్తున్నారే?' అని తనలో చెప్పుకొని ఉరుకుంది. కాని ఆమె భర్త చేసిన 'దండోరా' మూలంగా ఆ వార్త బయటికి వచ్చేసింది. ఏ భర్త మనసులోనైనా తన భార్య సాహితీ ప్రతిభ ఇతరులకి తెలియాలనే కాంక్ష ఉండడం సహజమేకదా?

అతను చాటించడంతో రాజమూ అందరికీ చెప్పేసింది. అత్తమామలు, తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, అందరూ విని ఆనందించారు. రాజం మొదటి కథ ఎప్పుడు ప్రచురమవవుతుందా అనని అందరికీ ఆతురత.

కథ ప్రచురమైంది. అందరూ చదివి తమ తమ అభినందన, సంతోషం, రాజంకి తెలియజేసారు. నిజంగానే అది మంచి కథ; రాజంకీ ఆత్మోన్నతి కలిగింది.

కాని ఆ తరువాత జరిగిన గడబిడ రాజంకి కొంచెం శ్రమగానే కనిపించింది. కృతజ్ఞత తెలుపుతూ అందరికీ ఉత్తరాలు రాయడం ఏం పెద్ద బాధగా తోచలేదు. కాని వాళ్ళడిగిన తక్కిన ప్రశ్నలకి జవాబు రాయడం వ్యర్థం అనిపించింది. కొన్ని ఉత్తరాలకి జవాబు రాసింది; తరువాత ఏం చెయ్యాలని నిర్ణయించుకుంది.

ఆ సమయంలో జవాబు రాయడానికి నిజంగానే రాజంకి అవకాశం లేదు. ఆమె కల్పనలో కొత్త కొత్త కథలు రాయడానికి భావనలు లేచి యెగురుతున్నాయి. వాటిని గ్రహించి, పోషించి, వాటికి సృజనాత్మక రూపం ఇవ్వాలి; దానికి మనసు కుదుటపడాలి. శాంతి కావాలి; ఆ స్థితి కావాలని రాజం ఆశించింది.

ఆ తరువాత రాజం రెండు మూడు కథలు రాసింది; అవి ఎప్పుడు పత్రికల్లో ప్రచురమవుతాయని ఆమె ఎవరికీ చెప్పలేదు.

‘ఇక నేను కథలు రాస్తూనే ఉంటాను, అవీ ప్రచురమౌతూ వస్తాయి. ఒక్కొక్కదాన్నిగురించి రాయడమంటే నాకు సాధ్యం కాదు!’ అనే ధోరణిలో రాజం మరేం అనక ఊరుకుంది.

నాలుగవ కథకి బహుమానం వచ్చింది; అప్పుడు రాజం పుట్టినిల్లులో ఉంది.

“ఏమే రాజం, నువ్విలాంటి కథ రాసావే? నీ అత్తగారింట్లో ఎవరైనా చదువుతారనే భయం నీకు లేదా? దీనికి ప్రైజుకూడా వచ్చేసింది. వాళ్ళూ తప్పకుండా చదువుతారు!” అని రాజం తల్లి ఆ కథని చదివిన వెంటనే అడిగింది.

తల్లి సరైన ప్రశ్నే అడిగింది; ఇంతకు ముందు నాలుగు కథలు చదివి ఆవిడకి చాలా సంతోషం; ఇప్పుడిలాగ అడగడానికి కారణముంది.

ఆ నాలుగు కథలూ రాజం ఒక ‘ధోరణి’లో రాసింది; ఈ కథకి వాటితో పోలిక లేదు.

ఆ నాలుగు కథలూ రాజం పూర్తిగా సృష్టించిన కల్పనాత్మక చిత్రాలు. తను స్వయంగా కన్నులతో చూసి, చెవులతో విని, మనసులో ఊహించుకొని, ప్రేమానుభవాల ప్రభావంకి రూపమిచ్చి రాసిన కథలవి. రాజంకున్న లోక పరిచయం ఆ కథల్లో అందరికీ బోధపడింది.

కాని ఈ కథలో రాజం తన సొంత అనుభవం తెలియజేసింది. అది కుటుంబంలో ఒక ఘటన. తన అనుభవంలో జరిగినది ఆవరించుకొని రాజం ఆ కథ రాసింది.

అనుభవాన్ని పునాదిగా పెట్టుకొని కల్పనని సెలగొల్పడం పొరబాటు కాదు. ఆ అనుభవం పురికొల్పిన కల్పనలో ఒక కోట లేక భవనం లేచి రాణించడానికి అవకాశముంది.

సొంత అనుభవం మూలంగా చిత్రించిన కథ దివ్యంగానే ఉంటుంది; దానికి రుజువు? ఇదిగో, దానికి బహుమానం వచ్చేసింది!

కాని ఆ తల్లికెందుకు విచారం? రాజం ఏ ఘటన గురించి రాజం ఆ కథ రాసిందని ఆవిడకి తెలిసిపోయింది! అందువలనే!

ఆ ఘటన రాజం అత్తగారింట్లో జరిగింది. ఆమె లేత మనసుని చిత్రవధ చేసిన ఘోర సంభవం అది. ఇన్నిరోజులూ ఆ వేదన రాజం వైరాగ్యంగా భరించింది; గాయం మానుతూ వచ్చింది. కాని . . .

శిథిలమైన మనసు పూర్తిగా కోలుకోలేదు. అందుకే అది వేరే విధంగా బహిర్గతమైంది.

ఆ రోజు తను అనుభవించిన కటుత్వం రాజం తల్లికి మాత్రం కొంచెం జాడగా తెలియజేసింది. కాని ఇప్పుడు ఆమె మనసులో కల్పనా శక్తి, రచనా నైపుణ్యలో స్పష్టత వర్ధిల్లుతుంటే, క్రమంగా ఆ పాత ఘటనపట్ల ఒక కల్పనాత్మక కొమ్మ లేచింది; ఆ తరువాత మెల్ల మెల్లగా మరి కొన్ని శాఖలు దాన్నిచుట్టుముట్టుకొని ఆఖరికి ఒక పరిమళమైన పందిరి లేచింది. దాన్నే రాజం ఇప్పుడు బట్టబయలు చేసేసింది!

ఐతే ఎటువంటి ముందాలోచన లేకుండా ఆమె ఆ పని చెయ్యలేదు. రాజం మనసులో ఒక ప్రశ్న లేచింది: 'ఈ కథ చదివిన తరువాత వాళ్ళు ఏమనుకుంటారు?'

కాని ఆశ, ఆవేశం ఆ ప్రశ్నని అణగదొక్కాయి. 'నేను పడిన కష్టాలు ఎన్ని!' అనే ఆవేశం. 'నా భాధ చుట్టూ లేచిన ఈ చక్కని కల్పనా చిత్రం ఎందుకు కథగా అచ్చులో రాకూడదు?' అనే ఆశ!

కథ రాసి పంపించడం అయింది; అది పత్రికలోనూ వచ్చేసింది.

తల్లికీ తెలిసిపోయింది; ఆ చిన్న ఘటన కథకి పునాది అని ఆవిడ కలవరపడింది.

తల్లి భయంతో అన్న మాటలు విని రాజంకి రోషం వచ్చింది.

"అమ్మా, వాళ్ళు చదవాలంటే, చదవనీ! నేను పడిన బాధలన్నీ వాళ్ళకీ తెలియనీ! వాళ్ళకి ఎదురుగా నేనేమీ అనలేకపోయాను; లోలోపల వేదన అనుభవించాను, నా మనసుకి శాంతి లేదు! ఇప్పుడు కథ మూలంగా వాళ్ళకి చెప్పదలచుకున్నాను."

"వాళ్ళు కోప్పడకుండా నిన్ను చూసి 'ఇలా ఎందుకు మా గురించి రాసావ్?' అని అడిగితే ఏమంటావో?' అని తల్లి అడిగింది.

"వాళ్ళు అలాగేం నోరు విప్పి నన్ను అడగరు! తప్పుచేసిన మనసుకి అదెలా సాధ్యం? జాడగా వాళ్ళు ఏమైనా అడుగుతే నేనూ దానికి సరిగ్గా ఏదో జవాబు చెప్పితీరుతాను! 'నేను మీగురించి రాసానని ఎందుకు అంటున్నారు? ప్రపంచంలో మరెక్కడా ఇలాగ జరక్కూడదా?' అని అడుగుతాను."

"అదేంటో, నా దగ్గర ఇప్పుడిలా వాగుతున్నావ్, కాని వాళ్ళముందు ఏమంటావో? ఇన్ని రోజులూ నువ్వంటే వాళ్ళకి మక్కువ, మర్యాద ఉంది. ఇప్పుడు ఈ కథ వలన నీకు చెడ్డపేరు ఎందుకు రావాలి? ఇదేం వెర్రితనం?" అని తల్లి వాపోయింది.

"అమ్మా, నేను పడిన కష్టాలు నాకు మాత్రం తెలుసు. తలుచుకుంటే ఇప్పుడుకూడా నా దేహం వొణుకుతోంది! ఆ రోజుల్లో ఎలాగో నేను అన్నీ భరించాను. కాని ఇప్పుడు నా మనసులో ఏదీ నిలకడగా ఉండదు. రాసిన తరువాతే నాకు భారం తొలిగినట్టుంది. వేదన అనుభవిస్తూ మంచి పేరు వస్తే ఏం గొప్ప? ఆ మంచి పేరు నాకు వద్దు! ఇక నేనెవరికీ, దేనికీ భయపడను!"

"రాజం, నా మాట విను! 'నేనెవరికీ భయపడను!' అని అనకు. 'కోడలు ఇప్పుడు వేరే కాపురం చేస్తోందికదా, అందుకే ఈ ఉపేక్ష!' అనే నిందారోపణ నీ మీద తప్పకుండా వచ్చి పడుతుంది. గర్తుంచుకో, మనకి ఇతరుల ఆశ్రయం ఎప్పుడూ కావాలి!" అని తల్లి బోధన చేసింది.

"నేనిక కథలే రాయదలచుకున్నాను; మంచిదీ, చెడ్డదీ కలిపే రాయాలి. ఇక నేనెవరికీ భయపడను! వెనకాడను!" అని అంటూ రాజం గిర్రున లోపలికి వెళ్ళిపోయింది.

అవి ఆమె నిబ్బరంగా పలికిన మాటలే; ఐనా ఆనె మనసులోని అలజడి పోలేదు.

అవును. ఆమె ఇన్ని రోజులూ భరించినది వ్యర్థమేమో అని రాజంకి తనపైనే జాలి కలిగింది. దానితోబాటు పగ తీర్చుకోవాలనే ఆతురతకూడా లేచింది.

'ఇదేం లోకం, అన్యాయ లోకం! మానసిక వేదన దాచుకుంటే దానికి పేరు ఓర్పు! దాన్ని బట్టబయలు చేస్తే అది నీచమైన పని! 'సరే, నా మనసు చల్లబడనీ, ఇతరులని నొప్పించవద్దు', అని నేను ఓరగా నిలబడితే దానికి పేరు మోసం! ఇదేం

లోకం? నేనెందుకు నిత్యమూ భయపడుతూ చావాలి? ఎటువంటి బాధ్యత లేకుండా ఉంటే బాగున్ను, కాని అదేలాగ సాధ్యం?'

రోజులు దొర్లాయి. కొన్ని మాసాలు గడిచాయి.

"వదిన ముందులాగ లేదు; బాగా మారిపోయింది!" అంటున్నారు ఆడపడుచులు.

"దాని మనసులో ఇంత పగ ఉందని ఎవరికి తెలుసు? ఎంత విడ్డూరం!" అని రాజం అత్తగారు ఇరుగుపొరుగులవారితో చెప్పుకున్నారు.

రాజం వేరే ఊరులో కాపురముంటోంది. అమెను నేరుగా కలుసుకోలేనివారు ఇటీవల ఆమె దగ్గరనుంచి ఉత్తరాలు తరచుగా రావడం లేదని అంటున్నారు.

రాజం కథలు, వ్యాసాలు రాస్తూ పనితొందరలోవుందని వాళ్ళకి తెలుసు; మరెందుకు  కోపం? ఆ కథే కారణమని రాజం గుర్తుచేసుకుంది.

ఇప్పుడు ఆమె మనసులో ఒక ప్రశ్న లేచింది:

"ఆ 'సరస్వతి త్యాగం' నేను రాయకపోతే ఎంత బాగున్ను?"

ఆ కథని త్యాగం చేసే త్రాణ అప్పుడు తనకి లేదని రాజం బాధపడింది.

అది రాసినవెంటనే మనసులో ఊరట. అది ప్రైజు కథగా పత్రికలో రాగానే ఆమెకు గర్వమూ కలిగింది. దానితోబాటు ఆ కథకి మూలాధారమైన తన పఠననైపుణ్యంకి కృతజ్ఞత చెప్పాలనే భావన లేచింది.

ఆ రోజునుంచి రాజం మనసులో ఎటువంటి మలినమూ రవంతకూడా లేదు. 'వాళ్ళ' పట్ల ఆమెకున్న ఉగ్రత మాయమైపోయింది!

కాని వాళ్ళ మనసు ఇప్పుడూ రాజంని సంశయంతోనే చూస్తోంది. పగలేని నిర్మలమైన ఆమె మనసుని - దాని నిజ పరిస్థితిని -వాళ్ళు గ్రహించలేకున్నారు.

రాజంకి వాళ్ళపట్ల కోపం లేదు. ఆమె నిరాశంతా రెండు పక్షాలమధ్య ఉన్న ఎడబాటు గురించే.

'ఆ కథని త్యాగం చెయ్యడానికి నాకు శక్తి లేకపోయిందే!" అని రాజం అంగలార్చుకుంటోంది. అది ఆమె భర్త దిక్కులేక చూస్తున్నాడు; కాని ఎగతాళి చెయ్యలేదు!

"కల్పనాశక్తితో ఏదైనా చిత్రించడమంటే అది ఇంపుగా ఉండాలా ఏమిటి? అది అసహ్యంగా కూడా ఉండవచ్చు!" అని చెప్తే ఎవరైనా ఏకీభవిస్తారా?

ఆ ప్రశ్నతోనే రాజం ఇప్పుడు తన మనసుతో మల్లాడుతోంది.

********

**మూలం ప్రచురణ: పారిజాతం, 1947**

# మంచి మనసు

‘వెయ్యి అబద్ధాలు చెప్పవలసివచ్చినా సరే, ప్రేమికలిద్దరిని జోడించి పెళ్ళి చెయ్యాలి’ అనే సామెత సాంబుకి తెలియదా? బాగా తెలుసు. యోగ్యతగల అటువంటి జంటలని కనుక్కొని, పెళ్ళికాని యువతులకి వరుడు అమర్చి, పెళ్ళికి ఇష్టపడని యువకులకు బోధన చేసి వధువు ఏర్పాటు చేసి అతను మంచి పుణ్యం కట్టుకున్నారు. కాని జోడు పావురాలుగావున్న ఒక మంచి దంపతులని ఎడబాటు చేసిన పాపానికి అతను గురి అయ్యారే? ఈ బెడద గురించి ఎవరిదగ్గర అతను మొరబెట్టుకుంటారు? ఒక కుండ పాలులో ఒక బొట్టు విషం పడినా చాలు, అదొక దుర్ఘటనగా మారదూ? ఆ తరువాత అతనిమీద ఎవరికి గౌరవం ఉంటుంది?

“నాయనా రాజు, బాగున్నావా?” అని అడుగుతూ సాంబు రాజారామన్ ఇంటికి వచ్చారు.

“రండి సార్, రండి,” అని రాజు స్వాగతం చెప్పి, అతన్ని కూర్చోబెట్టాడు. చిరునవ్వుతో లోపలకి వెళ్ళినవాడు భార్య శ్యామళతో తిరిగివచ్చాడు. భయభక్తితో శ్యామళ సాంబుని నమస్కరించింది; సాంబు దంపతులని చూసి సంతోషించారు.

“ఏమ్మా, నువ్వు ఇప్పుడు పనిలో ఉన్నావా?” అని సాంబు అడిగారు.

“లేదే? . . . ఎందుకు అడుగుతున్నారు? . . . చెప్పండి . . . ”

“మరేం లేదు . . . ఓ రెండు పాటలు పాడి నాకు వినిపించుతావా? పెళ్ళి సమయంలో నేను సరిగ్గా వినలేదు . . . నువ్వు రోజూ పాడుతున్నావు కదూ?”

“రోజూ సాధకం చెయ్యకపోయినా, పాడడం వదల్లేదు . . . రోజూ అర్ధగంటైనా పాడుతాను.”

“సరే, వీణ తీసుకురా . . . రాజు, నువ్వూ మీ ఆవిడ సంగీతం వింటున్నావు కదూ?” అని సాంబు అడిగారు.

శ్యామళ వీణతో ఎదుటనున్న చాపమీద కూర్చుంది. త్వరగా ఆమె వేళ్ళు మీటుతూంటే, ఆ తీగలనుండి, మధురమైన కీర్తన వెలుబడింది. అది విని సాంబు ఆహ్లాదించారు. తన నెఱిసిన జుత్తులో అక్కడక్కడ ఉన్న నల్ల వెంద్రుకలు చూసి

ఆనందించడం అతనికి అలవాటు. ఇప్పుడు అతను ఇంకా తీవ్రమైన ఆకాంక్షతో శ్యామల వాయింపులోని మెరుపులు, సౌకుమార్యం అనుభవించారు.

"చాలా బాగుందమ్మా నీ గానం," అని సాంబు పొగడారు.

"ఏమిటో . . . ఇదేం గొప్ప? ఇవాళా రేపు ఎంతమంది బాగా పాడుతున్నారు!"

"నీ పాట ఘనత నీకు తెలియదమ్మా . . . నేను చెప్పినది నిజం . . . "

"ఇదిగో చూడండి, నా పాట విని మా అయన అలసిపోయారు కాబోలు . . . మీకూ తలనొప్పి వస్తుందేమో? ఉండండి . . . కాఫీ తీసుకువస్తాను!" అని శ్యామళ వంటగదికి వెళ్ళింది.

"ఏమయ్యా రాజు! మీ ఆవిడ ఓ రెండో, మూడో పాటలు 'రికార్డు' ఇవ్వడానికి నేను ఏర్పాటు చెయ్యగలను. ఏమంటావ్?"

"ఎందుకండీ . . . " అని రాజు లాగాడు. అతనికి అందులో ఆసక్తి లేదని బాగా అర్ధమైంది.

"అదేం మాటవోయ్? ఎవరెవరో పెద్ద విద్వాంసులు రికార్డు ఇస్తున్నారు, అది అలా ఉండనీ . . . అమెచ్యూర్ ఆర్టిస్టులు కూడా చాలామంది ఇస్తున్నారే . . . శ్యామళకి నేను ఏర్పాటు చెయ్యగలను . . . "

కొంచెం సమయం తరువాత శ్యామళ కాఫీతో వచ్చినప్పుడు సాంబు ఆమెకీ అదే చెప్పారు. వంటగదిలోనుంచి శ్యామళ వాళ్ళ సంభాషణ వింటూనే ఉంది. భర్త ఉద్దేశం అనుసరించి ఆమె "ఇప్పుడేం వద్దండి. నేనింకా నా గానం వృద్ధి చేసుకోవాలి" అని చెప్పింది.

"ముందు ఒక అడుగు పెట్టావనుకో, ఆ తరువాత బిర బిరగా గానం వృద్ధి చేసుకోవాలని ఆవేశం వచ్చేస్తుంది," అన్నారు సాంబు.

"అది సరే . . . నేనింకా బాగా అభ్యాసం చేస్తే, మొదటి రికార్డే అద్భుతంగా రావొచ్చుకదా! రేడియోలో పాడడానికి ఛాన్సు దొరికితే అదీ మంచిదే కదా?"

"సరే, నీ ఇష్టం! సాధకం చేస్తూ ఉండు! అది మానుకోవద్దు!" అని హెచ్చరిక చేసి అతను శెలవు తీసుకున్నారు.

అతను వెళ్ళిన తర్వాత శ్యామళ భర్తని చూసింది; అతనేదో ఆలోచనలో దీర్ఘంగా ఉన్నాడని గుర్తు చేసుకుంది. "'నాకింత అదృష్టమా? నా భార్యకి అంత యోగ్యతవుందా?' అని ఆలోచిస్తున్నారా?" అని చెప్పి నవ్వింది.

"యోగ్యతా, అదృష్టం - వీటిగరించి నాకేం తెలీదు. అటువంటి పరిశోధనలు స్త్రీలకే సాధ్యం!" అని రాజు చిరచిరలాడాడు. అతని మాటల్లో, మొహంలో ఎటువంటి అనుభూతి కనిపించలేదు.

** ** **

కొన్ని మాసాలు గడిచాయి. పుట్టినిల్లుకి వచ్చిన శ్యామళ సాంబుని ఒక రోజు కలుసుకుంది. ఈ కలయికకి ముఖ్యతవుంది. సాంబు ఆ రోజు తను మాట ఇచ్చినది ఇప్పుడు పూర్తి చేసారు. వేళ అని వస్తే అన్నీ తమకుతామే వచ్చి చేరుతాయి అనే రీతిలో ఒక దినం శ్యామళ వీణా గానం గ్రామఫోను రికార్డులో భద్రపరచడమైంది. అప్పుడే రికార్డు మధ్య కనిపించే ఇరుకైన గీతల్లాగ శ్యామళ మనసులో ఎన్నో ఆలోచనలు లేచాయి. ఆ రికార్డు గీతల్లో దాగియున్నకీర్తనలాగే తన ఆలోచనల లోతులో ఒక ఉల్లాసమైన ధ్వని చెలరేగుతున్నట్లు ఆమెకి అనిపించింది. తన భర్త తన సంగీతంలో ఎటువంటి శ్రద్ధా చూపలేదని, ఓ రెండు సార్లు సాంబు బోధన అతను విమర్శన చేసాడని శ్యామళకి తెలుసు. కాని సాంబు తన వాగ్దానం ఇప్పుడు పూర్తిచేసారు; అతనేం ఉత్తికే వాగలేదు. హృదయపూర్వకంగా, అనురాగంతో  అతను సాయం చేసారన్న తన సంతోషంలో రవంతైనా తన భర్తకి ఉండదా అనే భావనతో మరేం ఆలోచించక శ్యామళ సాంబు చేసిన ఏర్పాట్లతో ఏకీభవించింది.

ఆ రికార్డు వెలుబడిన వెంటనే భర్తకి దాని గురించి ఉత్తరం రాసింది.

** ** **

కాని అందుకు ముందే రాజుకి ఆ సంగతి తెలిసింది.

గ్రామఫోను రికార్డులు అమ్మే ఒక పెద్ద భవనం ఉన్న వీధిలో రాజు నడిచి వెళ్తున్నాడు. ఎవరో యువతి పాడుతున్న పాట రికార్డు మూలంగా అతని చెవుళ్ళకి అందింది.

'అన్ని వీధుల్లోనూ, హోటల్లోనూ ఒక స్త్రీ పాట వినిపించాలా? అవమానం! అవమానం!' అని రాజు విసుగ్గున్నాడు.  ఆ రోజు సాంబు తన భార్యకూడా

రికార్డులు ఇవ్వాలని ప్రోత్సాహించి పలికిన మాటలు ఇప్పుడు గుర్తుకి వచ్చాయి; వెంటనే చిరచిరలాడాడు.

ఎవరో అతన్ని పేరు చెప్పి పిలిచారు; రాజు తిరిగిచూసాడు; చెయి సైగని గుర్తించి అతన్ని చేరుకున్నాడు. అతను గ్రామఫోను రికార్డులు అమ్మే వ్యాపారి; ఇద్దరికీ పరిచయముంది. అతను రాజు వీపు తట్టి, లోపలికి రమ్మన్నారు. ఉన్నట్టుండి రాజుకీ, అతని భార్యకీ అభినందనలు తెలిపారు. ఎందుకు అభినందనలు? సంగీత జగత్తులో శ్యామళా రాజన్ పైకి లేచిందని చెప్పడానికి. ఆమె రికార్డులు త్వరలో రాబోతున్నాయని అతను తెలియజేసారు. అది విని ఆహ్లాదించక రాజు మనసు ధుమధుమలాడింది.

రెండు రోజుల తరువాత భార్య రాసిన ఉత్తరం ఆ సంగతి దృఢపరిచింది. తనెవరో పరిచయంలేని స్త్రీగురించి విమర్శించాడు; ఇప్పుడు తన భార్యే ఆ విమర్శనకి గురి అయింది. అతనెలా అది సహించగలడు?

"అన్ని సందుగొందుల్లోనూ నీ పాట వినిపించాలా ఏమిటి? నలుగురు నీ గానం గురించి మాటాడుకోవాలా? అది నీకు అవమానం కాదా?" అనే కఠిన ధ్వనిలో అతను భార్యకి రాసాడు.

"'కళ వర్ధిల్లాలి! మంచి పేరు రావాలి!' అని మనం ప్రయాస పడుతుంటే ఇవన్నీ లెక్క చెయ్యవచ్చా? ఇక చూడండి, నా సంగీతం ఎలా మెరుగుపడుతుందో?" అని శ్యామళ నిశ్చింతగా, నిమ్మళంగా అతనికి ప్రత్యుత్తరంలో రాసింది.

"అలాగా? ఐతే ఇక నీ సంగీతంతో నువ్వే ఏలపించు! అది ఎలా మెరుగుపడుతుందో నేనూ చూస్తాను!" అని నిష్ఠురంగా రాజు భార్యకి చెప్పేసాడు. ఇక ఆమెతో తను జీవితం గడపడం అసాధ్యమని వక్కాణించి ఆమెని తిరస్కరించాడు.

భర్త తీక్ష్ణమైన మాటలు చదివి శ్యామళ నమ్మలేకపోయింది. ఊరికి వెంటనే తిరిగివెళ్ళాలని, భర్తని చేరుకోవాలని ఆమె తహతహలాడింది.

కాని శ్యామళ తండ్రి వద్దన్నారు. అసలు ఏం జరిగిందో తెలుసుకోవాలని అతను తనే రాజుకి ఒక ఉత్తరం రాసారు; నిజమేమిటో రుజువైంది; శ్యామళ విని ఉలిక్కిపడింది.

ఇది విని సాంబుకి దిగ్భ్రాంతి కలిగింది.

'నేనెంత పొరబాటు చేసాను!' అని అతను వాపోయారు.

"నాయనా రాజూ, నా మాట విను . . . నువ్విలాగ ఒక అమ్మాయి జీవితం నాశం చెయ్యకూడదు!" అని అతనికి బోధన చేసారు.

అతని తల్లిదండ్రులుకూడా రాసారు, కాని రాజు మనసు మారలేదు.

"నాకు దానితో ఏ పొత్తూ వద్దు!" అని పళ్ళని కొరికాడు.

** ** **

"రాజూ, రా, సినిమాకి వెళ్దాం. మన ఇద్దరికీ మనసు కుదుటపడాలి!" అని స్నేహితుడు కిట్టు పిలిచాడు.

"ఇప్పుడు నాకేం చింత? పాపం, నీ భార్య పోయిన తర్వాత నువ్వు ఆమె జ్ఞాపకంలో బాధ పడుతున్నావ్. నాకది తెలుసు. నేను హాయిగానే ఉన్నాను" అన్నాడు రాజు. అతను పలికిన ధోరణిలో గాంభీర్యం కనిపించినా, ఆ మాటల్లో సారం లేదు.

"సరేలే, నేను వస్తాను. నా సహవాసంలో నీకు ఓదార్పు అంటే నాకూ సంతోషమే," అని అంటూ రాజు కిట్టుతో వెళ్ళాడు.

"మా ఆవిడని తలచుకుంటే నాకిప్పుడు చాలా బాధగావుంది. నేనుగాని దాన్ని ఏదైనా సినిమాలో నటించడానికి చాన్సు ఇచ్చివుంటే ఎంత బాగున్ను! ఆ సినిమా చూసైనా అది నవ్వడం, మాటాడడం. నడవడం అన్నీ నేను చూసి ఆనందించవచ్చు!" అన్నాడు కిట్టు.

అది విని రాజు అదిరిపోయాడు. "నీకేం మతి పోయిందా?" అని అడిగాడు.

"ఇన్నిరోజులూ నాకు మతి పోయిందనే అనిపిస్తోంది. రాజూ, నువ్వేమో మంచి పని చేసావయ్యా! మీ ఆవిడ కంఠం రికార్డు చేసేసావ్! నాకు మతిపోయిందని నీవంటే నేను నిన్ను తప్పుపెట్టను" అన్నాడు కిట్టు.

తనంతట తానే భార్యని త్యజించిన సంగతి నలుగురికి ఇంకా తెలియదని రాజుకి తెలుసు. "మనసు కుదుట పడాలి, సినిమాకి వెళ్దాం!" అని కిట్టు అన్నప్పుడు అతను గతించిన తన భార్యగురించి దుఃఖిస్తున్నాడని, ఆ ఎడబాటు మరవడానికే తన్ను పిలుస్తున్నాడని ఒకలాగ రాజు ఊహించాడు. తన స్నేహితుడు హృదయపూర్వకంగా అతని భార్యగురించి తపించడం చూసి ఇప్పుడు రాజు తనకే తెలియక ఒక నిట్టూర్పు విడిచాడు.

సినిమారంగం గురించి, తారలగురించి ఈ కిట్టు ఎన్ని గాలి కబుర్లూ, వదంతులు చెప్పేవాడు! 'అతనా ఇప్పుడు భార్య కన్నుమూసినతర్వాత ఇలాగ బాధపడుతున్నాడు?' అని రాజు తనలో అడుక్కున్నాడు.

'శ్యామళ తన కంఠధ్వనిని -కీర్తనగా - రికార్డు చేసింది. అదేం పెద్ద దోషమా? మన్నించ గూడని అపరాధమా?' అని రాజు అంతరాత్మ ఎత్తిపొడిచింది.

నలుగురికి తన అసంతుష్టి తెలిసేముందే అమెని - తన భార్యని - రమ్మని పిలిపించుకోవాలని రాజు ఆలోచించాడు; ఇక ఎటువంటి ఆలస్యం చెయ్యకూడదని నిశ్చయించాడు.

తనకి మంచి బుద్ధి వచ్చినందుకు తనిప్పుడు ఏం చెయ్యాలి? ఆ భగవంతుడికి కృతజ్ఞత చెప్పాలా? లేక సాంబు పేరుకి హాని రాకుండా దంపతులని ఐక్యం చేసినందుకి ఆ దేవుడ్ని కొనియాడాలా?

పాపం, సాంబు ఎన్నో ప్రయత్నాల్లో విజయం పొందినవారే. కాని రాజరామన్ విషయంలో అతను బాధ పడ్డారు. అతన్ని ఎవరూ నిందించలేదు; కాని అతనేం గొప్పగా ఏమీ చెయ్యలేదే?

'ఏమండోయ్, మీరు రాజారామన్ గురించి బాధపడుతున్నారని తెలిసే నేనీ ఆట ఆడాను. అసలు మా ఆవిడ సినిమాలో చేరలేదని నాకెటువంటి కొరతా లేదండి! కాని నా స్నేహితుడు మనసు మారాలని అలా అన్నాను. ఆఖరికి అంతా మంచిదే అయింది!' అని కిట్టు తనలో చెప్పుకున్న మాటలు వింటే సాంబు సంతోషిస్తారా లేక బాధ పడతారా? ఎలాగో దంపతులు మళ్ళీ కలుసుకున్నారు, అందుకు తనే మూలకారణం అని గర్విస్తారా?

సాంబుకి మంచి మనసుంది. దేవుడి దయని గుర్తు చేసుకొని, శ్యామళ, రాజారామన్ దంపతులని దీవించుతూ అతను హాయిగా ఉన్నారు. అదే కదా మంచి మనసుకి కావాలి?

**మూలం ప్రచురణ: వెళ్ళిమణి, 1948**

# కొంచెం సమయంలో

ఇంటి ముందు వసారాలో ఏటవాలైన కుర్చీలో కూర్చొని కుట్టుపనిలో ఉన్నాను. మాది వీధికి ఆనుకునే ఇల్లు; అది వీధినుంచి ఎట్టడగుల ఆవరణలో ఉన్న కారణంవలన కుట్టుతున్నప్పుడు అలవాటుగా నేను వసారాకి వస్తాను. ఇప్పుడు ఊరులో అమ్మవారి సంబరాలు జరుగుతున్నాయి; వరుసవరుసగా జనులు నడిచివెళ్తున్నారు; పలురకాల మనుషులను చూస్తూ నా పని నేను చూసుకుంటున్నాను.

పొరుగింటి కుంతళం తన పిల్లలతో  సంబరాలకి వెళ్ళాలని జట్కా పక్క సిద్ధంగా నిలబడి ఉంది. పిల్లలందరూ ఒకరితరువాత ఒకరు జట్కాలో ఎక్కడానికి పోటీపడుతున్నారు;  కుంతళం ఒక చెయిలో పళ్ళెంలో కొబ్బరికాయ, అరటిపళ్ళతో నిలబడి వాళ్ళని సముదాయించడం చూసాను. నా దృష్టి తనమీద పడిందని తెలియగానే, ఆమె ఒక చిరునవ్వు నవ్వి, "కోవిలకి వెళ్తున్నాం!" అని చెప్పింది. నేనూ సరే అంటూ తలూపాను. అప్పుడే నా మనసులో నా పిల్లలగురించి ఆలోచన లేచింది. ఇంతకుముందే కుంతళం పిల్లలు అమ్మవారి సంబరాల్లో రధాలు, ముచ్చటాలు చూడడానికి మూడునాలుగుసార్లు వెళ్ళడం నాకు తెలుసు. తాతగారితో ఒక సారి, నాన్నమ్మతో ఒక సారి అని ఆ పిల్లలు వెళ్ళిరావడం నేను గుర్తుచేసుకున్నాను. కాని నాకింకా సమయం, అవకాశం దొరకలేదు. రేపో లేక ఎల్లుండో, నా పిల్లలతో, మా ఆయన తోడుతో వెళ్ళిరావాలని నిశ్చయించాను.

కొంచెం సమయం తరువాత తలయెత్తి చూసాను. కుంతళం అత్తగారు గబగబమని మా వీధిలో నడిచివస్తూ కుంతళం ఇంటిలో ప్రవేశించడం చూసాను. కుంతళం ఇంటిలోనే కావేరీ అమ్మాళ్, ఆవిడ భర్త ఉంటున్నారు. కాని అప్పుడప్పుడు కావేరీ అమ్మాళ్ తన తమ్ముడింటికి వెళ్ళి అక్కడ ఉంటారు. అంటే పుట్టిల్లులో తనకి హక్కుందని చెప్పుకోడానికి కాదు; తమ్ముడు భార్యకి సాయం చెయ్యాలని వెళ్తారు. రెండురోజులముందు ఆవిడ అక్కడకి వెళ్ళారు, ఇప్పుడే తొందరగా వస్తున్నారు. ఆ ముత్తైదువని చూడగానే నా ఆలోచన వేరే దిశలో

మళ్ళింది. కొడుకు, తమ్ముడు - ఈ ఇద్దరి ఇళ్ళలోనూ - సమయ సంజీవిగా - ఒకటి మార్చి ఒకటిగా, ఆవిడ చేదోడు ఇస్తున్నారు. రెండు చోట్లా ఆవిడకి గౌరవం, ఆదరణ ఉంది. నడకలో నిదానం, మాటల్లో రమ్యత చూపే ఆవిడకి అరవై ఏళ్ళు దాటిపోయాయి. అవును, అత్తగారు మెచ్చుకున్న కోడలూ, కోడలు ఆరాధించే అత్తగారూ మా పొరుగింటినేలో ఉన్నారు!

ఆవిడ త్రాణ, సౌజన్యం గురించి నేను ఆలోచిస్తున్న కొంచెం సమయంలోనే ఆవిడ మా ఇంటి గేటుదగ్గర కనిపించారు. “ఎక్కడకి వెళ్ళారు, మా కోడలూ, పిల్లలూ? మీ ఇంటికి వచ్చారా?” అని నన్ను చూసి అడిగారు.

“లేదే?” అంటూ నేను లేచి నిలబడ్డాను. కుంతళం కోవిలకి వెళ్ళిందని చెప్పాలని నేను నోరు తెరిచాను, కాని అంతకుముందే ఆవిడ వెళ్ళిపోయారు; ఆవిడ నడకలో నిదానం చూసిన నేను ఇప్పుడు ఏమైందని తెలియక ఆశ్చర్యపడ్డాను.

రెండే నిమిషాలలో ఆ ముసలావిడ మళ్ళీ కనిపించారు. ఇప్పుడు ఉత్తికే దూరంలో నిలబడక గేటు తెరిచి వసారాకి నడిచివచ్చి, నేలమీద కూర్చున్నారు; నేనూ వెళ్ళి ఆవిడ పక్క కూర్చున్నాను.

“ఎందుకిలా చేసింది? నాకేం అర్థం కావటంలేదే?” అంటూ ఏ మూలనో చూసుకుంటూ తనలో తనకే చెప్పుకున్నట్టు ఆవిడ మాటాడారు; నుదుట చెమట పట్టేసింది. ఊపిరి పీల్చడానికి కష్టంగా ఉంది. నోటినించి మాటలేవీ సులభంగా రాలేదు.

“మామీ, కుంతళం కోవిలకి వెళ్ళింది” అని నేను అన్నాను.

“అవును, తెలుసు. మనవడు వచ్చి నన్ను రమ్మని పిలిచాడు. అందుకే తొందరగా వచ్చాను. నేను రాకముందే కోడలు వెళ్ళిపోయిందే, ఎందుకు?” అని మళ్ళీ అన్నారు.

“నాకూ అర్థం కావటంలేదు . . . ” అని లాగాను. ఆవిడకేర్పడిన నిరాశ నాకిప్పుడు బాగా అర్థమైంది.

“ఉత్తికే నన్ను రమ్మని పిలిచి ఎందుకిలా వెళ్ళాలి?” అది ఆవిడ ఒక ప్రశ్న!

నేనేం చెప్తాను? నా మౌనం ఆవిడ ఆలోచనల పోరాటంకి తెడ్డుగా మారింది.

"మనవడు వచ్చాడు - వంటగదివరకూ నన్ను వెదుక్కుంటూ . . . అక్కడ వాళ్ళకి చెప్పకొని రావడానికి కొంత సమయం పట్టింది. అంతలో ఏం తొందర? ఆ అబ్బాయి వచ్చిన తర్వాతే అది వెళ్ళిందా?" అని నన్ను అడిగారు.

"పిల్లందరూ వెళ్ళారనుకుంటాను" అని అన్నాను. అవును, కుంతళం పిల్లలందరితో వెళ్ళడం నేను చూసాను. అత్తగారు వచ్చేవరకు కాచుకొనివుండడానికి కుంతళంకి ఓపిక లేదా?

"అసలు మీ మనవడు మీతో ఏమని చెప్పాడు? మిమ్మల్ని ఉత్తికే రమ్మని పిలిచి వెళ్ళిపోతుందా? కుంతళం అలాగేం చెయ్యదు!" అని ఆవిడని ఓదార్చాను.

"ఏమో, ఎవరికి తెలుసు? నాకిది అవమానంగా ఉందమ్మా . . . కావాలనే . . . "

ఆవిడ నిరాశ నా మాటలకి తగ్గలేదు.

ఎన్నడూ కోడలిని తప్పుపెట్టని ముసలావిడకి మరేం అనడానికి నోరు రాలేదేమో?

కుంతళం పట్ల ఆవిడకున్న మంచి అభిప్రాయం ఏ మాత్రం తగ్గకూడదని నేను కొంచెం గట్టిగానే ఆవిడకి చెప్పాను.

"కుంతళం అలాగ చెయ్యనే చెయ్యదు! నాకు తెలుసు. మీకెదురుగా ఆమె ఒకమాట చెప్పి నేనెరుగను . . . మీగురించి అన్నీ మంచిపే చెప్పింది. మీరూ ఎప్పుడూ దాని గురించి రవంతైనా నొచ్చుకోలేదు. ఇవాళ మీరు పడుతున్న వేదన చూసి నాకూ చాలా బాధగా ఉంది" అన్నాను.

"ఇంతకుముందు ఇలాంటి అవమానం జరిగివుంటే నేనిప్పుడు బాధపడను. 'సరే, ఇది దానికి మామూలేగా?' అని ఊరుకుంటాను. ఇవాళ ఇలాగ అవడం వలనే నా ఆరాటం అంతా. పాడు మనసు, ఊరుకోదు!" అని ఆవిడ మళ్ళీ అన్నారు.

ఈ ముసలావిడ సంబరాలు ఒక సారి చూడడమైంది; కాని ఇప్పుడు మళ్ళీ చూడాలని ఆకాంక్ష. అందుకే ఆవిడ తొందరగా ఇక్కడకి వచ్చారు, కాని నిరాశే మిగిలింది. దానితోబాటు ఆవిడకున్న అత్తగారనే అర్హతకి ఈ ఎదురుచూడని అనుభవంవలన ఒక పెద్ద దెబ్బ.

“ఒక వేళ ఈ రాత్రికి వంట చెయ్యాలని నన్ను పిలిచిందేమో అని అనుకున్నాను. లోపలికి వెళ్ళి చూస్తే ఇంటిలో అన్నీ భోజన పదార్థాలూ చేసి ఉన్నాయి! అదెప్పుడూ వంటగదిలో నా సాయం అడగదే?” అని ఆవిడ మళ్ళీ అన్నారు.

కోడలు కుంతళం అత్తగారికి అవకాశం ఇవ్వక తనే అన్ని పనులు చేస్తోందని కావేరీ అమ్మాళ్ గొప్పగా చెప్పుకొనేవారు. కాని ఇవాళ ఆ పొగడ్త ఒక లోపంగా మారిపోయింది!

ఆవిడ ఇంకా మాటాడుతూనే ఉన్నారు:

“ఇంటికి మామగారు కాపలా ఉన్నారు; వంట ఐపోయింది. ఇక నేనెందుకు రావాలి? ఇదెందుకిలా చేసిందని నాకు అర్థం కావటం లేదు! ఇప్పుడు నేనేం చెయ్యను? ఇక్కడ ఉండాలా, లేక తమ్ముడింటికి తిరిగి వెళ్ళాలా?”

ఆవిడ అవస్థ చూసి నేను నిజంగానే బాధపడ్డాను; ఏమనాలో తెలియక ఊరుకున్నాను.

మంచి వేళ! ఇప్పుడు కావేరీ అమ్మాళ్ భర్త, చేతి కర్రతో, అంగవస్త్రాదులు ధరించి దూరంలో కనిపించారు. అతనన్న మాటలు అతని ధోరణిని మించేసింది.

“ఏమే, నువ్వెందుకి ఇక్కడకి వచ్చేసావ్? అక్కడ ఇల్లు కాపలా కాయడానికి ఎవరూ లేరే? మరి ఇక్కడ కూర్చోని ఏం చేస్తున్నావ్?”

భర్తని చూడగానే ముసలావిడ లేచి, మా ఇంటి వసారానుంచి దిగి గేటుదగ్గరకి వెళ్ళిపోయారు. “సంబరాలకి రమ్మని మనవడు పిలిచాడని తొందరగా వచ్చాను. తాతగారు నేను ఇంటికి కాపలా అంటున్నారు . . . బాగుందిలెండి . . . నేనిది తమ్ముడి భార్యకి ఎలా చెప్పడం?” అని నొచ్చుకున్నారు..

తాతగారు కనుబొమ్మలు పైకెత్తి మాటాడారు:

“అసలు నిన్నెవరు సంబరాలకి రమ్మని పిలిచారు? కోడలూ, పిల్లలూ, కోవిలకి వెళ్ళడం అకస్మాత్తుగా నిశ్చయమైంది. నేనూ బయటకి వెళ్ళాలి, నాకు కొంచెం పనివుంది. అందుకే నిన్ను కావలికి పిలుద్దామని మనవడిని తరిమాను.”

“మీరేనా నన్ను రమ్మని పిలిచారు?” అని ఆవిడ ప్రశ్న. ఆవిడ కంఠధ్వనిలో ఎంత వినయం, నమ్రత! గేటు తెరిచి, భర్తవెనుక ఆవిడ నడిచారు.

తాతగారు వీధిలో నడుస్తూ వెళ్ళారు. కావేరీ అమ్మాళ్ పొరుగింటికి వెళ్ళి, తలుపు తాళం వేసి, తాళంచెవితో మళ్ళీ మా ఇంటికి వచ్చి నా పక్కనే తృప్తితో కూర్చున్నారు.

"కుంతళం బయలుదేరడానికి ముందే ఇతను బయటకి వెళ్ళారట. 'మీ అత్తగారిని రమ్మని పిలిచాను; దాన్ని కావలికి ఉంచి నువ్వు వెళ్ళు!' అని చెప్పారట. విను, కుంతళం ఏమందో తెలుసా? 'ఇంటికి కాపలా కాయండి!' అని అత్తగారికి చెప్పడానికి నాకు సిగ్గేస్తుంది. నేను ముందే వెళ్తాను!' అని అందట. ఇవన్నీ నాకు వివరంగా చెప్పడానికి మనవడికి చేతకాదు . . . అసలు ఏంజరిగిందో నాకు తెలియదే! . . . కాని నాకు కుంతళం ఇలాగ ఎప్పుడూ చెయ్యదు అని బాగా తెలుసు . . ."

కావేరీ నది పవిత్రతతో కావేరీ మామీ హృదయ నిర్మలత్వం సరిపోల్చితే అది సరేనా?

కొంచెం సమయంలో ఒక చిన్న కలత; దాన్ని లెక్కచెయ్యవచ్చా?

ఆ స్వల్ప సమయంలో వాళ్ళగురించి ఆవిడ నొచ్చుకున్నారు; కాని కోడలు పేరుని ఎంత ముద్దుగా పలికారు! 'అపార్థం చేసుకున్నాను' అని తెలిసిన తరువాత ఆవిడలో ఎంత వినయం కనిపిస్తోంది! అవును, నిర్మలత్వంకి ఈ ముత్తైదువ ఒక నిదర్శనం!

********

**మూలం ప్రచురణ: వెళ్ళిమణి, 1951**

# తామర తటాకం

రెండు పక్కలా వరుస వరుసగా పెద్ద భవనాలు; ఒక్కొక్కటీ ప్రత్యేకంగా కట్టినట్టుంది. భవనంకి ముందు కారులకోసం ఒక పెద్ద పోర్టికో. కొన్ని భవనాలముందు ధ్వజస్తంభాలు కనిపించాయి. గవర్ణమెంటు అధికారంలో ప్రధమ శ్రేణిలో ఉన్న ఉద్యోగస్తులు, మంత్రులు నివసించే ఇళ్ళు అది తెలియజేయడానికి ఆ ధ్వజస్తంభాలు నిదర్శనం. 'యజమాని ఊరులోనే ఉన్నారు!' అని రుజువు చేస్తున్నట్టు కొన్ని స్తంభాలమీద జాతీయ పతాకం ఎగురుతోంది.

కొన్ని బంగళాల గోడలని ఆనుకుంటూ మామిడి, వెలగ, మరి కొన్ని చెట్లు దండిగా పెరిగివున్నాయి. వేసవికాల తీక్షణతకి తగినట్టుగా మామిడిచెట్లలలో పళ్ళూ, పచ్చి కాయలూ కనిపించాయి. కొన్ని బంగళాలముందు జెండా లేదు; అక్కడున్న చెట్లలో ఒక పచ్చ ఆకూ కనిపించలేదు. వాటిలో 'ఆహార ఉత్పత్తిని పెంచండి!' అని ఇతరులకి బుద్ధి చెప్పే రాజకీయవాదులు ఉంటున్నారేమో? అవును మరి; విద్యుద్దీపాల కింద ఎప్పుడూ చీకటిగానే ఉంటుందికదా?

ఇలా ఏమేమో చింతిస్తూ నేను నా సైకిలుతో ఆ రహదారిలో సవారి చేస్తున్నాను. నేను రోజూ కాలేజికి వెళ్ళే మార్గం వేరు. అక్కడ ఇవాళ రోడు మరమ్మతు చెయ్యడంవలనే ఈ రహదారికి రావడమైంది. సమయం పొద్దున తొమ్మిది గంటలే; ఎండ తీవ్రంగానే ఉంది. ముందెప్పుడూ చూడని జాగా అని గుర్తుచేసుకుని కొంచెం నిదానంగానే సవారి చేసాను.

ఆహా! ఇదెవరి బంగళా? అబ్బా, ఇంటి ముందున్న పూలతోట ఎంత పెద్దది, చూడడానికి ఎంత సొగసుగావుంది! బంగళాకి దగ్గరపడుతూంటేనే దీని అందం, సరళత మనకి అర్థమౌతాయి. బంగళా ఇంటి పైకప్పుగా ఎండు గడ్డే వేసివుంది. ఈ ఊరులో అటువంటి పైకప్పులున్న భవనాలు మామూలే. నేను ఆశ్చర్యపడినది అందుకుకాదు. ఆ బంగళా ముందున్న పూలతోట ఎంత విశాలంగా వ్యాపించివుంది! అందులో అన్నిరకాల పువ్వులు – పరిమళించేవి, వాసన లేనివి, చిత్రవిచిత్రమైన రంగులలో కనిపించేవి – అన్నీ అన్నాయి. నేనిక్క ఇక్కడ చూసి

ఆనందించేది  ఒక పర్ణశాల సరళత, ఈ పూలతోట అందం అని గుర్తు చేసుకున్నాను. మరి, దీని యజమాని ఎవరు అని తెలుసుకోవాలని, బంగళా గేటు ముందు అతని పేరురాసిన పలకని చూద్దామని వెళ్ళాను. కాని అక్కడ నాకు కనిపించినది ఒక ముసలాయన; అతనొక ముక్కాలిపీట మీద కూర్చున్నాడు; పక్కనే ఇసుక దిబ్బమీద ఒక కుండ, గిన్నెలు కనిపించాయి.

నాకు వెంటనే తమిళ దేశంలోని పాత సంప్రదాయం జ్ఞాపకం వచ్చింది; అనావృష్టితో పరితపించే తమిళదేశం కాదు. రహదారిబాటలో, వేసవికాలంలో, దప్పిగొన్న ప్రయాణికులకి నీరు మాత్రంకాదు, మజ్జిగకూడా ఇచ్చే నిలువనీడలగురించి నేను చదివివున్నాను.  నాకూ దాహమేసింది, తాగుదామా అని ఆలోచించాను. కాని ఈ ప్రాంతాల్లో ఎవరూ గిన్నెని పైకెత్తి తాగరు, అందుకే నాకీ గిన్నెలు వాడడం ఇష్టంలేదు.

గేటుకి రెండుపక్కలా మళ్ళీ చూసాను. పేరు రాసిన పలక కనిపించలేదు. ఇది ఊరంతా పేరు పొందిన ఒక మహనీయుని ఇల్లు అనడంలో సందేహం లేదు, మరెందుకు పేరూ, పలకా? ఈ యజమాని  మంచి అభిరుచి, హృదయం కల శ్రేష్టుడని బోధపడింది.

అతను ఎవరో?

** ** **

నాకు తెలిసిన కొందరు మిత్రులని అడిగాను. ఒకతను మాత్రం కొంచెం సమయం ఆలోచించి, “మీరు ‘పూల తోట, రకరకాల పువ్వులంటున్నారు; అంటే ఆ బంగళాలో ఉండేది తప్పకుండా ఒక తెల్ల దొర అని నా ఉద్దేశం! వాళ్ళకే ఆ అస్వాదన శక్తి, ఇల్లు రమణీయంగా కనిపించాలనే ఆపేక్ష ఉంటుంది!” అని అన్నారు.

అతని మాటలు విని నాకు నిరాశ కలిగింది. ఏం, మనకి – స్వదేశీయులకి - కళాభిరుచి లేదని అతనంటున్నారా?

“దాహంకి నీళ్ళు ఇచ్చేది తెల్లదొర అని నాకనిపించలేదు, సార్!” అని చెప్పి నేను నోరు మూసిన వెంటనే  నా తమిళ మిత్రుడు ఒకతను “అందులోనేవుంది సార్  తెల్లదొరల గొప్పతనం! వలస ఎక్కిన ప్రాంతంలో వాళ్ళు సర్దుకొని పోతారు.

తమ జీవిత శైలి వదలిపెట్టరు; కాని ఇతరుల సంప్రదాయాల్లో మంచి అంశాలు వరించుకుంటారు!” అని అన్నారు.

అతను ఇంకా ఏమేమో చెప్పారు. కాని నాకు ఏది కావాలో అది అతను చెప్పలేకపోయారు.

ఆ తరువాత నేను ఎన్నోసార్లు ఆ కంటోంట్మెంటు మార్గంలో కాలేజీనుంచి తిరిగిరావడం జరిగింది. ఆ ఇంటి యజమానుడి ఆజ్ఞ నిరవేర్చడానికి సిద్ధంగావున్న ఆ ముసలివాడిని చూడడమైంది. “ఎవరయ్యా నీ యజమాని?” అని నేను వాడిని అడిగియుండవచ్చు, కాని అడగలేదు. ఎప్పుడూ అతనిచుట్టూ జనులు గుమికూడుకొనివున్నారనే కారణం. అసలు అలాగ కాకపోయినా అడగడానికి నాకు మోమాటం కూడా.

ఎందరో ప్రముఖులు నివాసం చేస్తున్న ఈ విశాలమైన రాజమార్గంలో, ఆ భవనంలో కన్నులకింపుగా ఆ దృశ్యం – ఆ పూలతోట – అందరి మనసులో నాటుకుపోయింది. ‘ఆ కీర్తి, పుణ్యం, ఆ యజమానికే చేరనీ, అతనికే దానికి అర్హత ఉంది!’ అని తక్కిన బంగళావాసులందరూ గ్రహించారనుకుంటాను.

కాని ‘ఆ యజమాని ఎవరు?’ అనే నా ఆతురత ఏమాత్రం తగ్గలేదు. ఒక గుజరాతీ స్నేహితుడ్ని అడిగాను. అతను మరేం ఆలోచించక “అది హోస్టల్ సూపరిండెంటు కోసం కట్టిన బంగళా; ప్రస్తుతం ఒక పంజాబీ హోస్టల్ సూపరిండెంటుగా ఉంటున్నారు” అని చెప్పారు.

‘దాహంకి నీళ్ళివ్వడం మన దేశం పారంపర్యంలో వచ్చిన ఆచారం. పంజాబీలు తమిళులకి వేరేగా కనిపించినా హిందు ధర్మాన్ని దృఢంగా పాటిస్తున్నారు’ అని నేను నాలో చెప్పుకొని సంతోషించాను.

కాలేజీ సెలవులు ప్రారంభమయ్యాయి; నేనూ కంటోంట్మెంటు గురించి మరిచిపోయాను. సెలవులు మరొక ఊరులో, తమిళదేశంలో గడిపి, ఊరుకి తిరిగివచ్చాను.

సెలవులు పూర్తి అయినా వెసవికాల తీవ్రత తగ్గలేదు. కంటోంట్మెంటు తోవలో మళ్ళీ నడిచాను. నీళ్ళ కలశం, ముసలాడు, పూలతోట అన్నీ అలాగే ఉన్నాయి.

కాని ఆ బంగళా విశాలమైన వసారాలో ఒకతను దోతీతో ఒక బెంగాలీ లాగ పంచెతో సంచరించడం చూసాను.

'ఇతను పంజాబీ సూపరిండెంటు అతిథి కాబోలు!' అనే ఆలోచన తట్టింది.

ఆ తరువాత ఒక బెంగాలీ స్నేహితుడ్నే ఆ ప్రశ్న అడిగాను. 'ఎంతమందిని అడిగి తెలుసుకోవాలో?' అని ముందు జంకాను, కాని అడిగేసాను!

అతను చెప్పారు: "అసలు పోస్టల్ ఆఫీసరు పంజాబీ కాదే, అతను బెంగాలీ కాదు! ఎవరో దక్షిణదేశపు మనిషి; పేరు మూర్తి అని అన్నారు!"

అవును! దక్షిణదేశపు మనిషి, అతను తమిళుడే ఐవుండాలి! మరెవరు నీళ్ళు దానం చెయ్యడానికి పూనుకుంటారు? అసలు మొట్టమొదట ఆ దృశ్యం కనిపించినప్పుడు నాకు తమిళ దేశం, వేసవిలో ప్రయాణికులకి అండనిచ్చే పందిరి - అవే జ్ఞాపకంలో వచ్చాయికదూ?

స్వయంగా వెళ్ళి ఆ మూర్తితో పరిచయం చేసుకోవాలని, అందుకు నాకు అర్హత ఉందని తోచింది, కాని అందుకు నాకు ధైర్యం రాలేదు. ఏమేమో విపరీత ఆలోచనలు లేచాయి: కొందరు గొప్పలుచెప్పుకుంటూ దానం చెయ్యవచ్చు, కాని వాళ్ళ మనసులో ఏముందో ఎవరికి తెలుసు? దానం చేస్తున్నానని గర్వంతోబాటు, ఒక అపురూప పూలతోట సృష్టించిన అహంకారంకూడా చోటుచేసుకొని ఉంటే? ఇందులో ఇంకో విశేషం ఉంది; అసలు నీళ్ళు దానం ఇవ్వాలన్నది స్త్రీల ఏర్పాటేమో? ఇంటి యజమానికి - భర్తకి - అది ఇష్టమేనా? 'గేటుదగ్గర ఇదొక పెద్ద చికాకు!' అని అతనికి ఏవగింపేమో, ఎవరికెరుక? ఎలాగుంది నా కల్పన!

మనిషికి మనసులో ఎన్నిరకాల ఆలోచనలు! 'ఇది చెయ్యాలి!', 'అది తప్పకుండా చెయ్యాలి!' అని నిత్యమూ ఘర్షణ. కాని ఆ సమయం వచ్చేసరికి పిరికితనం, వచ్చిన తోవనే మళ్ళుకోవడం . . . ఇవే మామూలు . . .

మూర్తి తమిళుడే, సౌజన్యం కల మనిషి అని తెలిసిన తరువాత కలుసుకుంటే మంచిది!

జూలై మాసం తరువాతకూడా ఆ నీళ్ళ దాన ధర్మం ఎడతెగకుండా సాగింది; నా ఆతురతకూడా పెరిగింది. ఒక మళయాళి స్నేహితుడ్ని అడిగాను.

“ఆ మూర్తి ఒక ఆంధ్రా Gentleman. అతను బదిలీ అయి మూడు మాసాలైపోయాయి. ఇప్పుడుండేది మిస్రో కదా? నిన్నకూడా అతన్ని చూసానే?” అని అన్నారు అతను.

నేను విస్తుపోయాను. అతను చెప్పినది నమ్మాను. కారణం కళాత్మక విషయాలలో ఒరిస్సా, బెంగాలీ, రాష్ట్ర ప్రజలకి మంచి పొత్తు ఉంది. నేను ఆ రోజు దోతిలో చూసిన బెంగాలీ ఒరిస్సా రాష్ట్రంకి చెందినవారేమో? ఈ మిస్రో ఒరిస్సాలో పుట్టిపెరిగిన మనిషి, పట్టభద్రుడు.

“అదేంటో సార్, నేను ఎంతమందిని అడిగానో, మీకు తెలుసా? ఎవరికీ నిజం తెలియదనుకుంటాను. ‘తెల్ల దొర’ అని అన్నారు; ‘కాదు, పంజాబీవాడు’ అన్నారు. అన్నీ తప్పులే!” అని నొచ్చుకున్నాను.

అతను నవ్వారు.

“అవును. ముందు ఒక తెల్లదొర ఉండేవాడు. ఆ తరువాత ఒక పంజాబీ అదే ఉద్యోగం చేసాడు. ప్రతీ సంవత్సరం ఈ బంగళాలో ఆఫీసర్లు బదిలీ చెయ్యడం మామూలే కదా? మూర్తిని తొమ్మిదిమాసాలలోనే మార్చేసారు!”

అదే నాకూ ఒక పెద్ద ప్రశ్నగా తగులుకుంది.

మనసు కుదుటపడాలంటే ఎవరు సాయం చెయ్యగలరు? ఆ రోజు తెల్లదొరని పొగడిన తమిళ స్నేహితుడ్ని నేను మళ్ళీ కలుసుకున్నాను.

ఆ తెల్లదొర మూడు సంవత్సరాల ముందు ఉద్యోగం చేసాడట. అతనే ఈ పూలతోటకి మూలకారణం అని చెప్పుకున్నా, ఈ మూడు సంవత్సరాల్లో ఎంతమంది దాని వృద్ధికి కృషి చేసారు! ఆ మూడు రాష్ట్రాల వారి కళాత్మక అభిరుచిని మరిచిపోవడం ఎలాగ?

దానధర్మం మొరలుబెట్టినది ఆంధ్రులు మూర్తిగారేమో? నా తమిళ స్నేహితుడికి ఆంధ్రులంటే వ్యతిరేక బుద్ధి అని నాకు తెలుసు. అతన్ని ఎదుర్కోవాలని ఆలోచించాను.

అతన్ని కలుసుకున్నాను, అన్నీ వివరించాను. అతను కాదని ఏమీ అనలేదు. కాని ఆఖరికి . . .

"మిస్టర్ మాలి, నాతో రండి. కంటోంట్మెంటు వరకూ వెళ్ళివద్దాం!" అని అంటూ నన్ను పిలిచారు.

ఆ పూలతోట ఉన్న బంగళా గేటుముందు మేమిద్దరం నిలబడ్డాం. అది సాయంకాల సమయం; ఆ కలశం తప్పిస్తే, గిన్నెలూ, ముసలాడు, ఎవరూ కనిపించలేదు.

కొంచెం సేపు మేం అలాగే కనిపెట్టుకొనివున్నాం. చెట్లమధ్య ఏదో వెదుకుతున్న ముసలాడిని నా స్నేహితుడు గుర్తుపట్టారు.

"ఏయ్ మాలి! ఇదర్ ఆవ్!" అని ఇతను వాడిని పిలిచారు. చెయిలో పారతో ఆ తోటమాలి మాముందు వచ్చి నిలబడ్డాడు.

"ఈ ఇంటి యజమాని మిస్రో కదూ? అతనిప్పుడు ఇంట్లో ఉన్నారా?" అని వాడిని ఇతను హిందీలో అడిగారు. ముసలాడు "సినిమాకి వెళ్ళారు" అని చెప్పినది నాకు బోధపడింది. నాకు హిందీలో మాటాడడం చేతకాదు; కాని ఇతరులు మాటాడితే అర్థం చేసుకోగలను.

"ఎన్ని సంవత్సరాలు తోటమాలిగా పనిచేస్తున్నావ్?"

"నాలుగు సంవత్సరాలుగా . . ."

"ఈ తోట ఎన్ని సంవత్సరాలుగా ఉంది?"

"నాలుగు సంవత్సరాలుగా . . . ఇంగ్లీషు బాబు ఉన్నప్పుడు నేనీ తోటలో పని ఆరంభించాను."

"దీన్ని వదిలివెళ్ళడానికి నీకు ఇష్టం లేదా? నువ్వు ఇక్కడే ఉంటున్నావా?"

"ఇచ్చిన జీతం చాలని మొండిగా ఇక్కడే ఉంటున్నాను. ఈ తోట పాడైపోతుందని నాకు భయంగా ఉంది . . . "

ముసలాడు అలా అన్నప్పుడు ఇతను నా పక్క తిరిగిచూసారు.

'భారతీయుల కళాత్మక అభిరుచులు కాదు, ఈ ముసలాడి అనురాగం వలనే ఈ పూలతోట క్షీణింపకుండా వర్ధిల్లుతోంది!' అనే రహస్యం అతను నాకు చెప్తున్నారా?

ఇక్కడ జరుగుతున్న దానధర్మంలోని మర్మం ఏమిటో తెలియాలని నా ఆకాంక్ష; ఏ పుణ్యాత్ముడి ఆజ్ఞని ఈ ముసలాడు ఇంత శ్రద్ధతో పాటిస్తున్నాడని అడిగాను.

ఇతను "మొక్కలకి నీళ్ళు పోసి పోసి అలవాటు పడిన నీ చేతులు రహబాటలోని ప్రయాణికులకి నీళ్ళు ఇస్తున్నాయని ఈ బాబూ చెప్తున్నారు!" అని సొగసుగా నా ఉద్దేశం వాడికి తెలియజేసారు; ముసలాడు ఆతురతతో నన్ను చూసాడు.

"నాకేమో తోచింది, బాబూ, అందుకే చేస్తున్నాను. 'ఉత్తికే కూర్చోడం ఎందుకు?' అని ఉన్న జాగాలోనే ఈ పని చేస్తున్నాను? నేను మరేం చెయ్యగలను చెప్పండి?"

"అయ్యా, నువ్వు చేసే ఈ చిన్న సేవ ఈ ధనవంతులెవరూ రవంతకూడా చెయ్యలేదు. అవును, ఈ మండుటెండలో కూర్చొని ఇతరుల వేసవి తాపం తీర్చడానికి ఎంత ఘన కార్యం చేస్తున్నావో తెలుసా?" అని ముసలాడికి చెప్పలేక నేను బాధపడ్డాను; మనసులో అతన్ని అభినందించి తిరిగివచ్చాను.

"ఈ పూలతోటలో తామరాకు లేదు; అసలు అక్కడ ఏ తటాకమూ లేదే?' అని నేను ఎవరితోనో నొచ్చుకున్నట్టు నాకు గుర్తుంది. అది పెద్ద పొరబాటు.

ఆ నీళ్ళ కలశమే ఆ తటాకం; అందులో ప్రేమానురాగం వికసించింది; అణకువ చోటుచేసుకుంది.

********

**మూలం ప్రచురణ: సుదేశమిత్రన్,1952**

# జాలి గుండె

“ఐయయ్యో, బావగారు జైలుకి వెళ్తున్నారట! పాపం, అక్కయ్య . . . ” అని కేకలు పెడుతూ వచ్చాడు చిన్నా.

తపాలువాడు వచ్చివెళ్ళాడని ఊహించి వాకిలికి వస్తున్న అతని అక్కయ్య కల్యాణి ఆ మాటలు విని అదిరిపడింది; ఒక క్షణం ఆగింది.

“ఏయ్ చిన్నా, ఆ ఉత్తరం ఇలా ఇయ్ . . . నాన్నగారికి కదా వచ్చింది?” అని ఒక్క ఉదుటన దాన్ని కల్యాణి లాక్కుంది.

“లేకపోతే నీకు రాస్తారా ఏమిటి? ఎంత అవమానం!” అన్నాడు చిన్నా.

కల్యాణి ఉత్తరం చదివింది; నాలుగు వాఖ్యాలలో దుఃఖకరమైన సందేశం తెలుసుకుంది.

“నేను జైలుకు వెళ్తున్నాను అని విని మీరు బాధపడతారని నాకు తెలుసు. కాని నేను వెళ్ళి తీరాలి . . . రెండే రెండు సంవత్సరాలు మాత్రమే . . . అది నా ధర్మం!” అని ఆమె భర్త రంగన్ అందులో రాసాడు.

అందమైన ఆమె ముఖంలో పచ్చని నరాలు ఉబ్బుకొని వచ్చాయి. తెల్లబోయిన ముఖంతో “అమ్మా!” అని హీన స్వరంతో కల్యాణి తల్లి ఆశ్రయం కోరింది. దానికి మించి ఇక చిన్నా సహించలేకపోయాడు. “నేనే చెప్తాను, అమ్మకి! అని అంటూ ముందుగా పరుగెత్తాడు; “అమ్మా, బావగారికి జైలు డాక్టర్ ఉద్యోగం!” అని అరిచాడు.

“ఓ, అలాగా?” అది విని కల్యాణి మనసు మెత్తబడింది.

“అవును. నిన్ను పెళ్ళి చేసుకున్న నేరంకి అతను పడే కష్టాలు చాలవా? అతను జైలుకి కూడా వెళ్ళాలా ఏమిటి?” అని చిన్నా ఎగతాళి చేసి, ఒక చిన్న చీటీ అక్కయ్యకి అందించాడు.

“జైలు డాక్టరుగా నేను రెండు సంవత్సరాలు పని చెయ్యాలి . . . నీ అక్కయ్యని కొంచెం బెదిరించు . . . కొంచెం తమాషా చెయ్ . . . ” అని అందులో రంగన్ రాసాడు.

అది చదివి ఇంటిలో అందరూ నవ్వుకున్నారు.

"చూసారా ఈ బావా, బావమరిదికి ఎంత పొత్తుందో? బావగారు గురువు! బావమరిది అతని ప్రియమైన శిష్యుడు!" అని కల్యాణి తేలికగానే తమ్ముడ్ని మందలించింది. ఇద్దరి అసాధారణ చుట్టరికం గురించి ఆమె కొంచెం గర్వపడింది కూడా.

"ఇదేం ఉద్యోగం! ఘోరం! దొంగలకీ, నేరస్తులకీ చికిత్స చెయ్యాలన్నమాట?" అని కల్యాణి తండ్రి ముందు అన్నారు కాని తరువాత అతనుకూడా "ఇది మానవత్వంకి చేసే గొప్ప సేవ అనాలి! అల్లుడుగారికి మంచి అవకాసం దొరికింది" అని సంతోషించారు.

జైలు పరిసరాల్లోనే బసకి అధికారులు ఏర్పాట్లు చేసారు. త్వరలో కల్యాణిని రమ్మని రంగన్ పిలిచాడు. ఇక, ఆలస్యం ఎందుకు? కల్యాణి, పసిపాప ప్రయాణంకి దారితోడుగా చిన్నా సిద్ధమైయ్యాడు.

"జాగ్రత్త, నీ చుట్టూ దొంగలున్నారు అని మరిచిపోకు!" అని తల్లి కూతురికి హెచ్చరించింది.

"నీకేం భయం వద్దమ్మా, పోలీసు, బందోబస్తు ఉండే జాగా అది!" అని తండ్రి ధైర్యం చెప్పారు.

"దేవుడా, నేను మేనమామ కంసుడు కాకుండా చిన్నాగానే ఉండనీ! అక్కయ్యా, బావగారూ జైలులో ఉంటున్నారు. ఇంకా రెండు సంవత్సరాల తరువాత పాప జైలు బయట పుట్టనీ!" అని చిన్నా పరిహాసం చేసాడు.

"అదేం మాట? అది కానుపుకి మనింటికే వస్తుంది" అంది తల్లి.

"అవును, అవును, వస్తాను. చిన్నా, నువ్వు నోరు ముయ్!" అని కల్యాణి ఒక జడ్డి నవ్వు నవ్వింది.

** ** **

నాలుగు రోజుల్లో చిన్నా తిరిగివచ్చాడు; పాప నగలన్నీ తీసుకొని వచ్చేసాడు.

"ఇదేంటిరా?" అని తల్లి అడిగింది.

"అవును మరి. అక్కడ కల్యాణి ఇంటికి నౌకరీకి వచ్చేవాళ్ళందరూ మంచి దొంగలు!" ఆని చిన్నా సావధానంగా చెప్పాడు.

"అంటే?"

"వాళ్ళందరూ జైలులోనే ఉంటున్నారు . . .  ఖైదీలు . . . వాళ్ళే నౌకరీకి వస్తున్నారు . . . "

"మగవాళ్ళా?"

"ఆడా, మగా ఇద్దరూనూ . . . తోటలో పని చెయ్యడానికి, నీళ్ళు నింపడానికి, అంట్లు తోమడానికి . . . ఇలాగ రోజూ ఎవరెవరో కొత్త కొత్తగా వస్తూనే ఉంటారు . . . "

"ఇల్లు తుడిచేది ఎవరు? ఆడదేనా?"

"దాన్ని ఇంటిలోకి రానివ్వడానికే కల్యాణి భయపడుతోంది. మొన్న పిండి దంచడానికి ఒక అమ్మాయి వచ్చింది . . . ఇదిగో చూడు . . . ఈ చక్కిలాలు ఆ పిండితో చేసినవే!" అని అంటూ చిన్నా భక్షణ పాత్ర తెరిచి చూపాడు.

"వద్దు! నేనది ముట్టుకోను!" అని వెంటనే తల్లి చెయి దులుపుకుంది; ఇలుకు పట్టుకున్నట్టు ఒక భావన. కాని దానితోబాటు "పాపం, అమ్మాయి ఎంత ప్రేమతో ఇది చేసి నాకు పంపించింది! అక్కడకి వెళ్లగానే 'ఇది చేసి తీరాలి, నాకు పంపించాలి' అని నియమం ఉందా ఏమిటి? నేను దానికిచ్చిన జంతికలు ఇంకా నాలుగైదు రోజులు వరకూ సరిపోతాయే? దాని మనసులో ఏముందో నాకు తెలుసు. ఇక్కడ లేకపోయినా తనకి ఇంటి పనులన్నీ తెలుసు అని నాకు తెలియజేయడానికే ఇలా చేసింది! మరెందుకు?" అని గర్వపడుతూ ఆ తల్లి భర్తకి భక్షణ పాత్ర అందించి తనూ రెండు చెక్కలు నోటిలో వేసుకుంది.

"కొంచెం గట్టిగా ఉంది" అన్నారు అతను రుచి చూస్తూ.

"అవునవును. మీకు మరేం అనడం చేతకాదు! ఒక పక్క పాపని చూసుకుంటూ, దొంగలని నౌకరిగా పెట్టుకొని, కల్యాణి అక్కడ పడుతున్న బాధ మీకు తెలుసా? అటువంటి పరిస్థితిలో నేనుంటే ఏ పనీ చెయ్యలేను . . . "

"మొదటిరోజు కల్యాణికి అలాగే అనిపించింది, కాని ఏడవలేదు. బావగారు అరిచారు; ఆ తరువాత ఊరుకుంది" అన్నాడు చిన్నా.

"బావగారు ఏమన్నారు?"

"'నువ్వు చిన్నాతో మీ ఊరుకి తిరిగి వెళ్ళు; రెండు సంవత్సరాల తరువాత రా!' అని అన్నారు."

“అమ్మా, అసలు భయంకేం చోటు లేదు. నౌకరీకి వచ్చే ఖైదీని కాపలా కాయడానికి బయట పోలీసు ఉన్నాడు. కాని మన మనసు అంత త్వరగా అలవాటు పడదే? అదే కారణం. కొన్ని రోజుల్లో అంతా సర్దైపోతుంది.”

“అదేమో నాకు తెలీదు!” అని అంటూ తల్లి ఒక నిట్టూర్పు వదిలింది.

“చిన్నా, నువ్వు చూసావుగా, నీకు ఆ జాగా నచ్చిందా? జైలు బాగా తిరిగి చూసావా? హాస్పిటలు ఎలా ఉంది?” అని తన వంతుకి తండ్రికూడా  అడిగారు.

“అన్నీ చూసాను, నాన్నగారూ, కాని జైలు కదా, నాకెలాగో అనిపించింది . . .”

“నీకేదీ భయంగా కనిపించలేదా?” అని తల్లి అడిగింది.

“ఎందుకు భయం, అమ్మా? బాధ్యత లేకుండా వాళ్ళు ఏర్పాటు చేస్తారా? ఖైదీలని ఉత్తికే విడుదల చేస్తారా? ఎవరికీ జీతమని మనం ఒక దమ్మిడికాడా ఇవ్వనక్కరలేదు. మనకి ఏ పని కావాలన్నా దానికి తగినట్టుగా ఒక  ఖైదీని ఏర్పాటు చేసి మనింటికి పంపిస్తారు. మనకి మరేం కావాలి?”

“అవును. నీవన్నది నిజం. నీకు గుర్తుందా? కడపటి మాసం ఇక్కడ, పొరుగు వీధిలో దొంగతనం జరిగింది. రెండువేల రూపాయల సరకు పోయింది! దొంగ యోగ్యుడులాగ వచ్చి ఆ పని చేసాడట! ఎవరేం చెయ్యగలరు? అంతా కర్మ!” అని తండ్రి అన్నారు.

ఈ సంభాషణ విన్నతరువాత తల్లి మనసు కొంచెం కుదుటబడింది; కాని అక్కడ కల్యాణి ప్రయాస పడుతూనే ఉంది.

దొంగలు, నేరస్తులు అని ఆలోచించక ఖైదీలు అనే భావనతో వాళ్ళ నౌకరీని కల్యాణి సర్వసాధారణంగా పుచ్చుకోవాలని అన్ని విధాలా ప్రయత్నించింది. కాని అది అంత సులభమైన పని కాదని గుర్తించింది; మనసు తికమకలాడింది. తెల్లవారగానే ‘అయ్యో, ఇవాళ నౌకరీకి వస్తున్నారే!’ అనే కలత.  ‘సరే, చేసినంతవరకూ చాలు. మిగతావన్నీ నేనే చూసుకుంటాను’ అని పూర్తిగా సేవ అంగీకరించని మనసు; ‘ఇది చాలు, మరేం వద్దు!’ అని పని మధ్యలోనే ఖైదీని పంపించేయాలనే ఆతురత, భయం. ‘వాళ్ళకి మనం జీతం ఇవ్వనక్కరలేదు, కాని వాళ్ళు మనం ఎదడిగినా చేసి పెట్టాలి!’ - ఈ వాటం అసలు కల్యాణికి నచ్చనే లేదు; అలాంటప్పుడు తనేదో తప్పు చేసినట్టు ఆమె బాధపడింది. ‘మామూలుగా మన

చెయితో జీతమిచ్చి సేవ పుచ్చుకుంటే ఎంత బాగున్ను! మన హక్కూ అమలుపరచడమైంది. మనకీ మనశ్శాంతి లభిస్తుంది!' అనే ఆలోచన. ఈ వేదన తీరడం ఎలాగ?

ఖైదీల నౌకరీ, సాయం పుచ్చుకొని వాళ్ళతో అన్యోన్యంగా మెలగకుండా విడివడిగా ఉండాలనే కల్యాణి పూనుకుంది. కాని అది పుట్టుకతో ఆమెకు వచ్చిన గుణంకి విరుద్ధం. గత సంవత్సరం మొట్టమొదట కల్యాణి వేలూరులో కాపురం చేసినప్పుడు అక్కడ ఒక కన్య ఉండేది. కల్యాణి ఆమెకి చూపిన మర్యాద చూసి అందరూ ఆశ్చర్యపడ్డారు, సంతోషించారు. "దాన్ని పనిమనిషిగా చిన్నచూపు చూడలేదు కదా, తన చెల్లెలులాగ నవ్వుతూ, ప్రేమతో చూసుకుంటోంది!" అని కల్యాణిని పొగడారు. మరి ఇప్పుడో? 'దానికి ఇది దృష్టిపరిహారం కాబోలు!' అని కల్యాణి తనలో చెప్పుకుంది.

తికమకలాడుతున్న కల్యాణికి ఒక మార్గం కనిపించింది; అదే ప్రేమ మార్గం. ఒకరోజు అన్నం, పులుసు ఎక్కువగా మిగిలాయి. మామూలుగా అంట్లు తోమడానికి వచ్చే ఖైది ఒక మగవాడు, మంచి బలశాలి. వాడు గిన్నెలని తారుమారు చేసి తోమడం చూసి కల్యాణి సహించలేకపోయింది. అందువలన గిన్నెలని పడేసి త్వరగా అక్కడనుంచి వెళ్ళిపోవడం ఆమె అలవాటు. కాని ఆ రోజు అన్నం, పులుసు అదికంగా మిగిలాయనే కారణం వలన, మనసొప్పక, లోపలినుంచి ఒక విస్తరాకు తీసుకురావాలనుకుంది. కాని అంతలోనే ఆ ఖైదీ అన్నంని ఒక ముడుచుకున్న కాగితంలో పెట్టుకొని అత్యాశతో తినడం చూసింది. అతని ముఖం చూసి ఆమె కళ్ళు కన్నీరుతో నిండాయి.

భర్తకి చెప్పింది. "అవును మరి. జైలులో వాళ్ళకిచ్చే ఆహారం జొన్నలూ, గంజీయే కదా?" అని అన్నాడు రంగన్.

ఈ ఖైదీలకి జీతం ఇవ్వ వద్దు. సరే, కడుపుకి తగిన భోజనం ఇవ్వకూడదా? కల్యాణి ఆలోచించింది; మనసు కుదుటబడింది: మన దేహంలోని ప్రాణం, శక్తి, మన భోజనంపై ఆధారపడివుంటుంది. తను మనసు కరిగి - ఈ ఖైదీలకి - ఏమైనా ఇవ్వకూడదా? దానమే ధర్మం అని పెద్దలన్నారుగా? దయతో ఎది ఇచ్చినా అది ధర్మం కిందే లెక్క. ఆ ఆలోచన రాగానే కల్యాణిలో ఒక విధమైన తృప్తి, నిమ్మళం,

ఎప్పుడో, ఎక్కడో చూసి ఆనందించిన పసిపాప మొహంలాగ, మెల్లమెల్లగా ఆమెని ఆకట్టుకున్నాయి.

** ** **

"తల్లీ!" అని చేతులు పిసుక్కుంటూ ఒక ఆడపిల్ల - ఖైదీ - ఎదుట నిలబడింది.

"ఏం కావాలి?" అని కల్యాణి అడిగింది.

"నువ్వు ఊరునుంచి కొత్తగా వచ్చినప్పుడు నేను పిండి దంచాను . . . నువ్వప్పుడు నాకు రెండు అణాలు ఇచ్చావు . . . గుర్తుందా?"

"అవును, ఇచ్చాను."

"ఆ తరువాత నీ ఇంట్లో రెండుసార్లు పని చేసాను . . . నువ్వేం ఇవ్వలేదు తల్లీ! . . . ఇవాళ ఏమైనా? . . . " అని నవ్వుతూ ఆమె బతిమాలింది.

"కావాలా?" అని అడిగి కల్యాణి దీర్ఘంగా చూసింది.

"నీ దయ తల్లి . . ."

"సరే, ఉండు!" అని చెప్పి కల్యాణి లోపలికి వెళ్ళి చిల్లర తీసుకొని వచ్చి దానికి ఇచ్చేసింది. "డబ్బు ఇవ్వొద్దు, ఇవ్వకూడదు!" అని రంగన్ కచ్చితంగా ఆమెకి చెప్పివున్నాడు. అందువలనే ఇంతకుముందు ఓ రెండు సార్లు కూలీకని దానికి ఏమీ ఇవ్వలేదు. ఆ మోమాటం వలన ఆ అమ్మాయినే నౌకరీకి కల్యాణి రమ్మని మళ్ళీ మళ్ళీ పిలిచింది. ఇప్పుడు కల్యాణికి కొంచెం ఊరడింపు కలిగింది. దానికి ఒక అణా, రెండు అణాలు, అని ఏమైనా ఇస్తే తనకి మనశ్శాంతి; ఆ ఖైదీ చేసిన మేలుకి సంతోషించి, దండం పెట్టి వెళ్ళిందే? ఈ చిల్లర ఖర్చులగురించి కల్యాణి భర్తకి చెప్పలేదు. ఇల్లాలుగా తనకి కొన్ని హక్కులు లేవా? అతనికెందుకు తెలియాలి?

కల్యాణి చేసిన పిండివంటలు చూసి రంగన్ మురిసిపోయాడు. ఆమె ఉత్సాహంతో పలరకాల తినుబండారాలు చేసింది. ఆమె తల్లి నేర్పినవీ, పాక పద్ధతుల గురించి తనే చదివినవీ - ఇవన్నీ ఆమె వంటకి దోహదం చేసాయి. "సరే, మనింటికి రోజూ పనిమనిషి వస్తోంది! నీకిక ఎటువంటి భయమూ లేదు! నువ్వు బ్రహ్మాండంగా పిండివంటలు చేస్తున్నావ్!" ఇని రంగన్ భార్యని పొగడాడు.

"ఇవన్నీ నాకు అలవాటే!" అని కల్యాణి ఆమోదించింది. "కూలికి డబ్బిస్తున్నాను!" అని అతనికి చెప్పాలనుకుంటుంది, కాని వెంటనే మరిచిపోయింది; కావాలనే మరిచిపోయింది.

ఒక రోజు చిక్కుకుంది!

"డబ్బు తక్కువగా ఉందే, ఎందుకు? నేను సరిగ్గా లెక్కపెట్టి ఆరు రూపాయలు, పన్నెండణాలు ఉంచాను. ఇప్పుడు పేపరువాడు వస్తాడే?" అని ఆ రోజు రంగన్ అంగలార్చుకున్నాడు.

"నేనే తీసాను. నాకు మరెక్కడా చిల్లర కనిపించలేదు!" అని అంది కల్యాణి.

"నేను దాన్ని ప్రత్యేకంగా వేరే కవరులో పెట్టాను. ఎందుకని? అందులోనుంచి తీయవచ్చా?"

"ఇదేం పెద్ద నేరం అంటున్నారా? మూడణాలు కావాలని వెతికాను, వెతికాను, ఎక్కడా కనిపించలేదు. ఆ తర్వాత అందులోనుంచి తీసుకున్నాను."

"ఏం, అంత అర్జంటుగా ఏం జరిగిందని?"

"అవును. అర్జంటూగా చిల్లర కావలసి వచ్చింది . . . అందుకే . . . "

"మరేం అనకు! నేను కావాలనే కవరులో ఆ రొక్కం ఉంచాను. నాకేం మతిపోయిందనుకున్నావా?" అని రంగన్ కేకలు పెట్టాడు.

అసలు ఇంత కఠినంగా రంగన్ ఎప్పుడూ మాటాడడు. ఇవాళ ఎందుకో అతనికి అంత ఆవేశం, అలుక.

'నాకు మతిపోయిందా?' అని కల్యాణికి దుఃఖం పొర్లుతూ వచ్చింది. "ఈ రోజు మీ చెల్లెలకి వడియాలు చేసి పంపుదామని ఆ పిల్లని పిండి దంచాలని పిలిచాను. దానికి మూడణాలు ఇచ్చాను. కూలిలేకుండా పని చేయించుకోడం నాకిష్టం లేదు!" అని సగం కోపం, సగం ఏడ్పుతో తన మనసు విప్పి చెప్పింది.

"అదా సంగతి? ఆహా, ఎంత పెద్దమనసు! ఎంత ఉదార గుణం!" అని రంగన్ ఎత్తిపొడిచాడు. వాకిలికి నడిచి వెళ్ళాడు. "ఇదిగో, రొక్కం ఏడు రూపాయలు; నాలుగణాలు వచ్చేమాసం బిల్లులో చేర్చుకోండి!" అని పేపరువాడికి చెప్పి లోపలికి వచ్చాడు.

కల్యాణి ఇంకా ఏడుస్తూనేవుంది. “ఏం? ఎందుకు?” అని రంగన్ ఆమెను చూడనూలేదు, అడగనూలేదు. ఆ రోజంతా దంపతులమధ్య అసమానత చోటుచేసుకుంది. కల్యాణి మాత్రం ఒకసారి ఎర్రబడిన తన మొహంలో వజ్రం బేసరి మెరుస్తూంటే భర్తకి చెప్పింది: “ఇవాళ ఎంత పెద్ద మాట అన్నారు మీరు! అది నేను ఈ జన్మలో మరిచిపోను!” అని మొరబెట్టుకుంది.

“అవును. నేను అన్నాను. నిజం! నువ్వేం చేస్తావ్?”

“మా ఇంటికి వెళ్తాను.”

“సరే వెళ్ళు!”

దానితో దంపతులమధ్య సంభాషణ ఆగింది; ఇద్దరూ మౌనం వహించారు.

“చిన్నాని వెంటనే పంపించండి. కల్యాణి వాడితో వెళ్ళనీ! మేం ఇద్దరం సంతోషం లేకుండా ఉంటున్నాం!” అని రంగన్ టెలిగ్రాం ఇచ్చేసాడు.

** ** **

“చిన్నాకి ఏం తెలుసు? వాడు కుర్రవాడు! భార్యాభర్తలమధ్య ఏదో ఘర్షణ! నేను వెళ్తాను!” అంది తల్లి.

“నేనే వెళ్ళాలని నిశ్చయం చేసుకున్నాను,” అన్నారు తండ్రి.

“అదీ మంచిదే. నేను వెళ్తే అమ్మాయి నాతో ఏదైనా మొరబెట్టుకుంటుంది; నాకూ ఇబ్బందిగా ఉంటుంది” అని తల్లి సరేనంది.

నాన్నగారిని చూసి కల్యాణికి ఆశ్చర్యం కాని, కలత కాని తోచలేదు; నవ్వుతూ అతనికి స్వాగతం చెప్పింది.

“నువ్వు చిన్నాని ఎదురుచూసావా?” అని అతను అడిగారు.

“అమ్మ - లేకపోతే మీరే వస్తారనే నా ఆలోచన.”

“అల్లుడుగారు టెలిగ్రాం ఇచ్చారుకదా, నీకు చెప్పే ఇచ్చారా?” అని అడిగి అతని వైపు తిరిగి చూసారు; రంగన్ పక్కనే నిలబడివున్నాడు.

“అల్లుడుదారూ, ఏం సంగతి?”

“తర్వాత అతను నాకు మెల్లగా చెప్పారు.”

“మీలో ఎందుకు జగడం వచ్చింది?” అని కళ్ళు చిముటుతూ తండ్రి అడిగారు.

"జగడం అంటూ ఏమీ లేదు నాన్నగారూ! ఇతనన్న మాటలు విన్నారంటే . . ."

"నేను ఏం అన్నాను?"

"అవునపును . . .  మీరేం అనలేదులెండి. . . "

"సరే, సరే, దాని గురించి ఇప్పుడు మీరు దెబ్బలాడకండి! ఎందుకని నాకూ చెప్పనక్కరలేదు . . . ఏదో ఒక అల్పమైన సంగతి కదూ . . . "

"అవును. చాలా అల్పమైన సంగతే! అబ్బా, నేనన్నమాటకి ఒక ఆడదానికి ఇంత రోషం రావాలా?"

"అల్లుడుగారూ, అదేం మాటో నాకు తెలియనక్కరలేదు. అది రహస్యంగానే ఉండనీ!

"మరేంలేదు నాన్నగారూ! పిండి దంచిన అమ్మాయికి ఇతని స్పెషల్ పర్సునించి మూడణాలు తీసి ఇచ్చాను. అదేం పెద్ద నేరమా? అందుకే ఇతను ఆ మాట అన్నారు."

"అసలు నేనేమన్నాను? ఇది స్వార్థంగా ఏదీ చెయ్యలేదని నాకు తెలుసుగా? 'నువ్వేం దొంగతనంగా కూలీ ఇస్తున్నావా?' అని అడగడానికి బదులు 'నువ్వు దొంగతనం చేస్తున్నావా?' అని అడిగానంటోంది! వెంటనే కొంప మునిగిపోయినట్టు ఏడ్పు!"

"అబ్బా . . ." అంటూ నాన్నగారు దీర్ఘంగా ఒక నిట్టూర్పు వదిలారు. ఆ తరువాత ఒక చిరునవ్వు నవ్వారు.

"కల్యాణి, నువ్వుకూడా అల్లుడుగారు గురించి ఇదే మాట అన్నది నీకు గుర్తుందా? 'బావగారు గురువు, చిన్నా శిష్యుడు!' అని అనలేదూ?" అని అతను నొక్కి అడిగారు.

"ఓ, అలాగా?" అని అశ్చర్యపడి రంగన్ ఏదో చెప్పబోయాడు. "దేవుడా, వొద్దు! నేనేమైనా అంటే danger!" అని గొణుక్కున్నాడు.

కల్యాణి నవ్వలేదు, ఆమెకు నవ్వాలని తోచనేలేదు. కాని మళ్ళీ తన మనసు విప్పి మాటాడింది.

"ఏమిటో నాన్నగారు, నాకు జ్ఞాపకం లేదు. ఇతనన్న మాటలు విని నేను చాలా బాధపడ్డాను. ఇక్కడ నౌకరీకి వస్తున్నారే, వాళ్ళకి డబ్బివ్వకూడదని ఇతను

నాకు చెప్పారు. నేను పిండి దంచిన అమ్మాయికి అప్పుడప్పుడు రెండణాలు, మూడణాలు ఇస్తాను. ఇతనికి చెప్పకుండా నేను ఏ ఖర్చూ చెయ్యను. ఇక్కడకి వచ్చినతరువాత నేనూ మారిపోయానేమో అని నా భయం. సహవాసదోషం వలన నాలోకూడా దొంగతనం వచ్చేసిందేమో అని నాలో ఒక ఆరాటం. ఇతను నన్ను తిట్టారు, కాని అంతకుముందే నాలో ఒక విధమైన చాపల్యం చోటుచేసుకుంది . . . "

"అలాగా? సరే, ఆ తరువాత?" అంటూ రంగన్ నవ్వాడు. కల్యాణి మరేం మాటలు తన నోటిలోనుంచి రాలేక మల్లాడింది.

"సరేలే, కల్యాణి! నువ్వేం బాధపడకు! నీ పెళ్ళి లాంఛనాలకి నీ అమ్మ చేసిన నేరాలకి దాన్ని ఈ జైలులో ఖైదీగా పెట్టాలంటాను! ఆ లాంఛనాలన్నీ ఎలా పోగుచేసిందో నీకు తెలుసా? చెప్పమంటావా?" అని పెద్దాయన అడిగారు.

"వద్దు, వద్దు. అది వింటే నాకు నేరం చేసినట్టు అనిపిస్తుంది. . . మరి నేను మీ అల్లుడ్నిని కదా?" అని కల్యాణిని చూస్తూ రంగన్ నవ్వాడు.

*********

**మూలం ప్రచురణ: సుదేశమిత్రన్, 1957**

# కాలక్షేపం[1]

"కాంతం, అవునుకాని, నేను రోజూ పొద్దుట పది గంటలకి ఆపీసు వెళ్లి, రాత్రి ఏడు గంటలకి ఇంటికి వస్తున్నాను. నేనింట్లో లేనప్పుడు నీకెలాగ ఉబుసు పోతోంది? నీవింట్లో ఏం చేస్తుంటావు?" అని ఒకరోజు మా ఆవిడని అడిగాను.

"దానికేంలెండి, మీరు ఆపీసుకి వెళ్ళగానే, యింటిపన్లు సవరించుకొని, ఏవో రెండు పత్రికలు చదివేసి, కొంతసేపు నిద్రపోయి లేచానంటే, యింతల్లోకి సాయంత్రం నాలుగు గంటలకు పైగా ఐపోతుంది. కాఫీ చేసి వుంచేసి వంట వండేసరికి రాత్రి ఏడు గంటలైపోతుంది. అప్పటికి మీరు వచ్చేస్తారు," అని సావధానంగా పలికింది.

కాని నాకు కాంతం మాటల్లో ఏమాత్రం నమ్మకం కలుగలేదు. అబ్బో, మాకాంతం ఏమిటి, పదిగంటలసేపు ఎక్కడికీ వెళ్ళక, యెవరితోనూ మాట్లాడకుండా ఉండడమేమిటి? అది అసలు నాతో ఎప్పుడూ ఏదో వాగుతూనే ఉంటుందికదా? 'సరే, దీనిమాటల్లో ఎంతవరకు కల్లనిజములు కలిసియున్నాయో తెలుసుకోవాలి,' అని నా మనసులో నిశ్చయించుకున్నాను.

ఆ రోజు ఆఫీసునుంచి యింటికి వేగంగానే వచ్చేసాను. రోజూ నేను ఐదు గంటలకి ఆఫీసు వదలగానే ఏ బీచికో, పార్కుకో, స్నేహితుల ఇళ్ళకో వెళ్ళి రాత్రి ఏడు గంటలకి ఇంటికి వస్తూవుంటాను. కాని ఆవేళ మాత్రం కాంతం సంగతి తెలుసుకోవాలని, మరెక్కడకీ వెళ్ళకుండా, ఆఫీసునుంచి తిన్నగా యింటికే వచ్చేసాను. నేననుకున్నట్లే కాంతం ఎక్కడికో బయలుదేడానికి డ్రెస్సయి, తయారుగా ఉంది.

---

[1] ఈ ప్రచురంచని కథ రచయిత్రి 'ఇందు' అనే కలంపేరులో తెలుగులో రాసారు.

నన్ను చూడగానే "ఏమండోయ్, మీరివాళ ఇంటికి వేగంగా దయచేసారే?" అని నవ్వుతూ వెటకారంగా అంది. "లేదు, కాంతం, ఇవాళ జోరుగా తలనొప్పి వేసింది; ఆఫీసులో సెలవు తీసుకొని వచ్చేసాను," అని అన్నాను.

"సరేలెండి . . . వంటింట్లో ఫ్లాస్కులో కాఫీ పోసిపెట్టాను. నేను కమలా వాళ్ళింటికి వెళ్ళివస్తాను," అని అంటూ కాంతం గబ గబా తన గదిలోకి వెళ్ళింది.

నేను కాఫీ తాగేసి, హాలులోకివచ్చి, మేజావద్ద నిల్చుని ఉన్నాను. కాంతం తన గదిలో, అద్దానికెదురుగా నిలబడి మొహంకి పవుడరు అద్దుకుంటోంది. కొంతసేపటికి "ఏమండీ, మీరుగాని ఎక్కడైనా నా సిల్కు hand kerchief చూసారా?" అని అడుగుతూ గదిలోనించి హాలుకి వచ్చింది.

"అబ్బే, నాకేంతెలుసు నీ రుమాలు గురించి? నేనెక్కడా చూడలేదు; ఇప్పుడేగా ఇంటికి వచ్చాను?" అని అన్నాను.

"అయ్యో, సరికొత్త రుమాలండీ! నిన్ననే కొన్నాను. ఎంతో అందంగానూ, ఫేషణబుల్ గానూ కనిపించింది. ఇవాళే పైకితీసాను. నిష్కారణం, ఎక్కడో మంచి రుమాలు పోయింది," అని గొణుక్కుంటూ గదిలో వెదకడం మొదలుబెట్టింది.

"ఛీ, ఛీ, ఎందుకలా గాబరా పడతావ్? ఎక్కడ పోతుంది నీ రుమాలు? ఇక్కడే ఎక్కడైనా ఉంటుందిలే . . . నెమ్మదిగా వెతకితే దొరుకుతుంది."

కాంతం మళ్ళీ హాలు, వంటిల్లు, తన గది, ఏ ఒక్కచోటా మిగలకుండా, జల్లెడ వేసినట్లు వెదికింది. కాని, ఊహూం, ఆ రుమాలెక్కడైనా దొరుకుతేగా?

"అయితే, కాంతం, యివాళ మధ్యాహ్నం యెక్కడికైనా, యెవరింటికైనా వెళ్ళావేమో? అప్పుడు నీ దగ్గర రుమాలు ఉందో లేదో బాగా జ్ఞాపకం తెచ్చుకో!" అన్నాను.

వెంటనే కాంతం ఇలా గొణగడం ప్రారంభించింది: "అబ్బే, అప్పుడంతా నా దగ్గరనే అది జాగ్రత్తగావున్న జ్ఞాపకముంది. మొదట లక్ష్మీకాంతం ఇంటికి వెళ్ళినప్పుడు నా మొల్లో దోపుకొని ఉన్నాను. తోవలో, ఆ రుమాలుతో మొహం తుడుచుకున్నానుకూడాను. ఆ తరువాత వాళ్ళింటినుంచి మిస్సెస్

శంకరంగారింటికి వెళ్ళాను. ఆవిడకూడా నా రుమాలు చూసి, 'ఎక్కడ కొన్నావమ్మా యిది, చాలా బాగుందే?" అని అడిగారు. అక్కడనుంచి white shop కి వెళ్ళి రెండు జాకెట్టు గుడ్డలు ఐదు రూపాయలకి కొన్నాను. షాప్ వాడుకూడా రుమాలుచూసి, 'అమ్మగారూ, నిన్నయిక్కడ మీరు కొన్న రుమాలు బాగుందా?' అని అడిగాడు. అక్కడనుంచి నిన్న బేసరీకి ఆర్డరిచ్చినవాడి దగ్గరకి వెళ్ళి 'బేసరి తయారయిందా?' అని అడిగాను. వాడు ఇంకా రెండు రోజులతరువాత రమ్మన్నాడు. సరే అని మిస్ కలావతి ఇంటికి వెళ్తే, ఆమెకూడా నా రుమాలుచూసి చాలా ఫేషణబుల్ గా వుందని చెప్పింది. ఇంటికి వస్తూండగా నా కళ్ళో ధూళి పడ్డాది. అదికూడా రుమాలుతో తుడుచుకున్నాను. ఇంటికి వచ్చినదాకా వుందికదా, మరి ఎక్కడకి పోయుంటుంది చెప్మా? . . . అయ్యో, కర్మం . . . సరికొత్త రుమాలు నిష్కారణంగా పోయింది! . . . నాకు తల్చుకుంటే ఇంతా అంతా దుఃఖంకాదు . . . అలాగుంది నా సంగతి . . ." అని నొచ్చుకుంది.

నేను నవ్వుకున్నాను. "ఐతే అది ఎక్కడికో రెక్కలు కట్టుకొని ఎగిరిపోయుంటుందా ఏమిటి? సరే, నువ్వుకూడా రెక్కలంటించుకొని, దాన్ని వెంటబెట్టు," అని నవ్వుతూ అన్నాను.

"అబ్బ, పోనిద్దురూ, మీకు హాస్యంగా, నవ్వుగా వుంది - నేనిలా ఏడుస్తూవుంటే . . . " అని అంది కాంతం సగం నవ్వుతూనూ, సగం ఏడుస్తూనూ.

"ఐతే, కాంతం, ఇక్కడేవుండు, నేను వెళ్ళి వెతుకుతాను," అని వంటింట్లోకి పోయి, ఆ రుమాలుని చేత్తో పట్టుకొని హాలుకి వచ్చాను. కాంతం, సంతోషంతో నా చేతుల్లోనుంచి దాన్ని లాగ్గుంది.

"చూసావా కాంతం, నేనెంత వేగం వెతకితెచ్చానో? నీకు వెతకడం చేతకాదు. కాని పోగొట్టుకొని ఏడవడంమాత్రం బాగా తెలుసు."

"ఐతే అది ఎక్కడ వున్నండీ?"

"అదుగో, వంటగదిలో ఆ స్టాండుపక్కనే వుంది. వెళ్ళగానే అగుపడ్డాది. తీసుకువచ్చాను."

"నేను వెతికినప్పుడు అక్కడ లేనేలేదే . . .?"

"వహ్వా! అంత చక్కగా కళ్ళుపెట్టుకొని చూసావన్నమాట!"

కాంతం నవ్వి ఊరుకుంది.

"కాంతం, నేనాఫీసుకి పోయినప్పుడు నీకెలా ఉబుసు పోతుందని నాకు ఇప్పుడు బాగా తెలిసింది. నేనడిగినప్పుడు వంటన్నావ్ . . . జ్ఞాపకం తెచ్చుకో . . . అమ్మోయ్, నువ్వెంత చలాకీదానివి! . . . నేను నీ మాటల్లో నిజమెంతవరకున్నదో తెలుసుకోవాలనే ఈ రుమాలు దాచాను . . ." అని అన్నాను.

ఏమీ అనకుండా కాంతం గిర్రున తిరిగి తన గదిలోకి వెళ్ళిపోయింది.

పాఠకులారా! చూసారా, మా కాంతం నేనాఫీసుకి వెళ్ళినప్పుడు ఎలా కాలక్షేపం చేస్తుందో?

********



# వింధియా గురించి రాజం కృష్ణన్

*“రచయిత్రి ఈ కథలు భారత దేశం స్వాతంత్రోద్యమంలో విజయం అందుకున్న తరువాత రాసారు. రెండవ ప్రపంచయుద్ధం మూలాన ఏర్పడిన శిధిలావస్థలో మన దేశ విజయం చాలా విశిష్టమైనది. ఎక్కడచూసినా ఒక ఆశావాదిత వాతావరణం; ‘మరేం కలత వద్దు, మానవజాతి అభ్యుదయ మార్గంలో అడుగుపెట్టడమైంది!’ అని అందరూ ఆహ్లాదించే వేళలో మన సామాజిక పునరుద్ధారణకి ఈ కథలు ప్రతిబింబాలుగా చోటుచేసుకున్నాయి. రచయిత్రి పోషించేదీ, కొనియాడేదీ ఈ కథల్లో వచ్చే నాయకి మాత్రం కాదు; నాయకుడు కూడా వర్ధిల్లడం చూస్తాం . . . . ఊ కథలన్నీ ఆకాశవీధిలో మెరుస్తున్న తారల్లాగ తమిళ సాహిత్యంకి దోహదం చేస్తున్నాయని నా నమ్మకం. ఈ కథలు భిన్న బాషలలో అనువదించబడి తమిళేతరులు చదవగలిగితే వీటిలోని విశ్వజనీనమైన సందేశాలు (universal messages) మళ్ళీ గుర్తుంచుకొని ఆనందిస్తారు . . .”*

**(1950ల నుండి దాదాపు ఐదు దశాబ్దాలకి పైగా రాజం కృష్ణన్ (1925 -2014) తమిళలకి సుపరిచితం. స్త్రీ వాదిత రచయిత్రిగా కథలూ, నవలలూ రాసి బిరుదులు, పురస్కారాలు, కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి అందుకున్నారు. ఈమె రచనలు ఎనభై పుస్తకాలుగా వెలుబడినవి.)**